తిరుమల తిరుపతి దేవస్థానములు

# సప్తగిరి

ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక

SAPTHAGIRI (TELUGU)
SPIRITUAL ILLUSTRATED MONTHLY
Volume:55, Issue: 03
August - 2024, Price Rs.20/-.

ఆగస్టు 2024
వెల రూ. 20/-
పుటలు - 56



ప్రసీద మే మహాలక్ష్మి! సుప్రసీద మహాశివే ।
అచలా భవ సంప్రీత్యా సుస్థిరా భవ మద్గృహే ॥

( ఈ నెల 16 న శ్రీ వరలక్ష్మీ వ్రతం )




19-06-2024 నుండి 21-06-2024 వరకు తిరుమలలో జరిగిన శ్రీవారి జ్యేష్ఠాభిషేకమహోత్సవ దృశ్యాలు.
ఈ కార్యక్రమంలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామల రావు, ఐ.ఏ.ఎస్., దంపతులు పాల్గొన్నారు.



17-06-2024 నుండి 21-06-2024 వరకు
తిరుచానూరులో జరిగిన శ్రీపద్మావతీ అమ్మవారి తెప్పోత్సవ దృశ్యాలు



27-06-2024 నుండి 29-06-2024 వరకు
తిరుచానూరులో జరిగిన శ్రీసుందరరాజస్వామివారి అవతారోత్సవ దృశ్యాలు.



# గీతాశ్లోకార్థసారం

**శ్లో : యఏనం వేత్తి హన్తారం యశ్చైనం మన్యతే హతమ్**
**ఉభౌ తౌ న విజానీతో నాయం హన్తి న హన్యతే॥**

(శ్రీమద్భగవద్గీత 02వ అధ్యాయం-19వ శ్లోకం)

**ప్రతిపదార్థం:** యః= ఎవడు; ఏనమ్= ఈ(శరీరమందలి) ఆత్మను; హన్తారమ్= చంపువానినిగ; వేత్తి= తెలిసికొనుచున్నాడో, యశ్చ= ఎవడు; ఏనమ్= వీనిని; హతమ్= చంపబడినవానినిగ; మన్యతే=తలంచునో; తౌ ఉభౌ= ఆ ఇద్దరును; న విజానీతః= తెలిసినవారుకారు; అయమ్= ఈ ఆత్మ; న హన్తి= చంపుటలేదు; న హన్యతే చ= చంపబడుటయు లేదు.

**భావం:** ఎవడీ యాత్మను చంపువానినిగ నెఱుగునో లేక ఎవడు చంపబడువానినిగ భావించునో, వారిరువురును వాస్తవమెఱిగినవారు కారు. యథార్థముగ ఈ ఆత్మ దేనిని చంపుటలేదు, దేనిచేతను చంపబడుట లేదు.

## పరమపురుషం గోపాలబాలం

భావయామి గోపాలబాలం మన
స్సేవితం తత్పదం చింతయేహం సదా

కటి ఘటితమేఖలా ఖచితమణిఘంటికా
పటలనినదేన విభ్రాజమానం

కుటిలపదఘటితసంకుల శింజితేన తం
చటులనటనాసముజ్జ్వలవిలాసం

నిరత కరకలితనవనీతం బ్రహ్మాది
సురనికరభావనాశోభితపదం
తిరువేంకటాచలస్థిత మనుపమం హరిం
పరమపురుషం గోపాలబాలం (సంపుటం-1; అధ్యాత్మ సంకీర్తన-137)

*బాలకృష్ణుడు పారాడుతూ, నడుస్తూ, నృత్యం చేస్తున్న దృశ్యాన్ని ఇలా వర్ణించాడు అన్నమయ్య.*



*గోపాలుడైన బాలకృష్ణుణ్ణి తలుస్తాను. ఆతని దివ్యపాదాలను మనస్సులో ఎల్లప్పుడూ ధ్యానిస్తూ ఉంటాను. బాలకృష్ణుడు చిన్న చిన్న అడుగులు వేస్తూ నడుస్తూ ఉంటే ఆ బాలుని మొలతాడుకు కట్టిన చిఱుగంటలు మనోహరంగా మ్రోగుతున్నాయి. మనకు ఆనందం చేకూర్చ డానికి వ్యత్యస్తంగా పాదాలు వేసి నృత్యం చేస్తు న్నాడు, కాళ్లకు తొడిగిన అందెలు ఘల్లుఘల్లు మంటూ మ్రోగుతూంటే ఆ నృత్యవిలాసం కన్నుల పండుగగా, కర్ణపర్వంగా ఉంది. ఆ నాట్యపు సొగసు మరెక్కడా ఉండదు. అది బాలకృష్ణునికే ప్రత్యేకం.*



*అమ్మ యశోదమ్మ ప్రేమతో పెట్టిన వెన్నముద్ద చేతిలో పట్టుకుని మురిసిపోతూ మెరిసి పోతున్నాడు. బ్రహ్మ మొదలయిన దేవతలందరూ చేత వెన్నముద్దతో, చిట్టి అడుగులతో నడిచే శ్రీకృష్ణుని తమ ఆలోచనలలో నింపుకుని ఆనందపడుతున్నారు. సాటిలేని బాలుణ్ణి నన్ను రక్షించమని వేడుకుంటాను అని అన్నమయ్య సంకీర్తించాడు.*

## 'సప్తగిరి' సకాలంలో చేరాలంటే...

01) పాఠకులు తాము 'సప్తగిరి' చందాదారులుగా చేరినప్పుడు ఇచ్చిన చందానెంబరును మరొక్కమారు పరిశీలించుకోగలరు.

02) ఎందుకంటే.. 'సప్తగిరి' పత్రిక ఒకవేళ అందనివారు, ఆ చందా నెంబరు కార్యాలయానికి చేరవేసి వివరాలు పొందవచ్చు.

03) 'సప్తగిరి' పత్రిక సకాలంలో చేరకపోయినా, చిరునామాలో మార్పులు ఉన్నా ఈ-మెయిల్ (chiefeditortpt@gmail.com)ఐడిని సంప్రదించాలి.

04) ఈ-మెయిల్ సౌకర్యంలేని వారు 0877-2264543, 0877-2264359 నెంబర్లకు ఫోన్ చేసి, చందా నెంబరు చెప్పి సమస్య పరిష్కరించుకోవచ్చు.

05) నేరుగా సంప్రదించదలచినవారు ప్రధాన సంపాదక కార్యాలయ పనివేళల్లో "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ భవనం, తిరుపతి-517 507" చిరునామాలో సంప్రదించవచ్చు.

## 'సప్తగిరి' చందాదారులుగా చేరాలంటే...

01) చందాదారులుగా చేరేవారు తమ చిరునామా, పిన్‌కోడ్, సెల్‌ఫోన్ నెంబరును, మీకు కావలసిన పత్రిక భాషను స్పష్టంగా రాసి పంపాలి.

02) 'సప్తగిరి' పత్రిక సంవత్సర చందా రూ.240/-.

03) 'సప్తగిరి' పత్రిక జీవిత చందా (12 సంవత్సరాలు మాత్రమే) రూ.2400/-

04) 'సప్తగిరి' పత్రిక ఇతర దేశాలకు సంవత్సర చందా రూ.1030/-

05) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు డి.డి./ ఈ.ఎం.ఓ./ ఐ.పి.ఓ./ ఆన్‌లైన్ (ttdevasthanams.ap.gov.in) ద్వారా నమోదు చేసుకోవచ్చు.

06) 'సప్తగిరి' పత్రిక చందాను పాఠకులు ఏ జాతీయబ్యాంకులోనైన "చీఫ్ ఎడిటర్, సప్తగిరి మ్యాగజైన్, టి.టి.డి., తిరుపతి" పేర డి.డి. తీసి పోస్టు ద్వారా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, తిరుపతి-517 507" ఈ చిరునామాకు పంపవచ్చు.




తిరుమల తిరుపతి దేవస్థానముల ఆధ్యాత్మిక సచిత్ర మాసపత్రిక

# సప్తగిరి

సంపుటి : 55 ఆగష్టు, 2024 సంచిక : 03


వేంకటాద్రిసమం స్థానం బ్రహ్మాండే నాస్తి కించన।
వేంకటేశ సమో దేవో న భూతో న భవిష్యతి ॥


**గౌరవ సంపాదకులు**
శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్.,
కార్యనిర్వహణాధికారి, తి.తి.దేవస్థానములు.

**ప్రచురణకర్త-ప్రధాన సంపాదకులు**
డా॥ కె.రాధారమణ, ఎం.ఏ.,ఎం.ఫిల్.,పిహెచ్.డి.,

**సంపాదకులు**
డా॥ వి.జి.చొక్కలింగం, ఎం.ఏ., పిహెచ్.డి.,

**ఉపసంపాదకులు**
డా॥ కంపల్లె రవిచంద్రన్,
ఎం.ఏ., ఎం.ఫిల్., పిహెచ్.డి.,

**ముద్రాపకులు**
శ్రీ పి.రామరాజు, ఎం.ఏ.,
ప్రత్యేకాధికారి (పుస్తకవిక్రయకేంద్రం & ముద్రణాలయం),
తి.తి.దే., తిరుపతి.

**ఫోటోలు**
శ్రీ పి.ఎన్.శేఖర్, చీఫ్ ఫోటోగ్రాఫర్, తి.తి.దే.
శ్రీ బి.వెంకట్రమణ, ఫోటోగ్రాఫర్, తి.తి.దే.

ఇతర వివరాలకు ఫోన్ నెంబర్లు
సంపాదకులు -0877 -2264360
కార్యాలయం -0877 -2264543
0877 -2264359

విడి ప్రతి : రూ. 20/-
సంవత్సర చందా : రూ. 240/-
జీవితచందా (12 సం॥లకు) : రూ. 2400/-
విదేశాలకు సం॥చందా : రూ. 1030/-

వెబ్‌సైట్- ttdevasthanams.ap.gov.in;
'సప్తగిరి' మాసపత్రికకు సంబంధించిన సలహాలు / సూచనలు / ఫిర్యాదులు-
sapthagiri.helpdesk@tirumala.org;
ద్వారా తెలియజేయవచ్చు.

24 గంటలూ పనిచేసే ఈ క్రింది తి.తి.దే. కాల్‌సెంటర్ ఫోన్‌నెంబర్లకి ఫోన్ చేసి తి.తి.దే.కి సంబంధించిన సమస్తసమాచారాన్ని మీరు తెలుసుకోవచ్చు.
0877 2277777 / 2233333


## ఈ నెలలో....


| | | |
|---|---|---|
| ఆలయ పవిత్రతకు లోపం రానీయకుండా... | శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం | 07 |
| శ్రీవేంకటాచలమాహాత్మ్యం (వచనం) | ఆచార్య కె.సర్వోత్తమరావు | 11 |
| సారంగపాణి తలపుల్లో శ్రీకృష్ణుడు! | డా॥ కంపల్లె రవిచంద్రన్ | 12 |
| తిరుమల సమయాచారములు | కీ.శే. డా॥ఎన్.సి.వి.నరసింహాచార్యులు<br>కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు | 15 |
| సందేహాలు-సమాధానాలు | బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ | 16 |
| రారా కృష్ణయ్యా! | శ్రీమతి చెవుటూరి కుసుమకుమారి | 17 |
| కోరింది కోరినట్లు లభిస్తుంది! | శ్రీ గరిమెళ్ల శరవణ దీక్షితులు | 20 |
| వేదాలను ఉద్ధరించిన స్వామి | డా॥ కె.రాధారమణ | 21 |
| మాటలకందని మాధుర్యం... | శ్రీమతి యడవల్లి మృదుల లక్ష్మి | 22 |
| పిల్లలు పుడతారు ఈ స్వామిని కొలిస్తే... | శ్రీమతి రమాశాండిల్య | 24 |
| తిరువైగుందవిణ్ణగరమ్ (108 దివ్యదేశాలు) | ఆచార్య చక్రవర్తి రంగనాథన్ | 26 |
| గోపూజా విధానం (వర్ణపుటలు) | | 27 |
| నీ పూజ చేసేము తల్లీ! | శ్రీమతి జానపాటి మనస్విని | 31 |
| మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు | ఆంగ్లమూలం- శ్రీలక్ష్మీనరసింహన్ శ్రీధర్<br>తెలుగు - శ్రీదేవీ మురళీధర్ | 33 |
| స్వామిచేతిలో ఎప్పుడూ ఉండాల్సిందే! | డా॥ ఆకెళ్ల విభీషణశర్మ | 34 |
| అన్ని సమస్యలకు ఔషధం... | డా॥ ఈ.ఏ.సింగరాచార్యులు | 35 |
| పొట్టనిండా పాలుపోసేము తండ్రీ! | డా॥ డి.ఉదయకుమార్ | 36 |
| అంతులేని బలం... ఆయనకే సొంతం | డా॥ కప్పగంతు రామకృష్ణ | 38 |
| ఆయన అన్నీ గమనిస్తుంటాడు | శ్రీ గొరవ ధనుంజయ(USA) | 40 |
| సృష్టిలో తీయనిది! | డా॥ తాడేపల్లి వీరలక్ష్మి | 42 |
| ఓర్పు అవసరం | శ్రీమతి నల్లాని రాజేశ్వరి | 43 |
| అమృతంతో సమానం | డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ | 45 |
| ఈ భాష అజరామరం...! | సారస్వతకళానిధి, డా॥వెలువోలు నాగరాజ్యలక్ష్మి | 46 |
| సంస్కృతం నేర్చుకుందాం..!! | రచన - కీ.శే.మహామహోపాధ్యాయ కె.కృష్ణాచార్య<br>నిర్వహణ- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ | 47 |
| దేనికైనా ముందుచూపు ఉండాలి...(చిత్రకథ) | కథ : డా॥ కంపల్లె రవిచంద్రన్<br>చిత్రాలు : శ్రీ తుంబలి శివాజీ | 48 |
| బాలవినోదం | | 50 |
| రాశిఫలాలు | బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి | 51 |
| తగనిపనులు | కీ.శే.విద్వాన్ కట్టానరసింహులు | 52 |
| అహంకారం ఆత్మనాశనం | డా॥ వద్దేపల్లి శ్రీనివాసరావు | 52 |
| క్విజ్ | | 53 |
| వైకుంఠపాళి | శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు | 54 |


ముఖచిత్రం : శ్రీ పద్మావతీఅమ్మవారు, తిరుచానూరు
వెనుకచిత్రం : శ్రీ రాజగోపాలుడు (చిత్రకారుడు: బాలాజీశ్రీనివాసన్, చెన్నై)



ఇందులోని వ్యాసాలు, అభిప్రాయాలు రచయితల వ్యక్తిగతమైనవి. వాటికి తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యం బాధ్యత వహించదు.

# మము కాపాడు శుభకల్పవల్లీ!

**సర్వజ్ఞే! సర్వవరదే! సర్వదుష్టభయంకరి!**
**సర్వదుఃఖహరే! దేవి! మహాలక్ష్మి! నమోఽస్తు తే။**

శ్రావణమాసం రావడమే మనకు ఒక పండుగ! స్త్రీలు సంప్రదాయంగా జరుపుకునే నోములు, వ్రతాలు అన్నీ ఈ మాసం నుంచే ప్రారంభమౌతాయి. అటు చూస్తే ఆకాశంలో దోబూచులాడే మబ్బులు, అడపాదడపా వర్షించే చిట్టిపొట్టి చినుకులు, ఇటు చూస్తే సంప్రదాయ వస్త్రాలతో, చేతిలో పళ్లు, తాంబూలాలు, శనగలమూటలతో కళకళలాడుతూ సాగిపోయే పేరంటాళ్లు శ్రావణంలో కన్పిస్తారు. కొన్ని నియమితసమయాల్లో, కొన్ని నియమనిష్ఠలతో నోములు, వ్రతాలు ఆచరించడం మహిళలకు అనూచానంగా ఏర్పడ్డ సంప్రదాయకమైన ఆచారం. దీన్ని ఒక విధిగా, ధర్మంగా స్వీకరించి భగవదర్చన చేయడం, మనదేశంలో స్త్రీలు ఇప్పటికీ కాపాడుకుంటూ వస్తున్న సంప్రదాయం. ఆచారం పట్ల విశ్వాసాన్నీ, ఆస్తిక్యభావాన్నీ ప్రదర్శించడం కోసమే కాక కుటుంబసంక్షేమాన్నీ, విశ్వశ్రేయస్సునీ కోరుకుంటూ, పదిమందితో తమ స్నేహాన్ని, ఆనందాన్ని పంచుకోవడం కూడా ఈ నోములూ, వ్రతాల వెనుక ఉండే ఆంతర్యం.

హిందూధర్మంలో శ్రీలక్ష్మి మంగళదేవత. మంగళసూత్రం భారతస్త్రీలకు అతి పవిత్రమైంది. లక్ష్మీదేవి సంతానానికి అధిదేవత. స్త్రీలు ఇష్టార్థసిద్ధికోసం వరలక్ష్మీదేవిని శ్రావణ మాసంలో పూజించడం ఆచరణలో ఉంది. సమృద్ధిగా పెరిగే పంటలను కూడా లక్ష్మీరూపంలో పూజించడం ఒక సంప్రదాయం. సౌభాగ్యదాయిని అయిన లక్ష్మిని ముత్తైదువులు సువర్ణరూపంగా తమ మాంగల్యంలో ధరిస్తారు. ఈమె పసుపు, కుంకుమలకు చిహ్నం. లక్ష్మీదేవి సర్వాభరణ సంపన్నురాలు. ముత్తయిదువతనం, సత్సంతానప్రాప్తి, సకలసౌభాగ్యాలకోసం స్త్రీలు మంగళప్రద వరదాయిని అయిన శ్రీవరలక్ష్మీదేవిని పూజిస్తారు.

దేశసౌభాగ్యంకోసం లక్ష్మీదేవిని పూజించినవారున్నారు. విజయనగరరాజ్యస్థాపనకు కారకులైన విద్యారణ్యులు శ్రీలక్ష్మిని ధ్యానించి బంగారువర్షం కురిపించారు. ఆదిశంకరులు 'కనకధారా' స్తోత్రంతో ఒక పేదరాలికి నిధిని అర్పించారని ప్రతీతి. జగన్నాయకి అయిన లక్ష్మీదేవిని స్తుతించడంవల్ల కల్గే ఫలం– అనంతం. అపూర్వం. మహత్త్వపూర్ణం. తనను స్తుతించే వాళ్లను తనంతవాళ్లను చేసి, అందరూ వాళ్లను కొల్చేట్టుగా చేస్తుంది. ఇంతకంటే ఐశ్వర్యం, వైభవం మరేముంది? జగదారాధ్యను కొలిచి, తాము జగదారాధ్యులు కావడం అనంతమహిమ నొందడమే కదా! అమ్మవారిపాదపద్మసేవ సకలశ్రేయస్కరం! మంగళం, ధర్మం, క్షేమం, శుభం, మోక్షం, ఆనందం, భాగ్యం– మొదలైనవన్నీ శ్రేయస్సులే! శ్రీదేవీపాదసేవాఫలంగా ఇవన్నీ లభిస్తాయి. కనుకనే శ్రీసూక్తంలో 'త్వత్పాదపద్మం మయి సన్నిధత్స్వ', "అమ్మా! నీపాదపద్మాన్ని నాయందు ఉంచు"మని ప్రార్థించడం అత్యంత సమంజసం! ఆయాదేవతాశక్తుల్ని వారివారి పాదపద్మాలందే భావించి, ఉపాసించడం మంత్రశాస్త్రసంప్రదాయం.

లక్ష్మీదేవి అడుగుపెట్టిన ఇంట్లో సకలసౌభాగ్యాలు తాండవిస్తూ ఉంటాయి.



# ఆలయపవిత్రతకు లోపం రానీయకుండా...

- శ్రీ జూలకంటి బాలసుబ్రహ్మణ్యం, 99856 70152

నిత్యకల్యాణం పచ్చతోరణంగా ప్రసిద్ధికెక్కిన తిరుమల పుణ్య క్షేత్రాన్ని నిత్యమూ వేలాదిమంది భక్తులు సందర్శిస్తూ ఉంటారు. ఆపదమొక్కులదేవుడైన వేంకటే శునకు మొక్కుబళ్లు చెల్లించ డానికి యాత్రికులు ఎల్లప్పుడు తిరుమలకు వస్తూ ఉంటారు. ఇలా మొక్కుబళ్లు తీర్చడానికి, లేదా దర్శనానికి, తీర్థయాత్రాభి లాషతో వచ్చే యాత్రికులు, భక్తులు చాలామంది అత్యంత భక్తిప్రపత్తులతో, దీక్షబూని, పరమపవిత్రంగా తిరుమల యాత్ర చేస్తారు.

వైదికసంప్రదాయం ప్రకారం జాతాశౌచం (పురిటి మైల), మృతాశౌచం (మృతివల్ల అంటు) లేదా స్త్రీల బహిష్టు సమయాలువంటి కొన్ని సమయాల్లో క్షేత్రదర్శనం, ఆలయ ప్రవేశం నిషిద్ధం. యాత్రికులు, భక్తులు తమ తమ యాత్రల విషయంలో నియమాలను భక్తితో సక్రమంగా పాటించినప్పటికీ, తమకు తెలియకుండా ఒక్కొక్క ప్పుడు కొండకు రావడం స్వామివారిని దర్శించడం జరుగు తుంది. కొంతమంది భక్తులు తిరుమల కొండకు చేరిన తర్వాత వారికి జాతాశౌచం, మృతాశౌచం వంటివి కలుగవచ్చు. ఒక్క యాత్రికులవల్లనే గాక ఆలయంలో, విధినిర్వహణలో ఉన్న ఉద్యోగులవల్ల కూడ ఇలాంటి దోషాలు కలుగవచ్చు. అంతేగాక శ్రీ వేంకటేశ్వరస్వామివారికి జరిగే సేవల్లో, ఉత్సవాల్లో, కైంకర్యాల్లో ఏవైనా లోపాలు కలుగవచ్చు. విశేషసమయాల్లో చేరిన జనసమ్మర్దంవల్ల సమయాభావం ఏర్పడినప్పుడు స్వామి వారి సేవల వేళలు, ఉత్సవవేళలు మార్పు చేయబడి, పూజలు, అర్చనలు క్లుప్తంగా జరుపబడవచ్చు. ఇలా నిత్యపూజానివేద నాదులలో కానీ, దర్శనానికి వచ్చిన యాత్రిక జనసమ్మర్దం వల్లగానీ, ఆలయసిబ్బందివల్లగానీ తెలిసి కొన్ని దోషాలు, తెలియక కొన్ని దోషాలు జరగవచ్చు. ఇలాంటి దోషాలవల్ల ఆలయపవిత్రత కొంత తగ్గవచ్చు.

**ఈ నెల 14వ తేదీ నుండి 17వ తేదీ వరకు**
**శ్రీవారి పవిత్రోత్సవాలు**

ఆలయపవిత్రతకు ఎలాంటి లోపం రానీయకుండా నివారించేందుకు తెలిసీ తెలియక జరిగే దోషాల పరిహరణార్థం జరిగే పవిత్ర కార్యక్రమమే "పవిత్రోత్సవం". ఈ ఉత్సవాలు కేవలం ఆలయశుద్ధి, పుణ్యాహవాచనంలాంటి కార్యక్రమాలు మాత్రం కావు. సంప్రోక్షణంకంటే భిన్నమైంది పవిత్రోత్సవం.

ఈ పవిత్రోత్సవాలు తిరుమలలో చాలా పూర్వం నుంచీ జరుగుతున్నట్లు తెలుస్తోంది. 15-16 శతాబ్దాల వరకు అత్యంత వైభవంగా పవిత్రోత్సవాలు నిర్వహింపబడ్డాయి.

1464 వ సంవత్సరంలోని ఒక తమిళ శాసనంలో తిరుమల పవిత్రోత్సవాల ప్రస్తావన కనిపిస్తుంది. ఆనాడు పవిత్రోత్సవాలు జరిపించడానికి ఎలంబాక్కం అనే గ్రామాన్ని

దానం చేసినట్లు, ఎలమండ్య, విక్రమాదిత్య, మంగళం గ్రామాల్లోని దేవమాన్యాల వ్యవసాయానికై రెండు బావులు తవ్వించినట్లు తెలుస్తోంది. అంతేగాక వీటన్నింటిపై వచ్చే రాబడిని తిరువేంగడ ముడయాన్ (వేంకటాచలం) ఆలయంలోని నిత్యోత్సవ విశేషసందర్భాల్లో నివేదనకు ఆడిమాసం (శ్రావణ మాసం)లో పంచాహ్నికంగా అంటే ఐదు రోజులపాటు పవిత్రోత్స వాలు నిర్వహించేందుకు ఉపయోగించాలని దాత శ్రీమన్మహా మండలేశ్వర మేదినీ మీసర గండ కట్టారి సాళువ మల్లయదేవ మహారాజు ఈ శాసనం వ్రాయించినట్లు తెలుస్తోంది.

అంతకు పూర్వంనుంచీ తిరుమలలో జరుగుతున్న పవిత్రోత్సవాలను 1464 నుండి తన పేరిట జరిగేటట్లుగా ఈ రాజు ఏర్పాటుచేసి ఉండవచ్చు. లేదా ఆనాటి నుంచే ఈ పవిత్రో త్సవాలు తిరుమలలో ప్రారంభింపబడి ఉండవచ్చు. అంకురార్పణ రోజు కాకుండా శ్రావణమాసం శుక్లపక్షంలో ఐదు రోజులుగా పవిత్రోత్సవం జరిగేదట! ఐదవ రోజు పున్నమినాడు యజ్ఞోపవీతా లను మార్చుకునేవారట! అంతేగాక ఈ ఉత్సవాలకు కావలసిన వస్తువులు, వాటి ఖర్చు, దక్షిణలు, దానాలు వగైరాలు కూడ ఈ శాసనంలో పేర్కొనబడ్డాయి.

వేదఘోషలమధ్య పవిత్ర హోమాగ్నుల మధ్య బాజా భజంత్రీలు మోగుతుండగా శ్రీస్వామివారి ఉత్సవమూర్తులకు తామరపూసల వలె కనిపించే పవిత్రాలను అలంకరిస్తారు. పవిత్రోత్సవాల్లో ప్రతిరోజు ఉదయం, సాయంత్రం అన్న ప్రసాదాల నివేదన తప్పకుండా జరిగేది. ఈ పవిత్రోత్సవాల్లో అన్నప్రసాదాల నివేదనకు దాతలు ఎందరో దానాలు ఇస్తూ శాసనాలు వ్రాయించారు. శాసనాధారాల ప్రకారం 1562 వరకు తిరుమలలో శ్రీస్వామివారికి పవిత్రోత్సవాలు జరుపబడి నట్లు తెలుస్తోంది. ఏ కారణంచేతనో తర్వాతి కాలంలో ఈ పవిత్రోత్సవాలు ఆగిపోయాయి.

తిరుమల తిరుపతి దేవస్థానంవారు 1962సం॥ నుంచి ఈ పవిత్రోత్సవాలను పునరుద్ధరించి ప్రతిఏటా శ్రావణమాసంలో శుద్ధఏకాదశి నుండి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నారు.

అంతకుముందు రోజు అంటే నవమి నాటి సాయంత్రం శ్రీస్వామివారి సేనాపతి అయిన విష్వక్సేనులవారు పల్లకి నెక్కి, ఆలయాన్ని విడిచి, పురవీథుల్లో ప్రదక్షిణంగా వెళ్లి నైరుతి మూలలో ఉన్న వసంతమండపం చేరుకుంటారు. అక్కడ భూమి పూజ చేసి మృత్సంగ్రహణం (పుట్టమన్నును) చేసి ప్రదక్షిణంగా ఆలయప్రవేశం చేస్తారు. ఆనాటి రాత్రే అంకురార్పణమండపంలో నవధాన్యాల బీజావాపం(అంకురార్పణ) జరుగుతుంది.

ఇక పవిత్రోత్సవాల మొదటి రోజు, అంటే దశమినాటి ఉదయం సుప్రభాతం, తోమాలసేవ, కొలువు, అర్చన, మొదటి నైవేద్యం, రెండవ అర్చన, రెండవ నైవేద్యం అయిన వెంటనే దేవేరులతో కూడివున్న శ్రీమలయప్పస్వామివారు పల్లకినెక్కి పవిత్రోత్సవమండపానికి తరలివస్తారు. ఈ మండపంలో అర్చక స్వాములు ఏడు హోమగుండాల్లో అగ్నిప్రతిష్ఠ చేస్తారు. వీటి మధ్య ఒక వేదికపై నవకలశాల్ని, మరో వేదికపై ప్రాయశ్చిత్త కలశాన్ని ప్రతిష్ఠిస్తారు. వీటికి ముందుగా స్నానపీఠంపై శ్రీదేవి భూదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి(మలయప్ప) వారిని ఆసీనుల్ని చేస్తారు.

ముందుగా తామరతూడుల మాదిరిగా లేదా తులసి పూసల లాగా ఉన్న పట్టుపవిత్రాలను (పట్టు దండలు) ఈ యాగశాలలో ప్రతిష్ఠించి వైఖానసాగమోక్తంగా హోమాలు చేస్తారు. హోమం పూర్తైన తర్వాత శ్రీదేవి భూదేవి సహిత స్వామివారలకు కంకణధారణచేసి, హోమతిలకం పెట్టిన ఆ తర్వాత తెల్లని స్నానవస్త్రం ధరింపజేసి తిరుమజ్జనానికి (అభిషేకానికి) సిద్ధం చేస్తారు. భక్తులచే సంకల్పం చెప్పిస్తారు.



ముందుగా దంతధావన, ఆచమనాది అనుష్ఠాన క్రియలు సమర్పిస్తారు. ఆ తర్వాత ఒకవైపు వేదపఠనం జరుగుతుండగా, బాజాభజంత్రీలు మోగుతుండగా అభిషేకం ప్రారంభమౌతుంది. మొదట శుద్ధజలంతో అభిషేకం చేస్తారు. పిదప వట్టిగుడ్డతో తుడిచి ఆచమనాదిగా ధూప, దీప, నైవేద్య హారతులిస్తారు. ఆ తర్వాత ఆవుపాలతో అభిషేకం చేస్తారు. క్షీరాభిషేకం అయిన తర్వాత మళ్లీ శుద్ధజలంతో అభిషేకించి తుడుస్తారు. తులసి సమర్పించి ఆచమనాదులు సమర్పించి ధూపదీప నైవేద్య హారతులిస్తారు.

ఆ తరువాత వరుసగా పెరుగు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపుతో అభిషేకిస్తారు. చివరగా చందనాన్ని శ్రీస్వామివారికి, అమ్మవారలకు, కిరీటాలకు, శరీరమంతా చక్కగా అలది, తిలకం పెట్టి, తులసిమాలల్ని సమర్పిస్తారు. ధూపదీపహారతులు అయిన తర్వాత దృష్టిదోషపరిహారణార్థం 'కుంభహారతి' ఇస్తారు. ఆ తర్వాత నక్షత్రహారతి ఇస్తారు. చివరగా కలశాలలోని జలంతో శ్రీస్వామివారికి అమ్మవారలకు సహస్రధారాభిషేకం జరగడంతో అభిషేకం పూర్తవుతుంది. ఈ అభిషేకతీర్థాన్ని అర్చకస్వామి ముందు తాను చల్లుకుని, అందరిమీదా "పూతో భవ" అని చల్లుతాడు. ఆ సందర్భంలోనే శ్రీవారికి అలదిన చందనం భక్తులకు కొద్దికొద్దిగా ప్రసాదంగా ఇస్తారు. ఆ తర్వాత తెరలు వేసి స్వామివార్లను బాగా తుడిచి పట్టువస్త్రాలు సమర్పించి, అలంకరిస్తుండగా, జియ్యంగార్లు, వైష్ణవస్వాములు దివ్యప్రబంధాన్ని పారాయణం చేస్తారు. తర్వాత ఏకాంతంగా నైవేద్యం జరుగుతుంది.

ఆ తర్వాత అర్చకులు స్వామివారిని సర్వాభరణాలతో, పుష్పమాలలతో అలంకరించి, సాయంత్రం తిరుమల పుర వీథుల్లో ఊరేగిస్తారు. అనంతరం శ్రీస్వామివారు పవిత్రోత్సవ మండపానికి వేంచేస్తారు. ఈ మూడు రోజులు శ్రీస్వామివారి ఉత్సవమూర్తులు యాగశాలలోనే ఉంచబడతాయి.

ఇక రెండవ రోజు శ్రావణశుద్ధ ఏకాదశి రోజు మొదటి రోజు ప్రకారమే హోమాదులు జరిగిన పిదప శ్రీస్వామివారికి, శ్రీదేవిభూదేవులకు తిరుమంజనాదులతో యథాప్రకారంగా నిర్వహిస్తారు. నైవేద్యాలు అయిన తర్వాత శ్రీస్వామివారిని అలంకరిస్తారు. ఆ తర్వాత ముందురోజు ప్రతిష్ఠచేసిన పవిత్రాలను ఋత్విక్కులు తలపై వెండిపళ్లాలలో పెట్టుకొని వేదపారాయణలు జరుగుతుండగా, మంగళవాద్యాలు మోగుతుండగా, ఛత్రచామర గౌరవపురస్సరంగా పవిత్రమండపం నుండి బయలుదేరి, ధ్వజస్తంభానికి దక్షిణంవైపునుండి వెండివాకిలిలో ప్రవేశించి, విమానప్రదక్షిణం చేస్తూ, బయటి ధ్వజస్తంభానికి ప్రదక్షిణంగా వెళ్లి, మళ్లీ లోనికి వచ్చి ఆనందనిలయంలో ప్రవేశించి శ్రీవారి మూలమూర్తి దగ్గర వాటిని సమర్పిస్తారు. అక్కడ తెరవేసి, ఏకాంతంగా స్వామివారికి ఆచమనాది ఉపచారాలు చేసి తెర తీస్తారు. తర్వాత అర్చకులు అందరు కన్నులారా దర్శిస్తుండగా శ్రీవేంకటేశ్వరస్వామివారికి పట్టుపవిత్రాలను సమర్పిస్తారు. కిరీటంపైన, ఒకటి మెడలో హారంగా వేస్తారు. మళ్లీ తెరవేసి, శ్రీస్వామివారి శంఖచక్రాలకు, నందకఖడ్గానికి, వక్షఃస్థలంలో ఉన్న శ్రీదేవి భూదేవులకు, వజ్రహస్త కటి హస్తాలకు, శ్రీపాదములకు, ఇంకా ఆలయంలో ఉన్న భోగశ్రీనివాసమూర్తి, ఉగ్రశ్రీనివాసమూర్తి, కొలువు శ్రీనివాసమూర్తి, శ్రీసీతారామ లక్ష్మణులకు, రుక్మిణీ శ్రీకృష్ణులకు ఇలా అన్ని ఉత్సవమూర్తులకు పవిత్రసమర్పణ జరుగుతుంది. ఆ తర్వాత హారతి జరుగు తుంది. బయటికి వచ్చి బంగారువాకిలికి ఇరువైపులా ఉన్న జయ విజయులకు, బంగారువాకిలికి ఎదురుగా ఉన్న గరుత్మంతునికి శోభాయమానంగా పవిత్రమాలల్ని సమర్పిస్తారు.

ఇక విమాన ప్రదక్షిణమార్గంలో వరుసగా శ్రీవరదరాజ స్వామివారికి, అన్నప్రసాదవంటశాలలోని వకుళమాలికకు పవిత్రాల్ని అలంకరిస్తారు. అక్కడనుండి బయలుదేరి యాగ



శాలలో ఉన్న విష్వక్సేన, అనంత, గరుడ, హనుమంత, సుగ్రీవ, అంగదులకు ఒక్కొక్కరికి ఒక్కొక్క పవిత్రమాల సమర్పిస్తారు. తర్వాత అర్చకులు వైకుంఠప్రదక్షిణప్రాకారంపై ఎక్కి ఆనంద నిలయవిమానానికి నాలుగుదిక్కులా పూజలుచేసి, పవిత్రాలు సమర్పిస్తారు. ఆనందనిలయవిమానానికి ఎదురుగా తూర్పున గల గరుత్మంతుని గోపురానికి, వైకుంఠద్వారంవద్ద శ్రీవిష్వక్సేనుల వారికి, శ్రీయోగనరసింహస్వామివారికి, శ్రీరామానుజుల మూలమూర్తికి, ఉత్సవమూర్తికి, బంగారు ధ్వజస్తంభానికి, దాని వెనుకవున్న బలిపీఠానికి పవిత్రాలు సమర్పిస్తారు. తర్వాత లడ్డు ప్రసాదం వంటశాలలోని పోటుతాయారుకు, ఆ ప్రక్కనేగల యామునాత్తురై పుష్పమండపంలో ఉన్న శ్రీకృష్ణస్వామి చిన్న విగ్రహాలకు పవిత్రాలు అలంకరించి నైవేద్యహారతులు ఇస్తారు.

మళ్లీ ధ్వజస్తంభందగ్గరకు వచ్చి, మహాద్వారం బయటికి వచ్చి, ఆలయమహాప్రదక్షిణం చేస్తూ, శ్రీవరాహస్వామి ఆలయానికి వచ్చి అక్కడ మూలమూర్తికి, భూదేవికి, ఉత్సవమూర్తికి, శ్రీనివాసమూర్తికి, ద్వారపాలకులకు, ఈశాన్యమూలలో ఉన్న విష్వక్సేనులకు, భాష్యకారులకు పవిత్రసమర్పణ జరిపి ఘనంగా హారతులు సమర్పిస్తారు. ఆ తర్వాత వరాహస్వామికి ఎదురుగా కోనేటిగట్టున ఉన్న శ్రీఆంజనేయస్వామివారికి శ్రీవేంకటేశ్వర స్వామివారి సన్నిధివీధిలోగల శ్రీబేడి ఆంజనేయస్వామివారికి పవిత్రాలు సమర్పించి, మళ్లీ ఆలయప్రవేశంచేసి, పవిత్రోత్సవ మండపానికి చేరుకొని అక్కడ శ్రీమలయప్పస్వామివారికి, శ్రీదేవి భూదేవులకు, యజ్ఞకుండాలకు, కలశాలకు పవిత్రాల్ని అలంకరించి ధూపదీప హారతులిస్తారు.

ఆ తర్వాత అర్చకస్వామి తాను ముందుగా శ్రీస్వామివారి పాదాలకు సమర్పించిన పవిత్రాన్ని కళ్లకద్దుకుని స్వీకరించి తన మెడలో వేసుకుంటారు. తర్వాత అర్చకులు పవిత్రోత్సవ హోమాదులలో పాల్గొన్న ఋత్విక్కులకు శ్రీవారిప్రసాదంగా ఒక్కొక్కరికి ఒక్కొక్క పవిత్రాన్ని మెడలో వేస్తారు. ఇలా ఇక్కడితో ప్రధానకార్యమైన పవిత్రసమర్పణ అత్యంత వేడుకగా కోలాహలంగా పరిసమాప్తమౌతుంది. ఆ తర్వాత అర్చకులు, ఋత్విక్కులు యాగమండపం నుండి బయలుదేరి ఆనందనిలయం ప్రవేశించి పవిత్రసమర్పణకార్యం దిగ్విజయంగా, ఘనంగా నెరవేరినందుకుగాను, శ్రీస్వామివారి మూలమూర్తి పాదాలకు భక్తితో నమస్కరించుకుంటారు. ఆ తర్వాత ఆలయంలో రెండవ అర్చన నైవేద్యం (రెండవ గంట) జరిగిన తర్వాత, యాగశాలలో ఉభయదేవేరులతో కూడిన శ్రీస్వామివారిని సర్వాభరణాలతో అలంకరించి బంగారు పల్లకిలో ఆ సాయంత్రం తిరుమల పుర వీథుల్లో ఊరేగిస్తారు. తర్వాత శ్రీస్వామివారు ఆలయం ప్రవేశించి యాగమండపాన్ని చేరుకోవడంతో రెండవ రోజు పవిత్రోత్సవం ముగిసినట్లే.

ఇక మూడవ నాడు ఉదయం తొలి రెండు రోజులమాదిరే యాగశాలలో హోమాలు జరుగుతాయి. తర్వాత ఉత్సవమూర్తులకు అభిషేకాదులు చేస్తారు. తర్వాత ఆ రాత్రి పూర్ణాహుతితో పవిత్రోత్సవం పరిసమాప్తమౌతుంది. ఈ మూడో రోజు మాత్రం పురవీథుల్లో ఊరేగింపు ఉండదు. పూర్ణాహుతి అయిన తర్వాత శ్రీస్వామివారు శ్రీదేవి భూదేవులతో కూడి విమాన ప్రదక్షిణంగా వెళ్లి ఆలయప్రవేశం చేయడంతో మూడు రోజులపాటు జరిగిన పవిత్రోత్సవాలు పరిసమాప్తమౌతాయి.

ఈ పవిత్రోత్సవాన్ని తిరుమల తిరుపతి దేవస్థానంవారు ఆర్జితసేవగా ప్రవేశపెట్టారు. ఈ పవిత్రోత్సవం జరిగిన మూడు రోజుల్లోను ఇతర ఆర్జితసేవలు ఉండవు.

ప్రతి శ్రావణమాసంలో మూడు రోజులపాటు ఘనంగా, అత్యంతవైభవంగా జరుపబడే ఈ పవిత్రోత్సవాలతో, తిరుమల పుణ్యక్షేత్రంలో, ఆలయంలో తెలిసీ, తెలియక జరిగే దోషాలన్నీ పరిహారమై, శ్రీవేంకటేశ్వరస్వామివారిఆలయం కోటి దివ్యకాంతులను సంతరించుకుంటుంది.





# శ్రీవేంకటాచల మాహాత్మ్యం

(తరిగొండవెంగమాంబ ప్రణీతం)

వచనం- ఆచార్య కె.సర్వోత్తమరావు, 97041 04000

ధారావాహిక



**గత సంచిక తరువాయి..**

కనీవినని రీతిలో సమరం సాగింది. ఏనుగుల ఘీంకారాలతో, గుర్రాల సకిలింపులతో, రథాల పరుగులతో సమరావని ప్రతిధ్వనించింది. అప్పుడు జ్వాలాముఖుడు ప్రతివీరుల విజృంభణాన్ని సుదర్శనరాజుకు విన్నవించాడు. ఇక తానే విరోధులను ఎదుర్కోవాలని వేయిచేతుల వాడై శత్రువులను ఎదుర్కొన్నాడు. సుదర్శనరాజు వ్యూహనైపుణ్యానికి ఎదుటివారు ఏమీ చేయలేక డీలాపడ్డారు. శత్రువులు బెంబేలెత్తి తమ వారి క్షేమాన్ని కూడా గాలికి వదిలేసి పరారయ్యారు.

సుదర్శనుడు ఆగ్నేయాస్త్రం ప్రయోగించడంతో ఆ మంటల్లో శత్రుసైన్యం మసి అయిపోయింది. ఆ అస్త్రప్రభావంతో భూమి వేడెక్కింది. ఆ అస్త్రప్రభావానికి తన సైన్యం కూడా ఇబ్బంది పడుతుంటే సుదర్శనుడు వెంటనే వారుణాస్త్రం ప్రయోగించి చల్లబరచాడు. సైనికులు బతుకు జీవుడా అనుకున్నారు. చివరకు సుదర్శనరాజు అక్కడివారిలో 'ధర్మాధ్యక్షుని' రాజుగా చేసి అతనికి విధులు కేటాయించి ముందుకు కదిలాడు. ఆపై తన దండును దక్షిణంవైపు వెళ్లమన్నాడు. అక్కడి వనదుర్గాలను గాలించాడు. అడవుల్లో దాక్కొన్నవారిని వెదకి వెదకి ఈడ్చి లాగి సంహరించాడు.

దక్షిణదిశలో పుళిందులదే సర్వాధిపత్యం. వారిలో బిడాలుడు, చాలుకుడనే వారు బలవంతులు. వీరిద్దరు కలిసి ఒక్కుమ్మడిగా చక్రరాజుపై విరుచుకుపడ్డారు. వారి సైన్యం కూడా తక్కువైంది కాదు.

"మనల్ని చులకనగా చూస్తూ, మనల్ని మట్టుపెట్టడానికి వచ్చాడా! రానీ, ఎదిరించి నిలిచిన వారి అంతు చూస్తా" నన్నాడు ఒకడు. "గజబలమా! అశ్వబలమా ఈ రెండూ బలాల్ని నేలబడచేస్తా" నన్నాడు మరొకడు.

"కాల్బలమా! నాకు ఒక లెక్కా" అన్నాడు, మరొకడు. "తనకు రథముందని వచ్చినవాణ్ణి విరథుణ్ణి చేసి సంహరిస్తా" నన్నాడు మరొకవీరుడు. "నన్ను సామాన్య వీరునిగా లెక్కపెట్టకండి. నేను ఒక్కణ్ణే అయినా చతురంగబలాన్ని నామరూపాలు లేకుండా చేస్తా"నన్నాడు. వేగులద్వారా సుదర్శనరాజు ప్రధానులు అన్నీ తెలుసుకుని అన్ని విధాల ప్రతిక్రియలకు సన్నద్ధమయ్యారు.

జ్వాలాకేశుడు, కాలాంతకుడు, రణఘ్నుడు విరోధులను ఎదుర్కొన్నారు.

"పాపాత్ములార! ఆగండి. ఆగండి. మీరు సామాన్యులు కారు. రాక్షసప్రవృత్తి కలవారు. బ్రాహ్మణులకు హాని తలపెట్టినవారు. వారి ఆచారాలను పరిహాసం చేసినవారు. యాగాలను కొనసాగించక అడ్డుపడ్డవారు. అధర్మపరులైన మిమ్మల్ని అట్టే వదలిపెట్టడం మహాపాపం. ముక్కలుముక్కలు చేసి పిశాచాలకు తిండి పెడతాం. భూసురులను రక్షిస్తాం రండి. దమ్ముంటే మాతో తలపడండి" అన్నారు. వారంతా స్ఫులింగుని మీదకు ఒక్కసారిగా ఉరికారు. అప్పుడు అతడు 'అంకుండిని' పరిమార్చాడు. బలాధ్యక్షుడు వంకుండనే వాణ్ణి సంహరించాడు. జ్వాలాకేశుడు దక్షిణదిశలోని బలవంతుడైన పుళిందుని సంహరించాడు.

తమ నాయకుడు సంహరింపబడగానే పుళిందుని సైన్యంలోని వీరులు అడవుల్లో దాక్కొన్నారు. అడవుల్లో ఉంటూ సుదర్శనరాజు సైన్యంపై బాణవర్షం కురిపించారు. చివరకు సుదర్శనమహారాజు ఆనతితో హయశిరుడు వారిని వ్యూహంతో ఎదుర్కొని ఖండతుండాలు చేశాడు. సుదర్శనరాజు వీరవిహారంతో శత్రుసైన్యం నిర్విశేషమైంది. దక్షిణప్రాంతం ఊపిరి పీల్చుకొంది.

*(ఇంకా ఉంది)*

# సారంగపాణి తలపుల్లో శ్రీకృష్ణుడు


- డా॥ కంపల్లె రవిచంద్రన్,
98487 20478

ఏమిటికే నీపే - రేమని యడిగితివి
కోమలి నను వేణు - గోపాలుడని దెలిసి

పడతీ నీ మోము ము - ద్దిడుకొన్నప్పటి నుంచి
పద్మాక్షుడని నను - బలుకుదురే
జడియక నీదు కీల్ - జడ యల్లినదే మొదలు
తొడరి శేషశయ - నుడనుచు బిలుతురే

అలివేణి నీ మోవి - యానిన నెపమున
తలకొని మధుసూ - దను డందురె
బలిమి నీ గుబ్బలు - బట్టి జూచుటజేసి
తలిరుబోణి మందర - ధరుడని తలతురే


మరుకేళి నినుగూడి - మరిగినదే గురిజేసి
మదన జనకుడని ప్రే - మను గొలుతురే
పరిమళవతి నీమై - పసుపు దుప్పటైనది
అరసి పీతాంబరధరు - డను కొందురే (శృంగారపదం-9)



నాయకుడు నాయికను అనునయిస్తూ అంటున్న మాటలు–

"ఓ కోమలీ! నేను వేణుగోపాలుణ్ణి అని తెలిసీ "నీ పేరు ఏమిటి?" అని అడిగావు ఎందుకు? "పడతీ! నీ ముఖాన్ని ముద్దుపెట్టుకొన్నప్పటి నుండి నన్ను పద్మాక్షుడని పిలుస్తున్నారు. నీకు జడ అల్లింది మొదలు శేషశయనుడని పిలుస్తున్నారు. అలివేణీ! అధరాన్ని ఆస్వాదించిన నాటినుండి మధుసూదనుడని అంటున్నారు. తలిరుబోణీ! బలంగా నీ ఉదరసంపదను పట్టి చూచింది మొదలు మందరధరుడని తలుస్తున్నారు. మన్మథకేళి నిన్ను కూడి మరిగిన నాటినుండి మదనజనకుడని ప్రేమతో కొలుస్తున్నారు. పరిమళవతీ! నీ మేనిపసుపు నా మేనిపై వలువగా అంటడం చూచి పీతాంబరుడనుకుంటున్నారు."

సారంగపాణి రచించిన శృంగార పదాలన్నిటిలోనూ ఇది అపూర్వ, అనర్ఘం అని చెప్పదగింది. ఇందులో నాయకుడు సాక్షాత్తూ వేణుగోపాలుడు. దక్షిణనాయకుడు. పరమ విదగ్ధుడు. శృంగారశేఖరుడు. నాయికల మనస్సు నెరిసి మురిపించేవాడు. వేణుగోపాలుడని తెలిసీ నాయిక "నీ పేరేమిటి?" అని అడగడంలో ఆమె ఏ కారణం చేతనో తన పట్ల కినుక వహించిన సంగతిని గుర్తించిన రసజ్ఞుడు స్వామి. మరిపుడు నాయికను అనునయించి అంకెకు తెచ్చుకోవాలి కదా?



తన పేరు తాను చెప్పడం శాస్త్రసమ్మతం కాదు. లోకులు తనను అలా పిలుస్తారని చెప్పడం సబబు. ఈ పదంలో తనను ఆయా పేర్లతో లోకులు పిలుస్తున్నారని చెబుతున్నాడు. అవి– పద్మాక్షుడు, శేషశయనుడు, మధుసూదనుడు, మందరధరుడు, మదనజనకుడు, పీతాంబరుడు. పరసహస్రంగా ఉన్న నాయకుని నామాలలో ఈ ఆరుపేర్లను ప్రస్తావించాడు. చమత్కారమేమంటే నాయిక సాంగత్యగౌరవం చేత తనకు ఆయా పేర్లు కలిగాయని చెప్పడం ద్వారా నాయిక కినుకను పోగొట్టే ప్రయత్నం.

**1) పద్మాక్షుడు**-నాయిక ముఖాన్ని చుంబించడం వల్ల తన నా పేరుతో పిలువడం ప్రారంభించారని చెబుతున్నాడు నాయకుడు. విష్ణుస్వరూపుడైన శ్రీకృష్ణునికి పుండరీకాక్షుడు(పద్మాక్షుడు) అన్న పేరు సుప్రసిద్ధమైందే! కానీ నాయికకారణంగా ఆ పేరు వచ్చిందని చెబుతున్నాడు. ఎలాగంటే ముఖాన్ని పద్మంతో పోలుస్తారు. అలాగే కన్నులను కూడా. నాయిక పద్మముఖి. ఆ పద్మముఖిని చుంబించడం చేత ఆయన పద్మ నేత్రుడయ్యాడు. నాయిక పద్మముఖం నాయ కుని నేత్రాలుగా రూపొందిందని, పైగా ముఖంలో నేత్రాలను చుంబించడం రసోత్తేజ కరమని సరసు లెరుగుదురు.



**2)శేషశయనుడు**-నాయికకు జడ అల్లడం చేత శేషశయనుడని పేరు వచ్చిందట. విష్ణువు (శ్రీకృష్ణుడు) శేషతల్పంలో పవళించే దేవుడని అందరికీ ఎరుకే. మరి నాయిక జడనల్లడం చేత ఆ పేరని ఎలా? ఎలాగంటే– విదగ్ధ నాయకుని లక్షణాలలో నాయికను అలం కరించే నైపుణ్యం ఉండడం కూడా ఒకటి. స్వయంగా నాయికను అలంకరించినపుడు నాయిక పొందే ఆనందం, నాయకునికి కలిగే రసార్ద్రత అనుభవైకవేద్యం. జడనల్లుట, శరీరంలోని కపోలాలు, భుజాలు మొదలైన చోట్ల పత్రరచన మొదలైనవి విదగ్ధనాయకుని ప్రత్యేకత. విశాలమైన కురులతో నాయిక నాయకుని ముఖాన్ని ఆచ్ఛాదించినపుడు నాయకుడు పొందే తమకం అనిర్వచనీయ మైంది. ప్రేమ జడివానగా వర్షించగా నాయకుడు ఆమె కురులను కీల్జడగా శృంగారలోకంలోని ఒక అపురూప సన్నివేశం. జడను సర్పంతో పోలుస్తారు కవులు. శేషుడు, నాగుడు, ఈ సాదృశ్యం చేత నాయకునికి ఆ పేరు కలిగింది.

**3) మధుసూదనుడు**-నాయిక అధరాన్ని పానం చేసినందున మధుసూదనుడని పిలుస్తున్నారట. మధువనే రాక్షసుని ప్రాణా లను హరించడం చేత విష్ణువు (కృష్ణుని)కి మధుసూదనుడనే పేరు వచ్చిందన్నది ప్రసిద్ధమే. మరి నాయిక అధరపానం వల్ల ఆ పేరుతో పిలువడమెలా? ఏమంటే మధుశబ్దానికి తేనె అనే అర్థముంది. పెదవులు తేనెలూరడం, ఆ తేనెను జుర్రడం శృంగార సర్వస్వమనదగింది. కాళిదాసు శాకుంతలంలో 'రతి సర్వస్వమధరమ్' అని పేర్కొన్నాడు. అధరాల్లో అమృత ముందని, స్వర్గలోక అమృతం అమృతమే కాదని అమరుకావ్య కారుడు ఇలా తెలిపాడు.

సందష్టాధర పల్లవా సచకితం
హస్తాగ్ర మాధున్వతీ
మా మా ముంచ శఠేతి
కోపవచనైరానర్తిత భ్రూలతా,
సీత్కారాంచితలోచనా సపులకం యైశ్చుంబితా మానినీ
ప్రాప్తం తైరమృతం శ్రమాయ మథితో మూఢైః సురైః సాగరం ॥

"అతివ అధరామృతమే నిజమైన అమృతం. దేవతలు మూర్ఖులు. అమృతంకోసం సముద్రాన్ని చిలికి శ్రమపడ్డారు." అని పై శ్లోకభావం.

మధురాక్షసుని ప్రాణాలను హరించినట్లుగా నాయిక అధరామృతాన్ని జుర్రుకోవడం చేత ఆ పోలిక.

**4) మందరధరుడు**- నాయికస్తనసంపదను నాయకుడు బలంగా పట్టి చూచినందున మందరధరుడని పేరు వచ్చిందట. విష్ణువుకు ఆ పేరు పూర్వప్రసిద్ధమే! దేవదానవులు పాలకడలిని

త్రచ్చడానికి మందరాన్ని కవ్వంగా, వాసుకిని తాడుగా చేసుకున్నారు. ఈ సందర్భంలో మందరం అటు ఇటు బెసగకుండా ఉండేందుకు విష్ణువు కూర్మరూపుడై తన వీపున మందరాన్ని ధరించాడు కనుక ఆయనకు మందరధరుడని పేరొచ్చిందన్న విషయం జగద్వితమే! మరి నాయికస్తనాలను పట్టుకోవడం చేత ఆ పేరొచ్చిందని చెప్పుట ఎలా? ఎందుకంటే స్తనాలను కొండలతో పోలుస్తారు. చనుగొండలనడం కద్దు. ఆ పోలిక చేత ఈ పేరు.

**5) మదనజనకుడు-** నాయికతో రతికేళిలో సోలిసొక్కిన నాటినుండి మదనజనకుడని పిలువసాగారు లోకులు. విష్ణువు పుత్రుడు మన్మథుడని 'శ్రీపుతః' అన్న పేరు స్పష్టం చేస్తూనే ఉంది. మరి నాయికలో రతిక్రీడలో తేలియాడినపుడు ఈ పేరు రావడం ఎలా? ఏమంటే రతికేళి లేదా మన్మథకేళి అనేది మన్మథుని కారణంగా సంభవిస్తుంది. నాయికానాయికుల మధ్యన ప్రేమను పాదుకొల్పే మన్మథుడు వాళ్లు మన్మథ సామ్రాజ్యసాగరంలో ఓలలాడేందుకు ప్రేరకుడౌతున్నాడు. అతడిని కన్నతండ్రి స్వయంగా అతడికంటే ఘనుడు అని చెప్పవచ్చు.

ఇక్కడ 'ప్రేమగా కొలుస్తున్నారు' అని విశేషప్రయోగం చేశాడు సారంగపాణి. జనానందకరం స్వర్గసుఖాన్ని మించింది. బ్రహ్మానంద సబ్రహ్మచారి అయిన రతిక్రీడ ఎవరిని లోగొనదు? అందుకే ప్రేమగా కొలుస్తున్నారు మదనజనకుడని.

**6)పీతాంబరుడు-** నాయిక శరీరం మీద అలదుకున్న పసుపు వల్ల పీతాంబరుడునే పేరు వచ్చిందట. వాస్తవంగా పీతాంబరుడనే పేరు సుప్రసిద్ధమే! పచ్చని వలువ ధరిస్తాడు విష్ణువు (శ్రీకృష్ణుడు). కనుక ఆ పేరు వచ్చింది. మరి నాయిక సంసర్గం చేత ఎలా అంటే-

నాయకుడు నాయికాలింగనసౌఖ్యాన్ని పొందినపుడు ఆమె మేని మీది పసుపు ఆయన మేనుకు అంటుకుంది. దాంతో ఆయన శరీరం మీద పసుపు పచ్చని వస్త్రం ఆచ్ఛాదితమైనట్లుగా కన్పించి లోకులు అలా అనుకున్నారని అర్థం!

ఇక్కడ విశేష మొకటుంది. ఏమంటే, మేనుకంటిన పసుపును ఆయన తుడిచివేయలేదు. లోకుల కనుల కగుపడుతున్నా దాని నలాగే ఉంచుకున్నాడు. ప్రియాపరిభుక్తశేషాన్ని ఆస్వాదించడం ఉత్తమ నాయకుని లక్షణం. ఆమె పట్ల తనకున్న ప్రేమకు పరాకాష్ఠ అని చెప్పవచ్చు. ఆముక్తమాల్యద కథ అదే కదా!

మరొకసంగతి- సాధారణంగా ఒకరు వాడిన వస్త్రాన్ని మరొకరు వాడరు. తెనాలిరామకృష్ణకవి తన పాండురంగ మాహాత్మ్యంలో...


చ॥ ఉమ పసుపాడి మోముతడి యొత్తిన హత్తిన తన్ని శాంకదృ
క్కమలదళాంజనాంక కులకంబుగ నింబగు చేలఁగేలి వి
భ్రమగతిఁ గప్పినాఁ డనఁగఁ బచ్చని నల్లని చారలన్ మనో
రమమగు ద్వీపిరాడజినరత్నము యత్నము మీఱఁ దాల్చుచున్

అన్న పై పద్యంలో ఒక రహస్యాన్ని చెప్పాడు. పార్వతి స్నానం చేసి ఒళ్లు తుడుచుకున్న వస్త్రం- ఆమె పసుపు అలదుకున్న కారణం చేత పచ్చగా మారింది. కనులు తుడుచుకున్నప్పుడు అటనట నల్లని కాటుక మరకలైనాయి. ఈశ్వరుడు ధరించిన పులితోలు ఆ వస్త్రంలాగా ఉందని పేర్కొన్నాడు. ప్రియురాలు వినియోగించిన దానిని ధరించడం ప్రియునికి మహదానందకరమని చమత్కారం.

ఈ విధంగా సారంగపాణి శృంగారాన్ని సుతిమెత్తగా, సునిశితంగా నడిపించిన వైనం నాన్యతోదర్శనీయం.

రసచమత్కృతితో శృంగారాన్ని పండించిన ఈ పదం అపురూపమైంది. ఐతే ఇది కేవలం శృంగారానికి మాత్రమే పరిమితమైందా? కాదు. ఏమంటే భౌతికసుఖాల విరక్తి ఆధ్యాత్మికతవైపుకు దారితీస్తుంది. ఆయా శృంగార సంబంధ విషయాల ప్రస్తావన చేత పదకర్త విష్ణునామాలను పలికింప చేశాడు. పాఠకులు శృంగార రసార్ద్రులవుతూనే 'పద్మాక్ష', 'శేష శయన', 'మందరధరా', 'మదనజనక', 'పీతాంబర' అనే భగవన్నామాలను స్మరిస్తారు కదా! ఇదీ సారంగపాణిరచనావిశేషం. భక్తినీ, ముక్తినీ పొందాలంటే మొదట రక్తిని అనుభవించి వర్జించాలి కదా! భాగవతకృష్ణుని విశేషమిదే కదా!

ఈ విధంగా సారంగపాణి పై పదంలో శృంగారం, భక్తి రెండింటి అద్భుతమైన సంయోజనాలతో అందించడం ఆయన తాత్త్వికపరిణతికి తార్కాణం!!



# తిరుమల సమయాచారములు

## (తిరుమల-తిరుపతి ఐతిహ్యమాల)

తెనుగు అనువాదకులు:
కీ.శే. డా॥ ఎన్.సి.వి.నరసింహాచార్యులు,
కీ.శే. శ్రీమాన్ టి.ఏ.కృష్ణమాచార్యులు

*గత సంచిక తరువాయి భాగం....*

శ్రీభగవద్రామానుజాచార్యులు తాముగానే, ఆదికాల మందే శ్రీవేంకటేశ్వరస్వామికిని శ్రీగోవిందరాజస్వామికీ ఐక్యం తెలియునట్లుగా కొన్ని ధర్మవ్యవస్థలు ఏర్పరచినందున తరువాతి పెద్దలుకూడా ఆ ఐక్యం తెలియజేయడం కోసం తిరువాడి ప్పూరంలో (కర్కాటకమాసంలో పూర్వఫల్గునీ నక్షత్రం) శ్రీగోవిందరాజస్వామి, శ్రీగోదాదేవి తిరుమల యడివారానికి విజయం చేసి శ్రీవేంకటేశ్వరస్వామితో 'కూడల్ వళైచ్చు' క్రీడ సలుపవలెనని కట్టడి చేశారు.

ధనుర్మాసంలో శుక్లపక్షద్వాదశినాడు అరుణోదయ వేళలో అన్ని తీర్థాలు స్వామిపుష్కరిణిలో సాన్నిధ్యం వహిస్తాయి. మనఃప్రీతితో ఎవరైతే అక్కడ స్నానమాచరిస్తున్నారో వారు, వారి సగోత్రులు, దాయాదులు, చుట్టాలు, సర్వవిధ దురితాలనుండి విముక్తి పొందుతారు. ఏ మానవులు ధనుర్మాసం శుక్లపక్ష ద్వాదశి రోజున అరుణోదయసమయంలో స్వామిపుష్కరిణిలో స్నానం చేస్తున్నారో వారు తమ సర్వపాపాలు పోకార్చుకొని స్వర్గలోకం పొందుతున్నారు.

ఏ మానవుడు, సూర్యుడు ధనూరాశిలో ప్రవేశింపగా శుద్ధద్వాదశి అరుణోదయవేళ అంజనాద్రి (వేంకటాద్రి)లోని స్వామిపుష్కరిణిలో స్నానం చేస్తారో అతడు సర్వపాపాలనుండి విముక్తుడై వైష్ణవస్థానాన్ని పొందగలడు;

ధనుర్మాసంలో శుక్లపక్షద్వాదశినాటి అరుణోదయ సమయంలో భువనత్రయమందున్న మూడున్నరకోట్ల తీర్థాలన్నీ పావనమైన స్వామితీర్థంలోకి వచ్చిచేరుతాయి. ఆ సమయంలో మానవులు స్నానంచేసి తాము తమ బంధువులతోబాటు మహా పాతక నిర్ముక్తులవుతున్నారు.

వామన, వరాహ, మార్కండేయాది పురాణాలలో తీర్థ వైభవం ప్రశంసింపబడియుంది.

ఈ రోజున తీర్థస్నానంచేత సుఖాలు సిద్ధిస్తాయని శాస్త్రం బోధిస్తున్నందున కామ్యతీర్థమని ప్రసిద్ధమైన తీర్థంలో శ్రీరామా నుజసిద్ధాంతనిష్ఠితులైన ప్రపన్నజనులకు స్నానమనుచితమని శ్రీవైష్ణవధర్మశాస్త్రాలు చెప్పడం చేత తిరుమల, తిరుపతులలో నిత్యం వసించే మహాభాగవతులు కూడ ఈ కామ్యతీర్థాన్ని పరి గ్రహించడం చేత రాజస, తామస ప్రకృతులైన శ్రీవైష్ణవుల వలే, అవైష్ణవజనుల మూలంగా, రాజాశ్రితులగు కొందరు అపండితులవల్ల, స్థలవాసులైన జియ్యరులు, ఆచార్యపురుషులు, శ్రీ మహాభాగవతులు మున్నగు వారందరు ఈ స్థలంలో శ్రీమహా భాగవతులకు వచ్చిన అపఖ్యాతి తెలిసిన ఈ కాలంలో తీర్థ స్నానం చేయడంకోసం మునుపు ఉన్నట్లే చేసెదము గాక అని చింతించి- సూర్యుడు ధనూరాశిలో ప్రవేశింపగా, శుక్లపక్షంలో భక్తోత్సవం చేయాలి. మూడు రోజులు సూరులను అర్చించాలి.

(ఇంకా ఉంది)

# సందేహాలు



# సమాధానాలు

-బ్రహ్మశ్రీ సామవేదం షణ్ముఖశర్మ

**ప్ర) గోవునకు మేతపెట్టేటప్పుడు ఏదైనా మంత్రం చదువుతూ అందించాలా? అలాంటి మంత్రాలున్నాయా? గోగ్రాసంలో ఏమేమి పెట్టవచ్చు?**

**జ)** గోవులకు ఆరోగ్యపరంగా ఏది హితమో దానిని పెట్టవచ్చు. మిగిలిన అన్నాలు, ఉచ్ఛిష్టాలు, బహిష్టులు స్పర్శించినవి గోవునకు పెట్టరాదు. బహిష్టువారి గాలి కూడా సోకరాదు. గోవుకు గ్రాసం పెట్టేటపుడు చదవవలసిన మంత్రం -

సౌరభేయా స్సర్వహితాః,
సర్వపాపప్రణాశనాః ।
ప్రతిగృహ్ణాంతు మే గ్రాసం
గావస్త్రైలోక్యమాతరః ॥

ఈ మంత్రం మార్కండేయ మహాముని చెప్పింది. దీంతోపాటు ఇష్టదేవతా మంత్రాన్ని మనస్సులో జపిస్తూ మేత పెట్టడం మంచిది. తన భోజనానికి ముందు గోవునకు గడ్డిమొదలైనవి ఇచ్చి, భుజించేవాళ్లు సద్గతిని పొందుతారు.

**ప్ర) దేవతల్ని ఆరాధించడం అవసరమే. కానీ అవతారం ధరించారనే పేరుతో మానవుల్ని ఆరాధించవచ్చా? శ్రీరాముడు, శ్రీకృష్ణుడు - అవతార పురుషులే. కానీ వారి ఆరాధన దేవతారాధన అవుతుందా?**

**జ)** దేవత-అనే మాటకు 'తేజః స్వరూపుడు' అని అర్థం. శాస్త్రప్రకారంగా- మంత్రం ద్వారా ప్రతిపాదింపబడేవారు దేవతలు. మంత్రంలో శబ్దంగా ఉండే స్వరూపమే, సూక్ష్మంగా తేజోరూపంగా భాసిస్తుంది. ఆ తేజఃస్వరూపమే దేవత.

అయితే దివ్యగుణాలతో లోకోపకారంగా ప్రవర్తించిన యోగులు, మహాత్ములు, ఋషులు పూజ్యులే. వారిని దేవతలతో 'సమానం'గానే అనుకోవచ్చు, పూజించవచ్చు, ఆదర్శంగా ఆరాధించవచ్చు. కానీ దేవతారాధన వేరు. అయితే శ్రీరాముడు, శ్రీకృష్ణుడు... అవతరించక ముందే, మంత్రాధిదేవతలు.

విష్ణుస్వరూపులైన ఈ మంత్రాధిదేవతల్ని ధర్మరక్షణకోసం ఋషులు, ఇంద్రాదిదేవతలు ఆరాధించి, ప్రార్థించడం చేత- వారు భూమిపై అవతరించారు. కనుక వారి ఆరాధన దేవతారాధనే అవుతుంది. స్థితికారకుడైన శ్రీమన్నారాయణుడు తన మంత్రలక్షణాలనే అవతారాలలో వ్యక్తం చేశాడు.

అందుకే శ్రీరామకృష్ణాదులను ఉపాసించేవారు ఐహికఫలాలతో పాటు, కైవల్యాన్ని కూడా పొందుతారు. దానికి కొన్ని వేల ఏళ్ల నుండి వారిని ఉపాసించిన సిద్ధులే సాక్షులు.

***ప్ర) శ్రీకృష్ణునకు, ఉద్ధవునకు ఉన్న అనుబంధమేమిటి? అక్రూరుడు ఎవరు?***

**జ)** వసుదేవుని సోదరుడు దేవభాగుడు. అతని పుత్రుడు ఉద్ధవుడు. అంటే శ్రీకృష్ణునకు పినతండ్రి కుమారుడే ఉద్ధవుడు. అయితే కృష్ణునికి ప్రియమైన భక్తుడు.

అందుకే తన నిర్యాణానికి ముందు బ్రహ్మవిద్యని గోవిందుడు ఇతనికే బోధించాడు. పైగా, ఉద్ధవుని ఉత్తమభాగవతునిగా అనేకమార్లు పేర్కొన్నాడు. సఖ్యధర్మంతో పాటు, శరణాగతిభావం కలిగిన శ్రేష్ఠభక్తుడు ఉద్ధవుడు. కొందరు ఇతణ్ణి 'జిజ్ఞాసభక్తుని'గా చెబుతారు.

యదువంశానికి చెందిన ఒక శాఖ వృష్ణివంశం. దానికి చెందిన శ్వఫల్గుడి పుత్రుడు అక్రూరుడు. శ్రీకృష్ణుడు ఇతనికి బంధువు. అక్రూరుని కూడా భగవద్భక్తునిగానే శాస్త్రాలు వర్ణించాయి. భాగవతంలో ఇతని భక్తిని కూడా అభివర్ణించారు.

బలరామకృష్ణులను బృందావనం నుండి మధురకు తోడ్కొని వచ్చింది ఈతడే. ఆ సమయంలో యమునానదీ జలాలలో శేషపర్యంకంపై శ్రీకృష్ణుని విష్ణుస్వరూపాన్ని దర్శించిన భాగ్యశాలి.

**ప్ర) గోపీచందనం అంటే ఏమిటి? దీనిని ఎవరు ధరించాలి?**

**జ)** ఇది లేత పసుపుపచ్చని మన్ను. బృందావనం, ద్వారకవంటి క్షేత్రాలలో లభ్యమౌతుంది. శ్రీకృష్ణుని పాదస్పర్శచే పవిత్రమైన మన్నుని గోపీచందనం అంటారు.

వీటిని ఆ ప్రాంతాలలో గుర్తించి ధారణయోగ్యంగా స్వీకరించారు. వాటిని ఎవరైనా ఊర్ధ్వపుండ్రంగా ధరించవచ్చు.

ఇది లభించని పక్షంలో పుణ్యతీర్థ మృత్తిక, తులసీమూలంలోని మన్ను ధరించవచ్చు.

ఈ నెల 27న గోకులాష్టమీ సందర్భంగా...


# రారా..! కృష్ణయ్య..!!

– శ్రీమతి చెవుటూరి కుసుమకుమారి

శూరసేన మహారాజు పుత్రుడు వసుదేవునకు, మధురానగర రాజు కూతురు దేవకీదేవికీ వివాహం జరిగింది. దేవకికి తోడబుట్టినవాడు రాక్షసాంశ సంభూతుడైన కంసుడు. చెప్పరాని మురిపెంతో అరణాలతో, ఆభరణాలతో, గజ తురగ వస్తు వాహనాలతో, వారి దాంపత్యం వెయ్యేళ్లపంట కావాలనే కాంక్షతో రథం మీద చెల్లెలిని మెట్టినింట దింప బయలుదేరాడు కంసుడు. కానీ విధివ్రాత తప్పదన్నట్లు రథం కొంచెం దూరం సాగగానే ఆకాశవాణి ఇలా వినిపించింది.

“ఓయీ కంసా! వల్లమాలిన ముచ్చటగా చెల్లిని మెట్టినింట దింపబోతున్నావా? ఈమె అష్టమగర్భ సంజనితుడైన పుత్రుడే నీపాలిటి మృత్యువు కాగలడు”. ఆ పలుకులు విన్న కంసుడు భయవిహ్వలుడై, వెంటనే కత్తిదూసి దేవకి తలను తెగవేయబోగా వసుదేవుడు వారించి “బావా! నవవధువును నీచెల్లిని చంపడమెందుకు? ఆమె అష్టమగర్భంలో పుట్టినవాడు కదా నీశత్రువు. ఆమెకు పుట్టిన సంతానాన్ని నీకర్పిస్తాను.”అని మాటిచ్చి దేవకిని కాపాడాడు.

ధర్మాధర్మవిచక్షణారహితంగా రాజ్యపాలన చేయసాగాడు కంసుడు. నారదుడు ధర దుఃఖాన్ని హరికి విన్నవించాడు. “లోకేశ్వరేశ్వరా! నీవు వెంటనే భూమిపై అవతరించి కంసుణ్ణి వధింపు”మని అభ్యర్థించాడు. శ్రీహరి అభయమిచ్చాడు.



వెంటనే నారదుడు కంసుని వద్దకు వెళ్లి దేవకి అష్టమ గర్భ సంజాతుడు నీకు ఆజన్మవిరోధి అయిన హరి అని చెప్పాడు. అది విన్న కంసుడు దేవకి అష్టమగర్భాన్ని వధించటానికి మరింత వేగిర పడసాగాడు.

శ్రావణ బహుళాష్టమి రోహిణీనక్షత్రాన లోకాలన్నీ గాఢనిద్రలో మునిగినవేళ, మధురానగరచెఱసాలలో ఒక చీకటి గది అట్టడుగున దేవకి అష్టమ గర్భంలో ఒక మహాద్భుత తేజం శిశువుగా ఆవిర్భవించింది. ఆ విశ్వమోహనాకారుడైన బాలుణ్ణి చూచిన దేవకి మాతృవాత్సల్యంతో, వసుదేవుడు పుత్రోత్సాహంతో పొంగిపోయారు. కానీ వారి ఆనందాన్ని తృటిలో విషాదచ్ఛాయలు క్రమ్మివేసాయి.

“అయ్యో తండ్రీ! ఎన్నో జన్మల నోములపంటగా నిన్ను కన్నాం. కానీ ఆ దుర్మార్గుడైన కంసుడు నిన్ను మాకెక్కడ నిస్తాడు.”! అని విలపించసాగారు. అంతట వెంటనే దేవకీవసుదేవుల



కళ్లు మిరుమిట్లు గొలిపేటట్లు, చతుర్భుజాలతో, శంఖచక్రాది ఆయుధాలతో శ్రీవత్సాంకితవక్షుడు, పీతకౌశేయవాసుడు అయిన శ్రీమన్నారాయణుడు ఎదుట నిలిచాడు.

"తల్లీ! దేవకీ! తండ్రీ! వసుదేవా! మీకొచ్చిన భయ మేమీ లేదు. నేను "శ్రీకృష్ణ" నామధేయుడనై కంసాది దైత్యులను వధించి భూభారాన్ని తగ్గించగలను. ధర్మసంస్థాపన నా అవతార లక్ష్యం.

తండ్రీ! నన్ను వెనువెంటనే నందగోకులానికి చేర్చు. నేను నందుని ఇంట పెరగగలను" అని చెబుతూ దేవకీగర్భం తనకు జన్మస్థలమనీ, నందగృహం తనకు లీలానాటక రంగ స్థలమనీ, తనను పరబ్రహ్మమూర్తిగా ఎఱుంగమనీ" పలికి రెప్పపాటులో మాయను తలపించి, నీలగగనశ్యామదేహుడైన పసిపాపడైనాడా పరమాత్మ.

వసుదేవుడు హరి ఆదేశాన్ని అనుసరించి బ్రహ్మాండమే తొట్టిగా శయనించే ఆ బాలపరమాత్మను చిన్న తట్టలో తన హృదయాన్నే పాన్పుగా చేసి తన సుతిమెత్తని చేతులనే గొలుసులుగా వేసి పదిలంగా గుండెలకు హత్తుకుని, వివశమైన మనసును విష్ణుపదాయత్తం చేసి, తట్టను తలనిడుకొని, చెఱసాల బయటకు అడుగిడబోగానే ఆశ్చర్యంగా కవాటాలు తెరుచుకున్నాయి. కావలివాళ్ళంతా గాఢనిద్రలో ఉన్నారు. మధురానగరవాసుల మీద మాయ వర్షిస్తోందా! అన్నట్లు జోరున వర్షం కురుస్తూ ఉండగా వసుదేవుడు వడివడిగా అడుగులు వేస్తూ యమునానదివైపు నడుస్తున్నాడు.

యమునాతీరం చేరగానే బాలముకుందుని అడుగులకు యమున మడుగులొత్తుతున్నదా! అన్నట్లు ప్రవాహం రెండు పాయలుగా విడిపోయింది. ఆకాశంలో తారకలు దేదీప్య మానంగా వెలుగుతుంటే ప్రతిఫలించే కాంతి దారిని జల తారులా ధగద్ధగాయమానం చేస్తుండగా, తట్టను కప్పిన ఆదిశేషుని సహస్రశిరసులు ఉయ్యాలపందిరికాగా, కదులుతున్న ఆతని నాల్కలు ఉయ్యాలపందిరికి కట్టిన ఆటబొమ్మల్లా, అనంతుని ఉచ్ఛ్వాస నిశ్వాసాల బుసలు "హుష్" లీలామానుష వేషవినోదా! కొంచెం ఓపిక పడితే నీ "ఆనంద నంద గోకులం" వస్తోంది అని గుసగుసలాడుతున్నాయా అన్నట్లు తలపిస్తూ ఉండగా నందగోకులం చేరి ఆ పరమాద్భుత

## వైకుంఠపాళి
## :: 103 - సమాధానాలు ::

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 1 ద | శ | 2 కం | రు | 3 డు | | |
| | | డ | | జా | | ల్బు | | |
| 4 ప్ర | భ | | 5 ప | త | నం | | 6 వే | 7 ము |
| యో | | 8 మ | | ము | | 9 ఖ | | య్యే |
| 10 జ | టా | యు | వు | | 11 అ | గ | స్త్యు | డు |
| న | | డు | | 12 చి | | ము | | మా |
| 13 ము | గ్గ | | 14 మ | రు | లు | | 15 ఇ | ర్లు |
| | | 16 కా | | నా | | 17 కు | | |
| | | 18 మం | ద | మా | రు | తం | | |

శిశువును యశోద ప్రక్కన పరుండచేసి, బాలికగా జన్మించి యశోదప్రక్కలో నున్న యోగమాయను దేవకి చెంతకు చేర్చాడు వసుదేవుడు. అదే "శ్రీకృష్ణజన్మాష్టమి"

శ్రీమహావిష్ణువు ధరించిన అవతారాలలో శ్రీకృష్ణావ తారం పరిపూర్ణ అవతారం. నేను భగవంతుడిని అంటూనే సర్వప్రాణిసఖుడైనాడు గోవిందుడు.

దేవకీవసుదేవులు దేవతలు, కంసుడు మేనమామ దైత్యుడు, మేనబావ అర్జునుడు నరుడు, పిల్లనిచ్చిన జాంబ వంతుడు భల్లూకం, కరుణించిన కాళియుడు పాము, గోవులు, గోపాంగనలూ సరేసరి. ఇలా దేవ, దానవ, మానవ, పశు పక్ష్యాదులతో స్నేహబాంధవ్యాన్ని శ్రీహరి నవనీతామృత మనస్కుడై నెరపాడు.

కృష్ణుడు లీలామానుషవిగ్రహుడు. తాను అమానుషుడు అయికూడ, శిశువై, గోపాలుడై, శిష్యుడై, గృహస్థు అయి, భక్తానుగ్రహమూర్తి అయి, నరుడికి సారథి అయి మురిపించి, మరపించి, ఝడిపించి, లాలించి, కరుణించి సమస్తవర్ణాశ్రమ ధర్మాలనూ ఆచరించాడు. నరుడికి సారథి అయి కామ, క్రోధ, లోభ, మోహాలనే పగ్గాలను చేత పట్టాడు. ధర్మాధర్మాలకు సరిహద్దురేఖను గీచి దుష్టశిక్షణ, శిష్టరక్షణ చేసి, మానవుల "నుదటిగీత"ను చాటి, "భగవద్గీతను" లోకానికి అందించి గీతాచార్యుడైనాడు.

"శ్రీకృష్ణజన్మాష్టమి" ఒక యుగానిది కాదు. దానికి కాలనియమం లేదు. "నందగేహ' దీపమైన ఆ పరమాత్మకు మన దేహమే గేహంగా(ఇల్లుగా), మనస్సు ప్రమిదగా, ఇంద్రియాలు వత్తులుగా, భక్తి చమురుగా ఆత్మజ్యోతిని సిద్ధం చేసి, మధురభావోద్వేగంతో వెన్న, పాలు, పంచభక్ష్య పర

> **నందగోపుడు జ్ఞానానికి, యశోద మోక్షానికి,**
> **శ్రీకృష్ణుడు ఆనందానికి ప్రతీకలు.**
> **ఈ ముప్పురూ సమస్తమానవాళికి**
> **సదా ఆదర్శప్రాయులు.**
> **అందుకే భారతీయులందరూ**
> **గోకులాష్టమి పండుగ**
> **భక్తిప్రపత్తులతో చేసుకుంటారు**

## 2024, సెప్టెంబరు నెల ఉత్సవాలు, పర్వదినాలు

- **03** పోలాల అమావాస్య
- **05** శ్రీబలరామజయంతి, శ్రీవరాహజయంతి
- **07** వినాయకచవితి
- **15** శ్రీవామనజయంతి
- **16-18** తిరుచానూరు, శ్రీపద్మావతిఅమ్మవారి పవిత్రోత్సవం
- **17** అనంతపద్మనాభవ్రతం
- **18** మహాలయపక్షప్రారంభం

మాన్నాలూ వండిపెట్టి, తడిపిండితో చిన్నిచిన్ని కన్నయ్యపాదా లను ఇంటి ముంగిలి నుండి పూజ గది దాకా ఇంటింటావేసి "కన్నయ్యా! నీ కోసమే మేం ఎదురుచూస్తున్నాం. నీవు మా ముంగిటిముగ్గులమీదుగా బుడిబుడినడకలతో నడచి వచ్చి మా దేవతాపీఠాన్ని అధివసించు. కన్నా! మా నివేదనను మా ఆత్మార్పణగా గ్రహించు. నీ చిన్నిపాదాల ముద్రలు మా మనస్సులమీద శాశ్వతంగా జన్మజన్మలకూ నిలచిపోనీరా చిన్నితండ్రీ: నీవు నడచిన ఇంట బాలపరమాత్మలాంటి పసివాళ్లు కళకళలాడేలా అనుగ్రహించు" అని వేడుకుంటూ కంటికి రెప్ప అడ్డుపడేలోగా మాయ కిష్టయ్య మరుగవుతాడేమోనని రాత్రంతా భజనచేస్తూ మనస్సును పావనగంగను కన్న ఆ విష్ణుపదాయత్తం చేసి ధన్యులవుతారు ఇల్లాళ్లు.

గ్రామాల్లో ఉట్లు కొట్టే సంప్రదాయం ఒకటి ఉంది. గోమాతలు పితికే పాలను, నవనీతామృతాన్ని ఉట్లమీద, బానల్లో దాచుకుంటూ లోభాన్ని పెంచుకుంటుంటే ఆ ఉట్లబంధాన్ని తెగకొట్టి, సర్వాంతరాత్మతత్త్వంగా పదిమందికీ పంచి భవ బంధాలు పటాపంచలు అయేలా బానలు పగలకొట్టి పరమాత్మ సూక్ష్మతత్త్వాన్ని గ్రహించమనటానికి సూచనగా తోస్తుందీ సంప్రదాయంలోని ఆధ్యాత్మికతత్త్వం. అందుకే "ఫలం సర్వం కృష్ణార్పణం" అనమంటారు పెద్దలు.

ఈ నెల 20న **గాయత్రీ జపం** సందర్భంగా...



# కోరింది కోరినట్లు లభిస్తుంది!

- శ్రీ గరిమెళ్ల శరవణ దీక్షితులు, 92461 04310

గాయత్రీమంత్రాన్ని మించిన మంత్రం లేదు. కన్నతల్లి ఎలాగైతే బిడ్డల్ని కాపాడుకుంటుందో తన మంత్రాన్ని ఉపాసించిన వారిని గాయత్రీమాత కూడా అలా కాపాడుతుంది.

ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం- ఈ మూడు సంధ్యల్లోనూ గాయత్రీమంత్రాన్ని జపించటం వల్ల ఏకాగ్రత, ఇంద్రియాలపై పట్టు లభిస్తాయి. నిత్యం నియమనిష్ఠలతో గాయత్రిని ధ్యానించలేని, ఉపాసించలేని వారు గాయత్రీ మంత్రాన్ని త్రికాలాలలోనూ పదిసార్లు చొప్పున జపించినా ఉత్తమ ఫలితాలు కలుగుతాయి. ఏ పనిలో ఉన్నప్పటికీ చేస్తున్న పనిని కాసేపు ఆపి, పాదరక్షలు వదిలిపెట్టి ఈ మంత్ర జపం చేయవచ్చు. గాయత్రీమంత్రాన్ని జపం చేస్తూ, హోమం చెయ్యటం ద్వారా కొన్ని రోగాల నుంచి ఉపశమనం దొరుకుతుంది.

రావిచెట్టు కింద శనివారం కూర్చొని నూరుసార్లు గాయత్రీమంత్రాన్ని జపిస్తే భూతరోగాల నుంచి విముక్తి లభిస్తుంది. తిప్పతీగముక్కలు పాలలో నానపెట్టి గాయత్రీ మంత్రాన్ని జపిస్తూ ఆహుతి ఇస్తే అది మృత్యుంజయహోమం చేసిన ఫలితాన్నిస్తుంది. సర్వరోగనివారణ కలుగుతుంది. జ్వరం శాంతించటంకోసం గాయత్రీమంత్రాన్ని జపిస్తూ మామిడాకులు, పాలను కలిపి ఆహుతి ఇవ్వాలి. పాలలో వసను నానపెట్టి అగ్నిలో హోమం చేస్తే క్షయరోగం తగ్గుతుంది.

పాలు, పెరుగు, నెయ్యి ఈ మూడింటినీ కలిపి గాయత్రీ మంత్రంతో హోమం చేస్తే రాజయక్ష్మరోగం శాంతిస్తుంది. సోమలతను కణుపుల వరకూ తుంచి ఆ ముక్కలను అమావాస్య నాడు పాలతో కలిపి ఆహుతి ఇస్తే క్షయవ్యాధి నివారణ అవుతుంది. గాయత్రీమంత్రాన్ని జపిస్తూ శంఖవక్షపు పూలతో హోమం చేస్తే కుష్టురోగం తొలగుతుంది. మేడిచెట్టుసమిధలతో గాయత్రీమంత్రం జపిస్తూ హోమం చేస్తే మేహరోగాలు నశిస్తాయి. చెరకురసం, తేనె కలిపి హోమం చేసినా మేహ సంబంధ రోగాలు శాంతిస్తాయి. పాలు, పెరుగు, నెయ్యి కలిపి ఆహుతి ఇస్తే మశూచి రోగం మటుమాయమౌతుంది.

మేడి, మర్రి, రావి సమిధలతో హోమం చేస్తే ఆవులు, గుర్రాలు, ఏనుగులకు సంబంధించిన రోగాలు దూరమౌతాయి. జమ్మిసమిధలను పాలు, నెయ్యితో కలిపి రెండేసి వందల సార్లు గాయత్రీమంత్రంతో హవనం చేస్తే ఇంట్లో శాంతి నెలకొంటుంది. ఈ హోమం తర్వాత అన్నాన్ని బలిగా వేయాలి. మట్టిబెడ్డను నూరుసార్లు గాయత్రితో అభిమంత్రించి ఏ దిశకు విసిరితే ఆ దిశనుంచి కలిగే అగ్నిభయం, గాలిభయం, దొంగల భయం నశిస్తాయి. దర్భను తాకి గాయత్రిని జపిస్తే భూతరోగాల నుంచి విముక్తి లభిస్తుంది. గాయత్రీమంత్రజలాన్ని తాగినా ఇదే ఫలితం కలుగుతుంది. భూతశాంతికి నూరుసార్లు గాయత్రీ మంత్రంతో భస్మాన్ని అభిమంత్రించి ఆ తర్వాత దాన్ని నొసటన ధరించాలి. అలాంటి వారికి భూతశాంతితో పాటు వ్యాధుల నుంచి విముక్తి కలుగుతుంది.

గాయత్రీమంత్రంతో చక్కగా విచ్చిన పూలను తెచ్చి అగ్నిలో హోమం చేస్తే పుష్టి కలుగుతుంది. ఎర్రకమలాలను గాయత్రీమంత్రంతో వ్రేల్చితే ధనప్రాప్తి కలుగుతుంది. మారేడు సమిధలను కానీ, ఫలపుష్పాలను కానీ, మారేడువేర్లను కానీ హోమం చేసిన వారింట సిరిసంపదలు తులతూగుతాయి.

మారేడుసమిధలు పాలలో, నేతిలో తడిపి రోజుకు రెండు వందల సార్లు చొప్పున వారం రోజులపాటు హోమం చేస్తే తరగని సిరిసంపదలు, సుఖశాంతులు కలుగుతాయి. పాలు, పెరుగు, నెయ్యి, పేలాలు కలిపి గాయత్రీమంత్రంతో జపం, హోమం చేసిన వరుడికి మంచి వధువు లభిస్తుందని దేవీ భాగవతంలో గాయత్రీమంత్ర జపహోమాల విశేషాల వివరణ కనిపిస్తుంది.

గాయత్రీమంత్రంలోని నాలుగు పాదాలు నాలుగు వేదాల నుంచి ఉద్భవించాయి. గాయత్రీమంత్రజపం చెయ్యటం వల్ల మొదటి పాదంలో ఋగ్వేదంలో చెప్పబడ్డ శుభప్రాప్తి, ఈశ్వరప్రాప్తి, జ్ఞానం, ఆత్మశాంతి, ధర్మనిరతి, కర్తవ్యపాలన, ప్రేమ, దయ, సేవ, ఉపకారత్వం మొదలైన ఫలితాలు కలుగుతాయి. వీటితో పాటు రెండవ పాదంలో యజుర్వేదంలో చెప్పబడ్డ వీరత్వం, రక్షణ, కీర్తి, నేతృత్వ సామర్థ్యం కలుగుతాయి. మూడవ పాదంలో సామవేదంలో చెప్పబడ్డ మనోవికాసం, ఆనందం, సంగీతం, సాహిత్యకళలు, వినోదాన్ని ఇచ్చే శక్తి సాధ్యమౌతాయి. నాలుగవ పాదంలో అథర్వణవేదంలో పేర్కొన్న ధనధాన్యవైభవం, అన్నవస్త్రాదులు, వస్తువాహనాలు, సుఖజీవనం కలుగుతాయి. గాయత్రీమంత్రంలోని విద్యుత్ ప్రవాహం వంటి తేజస్సు ఆత్మతేజస్సుతో సమానం. ఆ తేజస్సును ధ్యానిస్తే సమస్త ప్రాపంచికవాసనలు నశిస్తాయి. ఆత్మసాక్షాత్కారం లభిస్తుంది. వేదాలు శబ్దబ్రహ్మగా మూర్తీభవించినప్పుడు ప్రజ్వరిల్లిన శబ్దశక్తి స్వరూపమే గాయత్రీబీజశక్తి. ఒక్కమాటలో చెప్పాలంటే గాయత్రీమంత్రజపంతో సాధించనిది ఏదీ లేదు.

ఈ నెల 19న హయగ్రీవ జయంతి

# వేదాలను ఉద్ధరించిన స్వామి

– డా॥ కె.రాధారమణ

**జ్ఞానానందమయం దేవం నిర్మలస్ఫటికాకృతిమ్,**
**ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవ ముపాస్మహే.**

అన్న శ్రీహయగ్రీవస్తుతి సుప్రసిద్ధం. జ్ఞానం, ఆనందం స్వరూపంగా గలవాడు, స్వచ్ఛమైన స్ఫటికంవంటి ఆకృతి గలవాడు, సమస్త విద్యలకు ఆధారమైనవాడు అయిన హయగ్రీవుణ్ణి ఉపాసిస్తున్నాం అని ప్రార్థనకు తాత్పర్యం.

ఇందులోని వర్ణనవల్లనే హయగ్రీవస్వామి స్వరూపస్వభావాలు కొంతవరకు గ్రహించవచ్చు. దుష్టశిక్షణకు, శిష్టరక్షణకు భగవంతుడు ఎన్నో అవతారాలు దాల్చాడు. అందులో హయగ్రీవావతారం ఒకటి. వేదోద్ధరణకు, జ్ఞానం, సదాచారం నశించకుండా నిరంతరంగా కొనసాగేటట్లు అనుగ్రహించడానికి ఈ స్వామి అవతరించాడు. శ్రీ వేదాంతదేశికులు హయగ్రీవుణ్ణి ప్రథమావతారంగా వర్ణించారు. అందుచే కృతయుగాది లోనే మొదటిమనువు కాలంలోనే ఈ అవతారం సంభవించినట్లు గ్రహించాలి. బ్రహ్మ నిర్వహించిన యజ్ఞంలో హయగ్రీవస్వామి జన్మించినట్లు పురాణాలు చెబుతున్నాయి. మధుకైటభులను సంహరించి హయగ్రీవుడు వేదాలను ఉద్ధరించాడు. విష్ణుసహస్రనామంలో "గురుః, ఉత్తరః, గోపతిః, గోప్తా, జ్ఞానగమ్యః, పురాతనః, శరీరభూతభృత్, భోక్తా" అన్న ఎనిమిది నామాలు హయగ్రీవవైభవాన్ని ప్రకటిస్తున్నాయని శ్రీపరాశరభట్టరు తెలిపారు.

శ్రీ వేదాంతదేశికులకు గరుడుడు ప్రత్యక్షమై హయగ్రీవమంత్రం ఉపదేశించాడనీ, ఆ మంత్రాన్ని శ్రీదేశికస్వామి భక్తిశ్రద్ధలతో జపించి హయగ్రీవానుగ్రహం పొంది మహాకవిపండితులుగా రూపొందారనీ పెద్దలు చెప్పారు. వారు రచించిన హయగ్రీవస్తోత్రం సుప్రసిద్ధం.



ఈ నెల 19వ
రాఖీపండుగ సందర్భంగా...

# మాటలకందని మాధుర్యం

- శ్రీమతి యడవల్లి మృదులలక్ష్మి,
82474 52522

సోదరసోదరీమణుల బాంధవ్యం అత్యంత పవిత్రంగా కలకాలం నిలవాలని జరుపుకునే పండుగ రక్షాబంధన్. అన్నకు చెల్లి అండగా, చెల్లికి అన్న తోడుగా జీవితాంతం ఉంటామని భరోసా ఇచ్చే పండుగ. రక్షాబంధన్ పండుగను రాఖీ పండుగ, రాఖీపౌర్ణమి అని కూడా అంటారు. ఈ పండుగను కొన్ని ప్రాంతాలలో శ్రావణపౌర్ణమి లేదా జంధ్యాలపూర్ణిమ అని కూడా అంటారు. అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు ప్రతీకగా జరుపుకునే పండుగ ఇది.


గుండె నిండా ధైర్యం, నేనున్నాననే భరోసా అన్నయ్య రూపంలో చెల్లెమ్మకు అందివస్తే, మరో అమ్మగా అనురాగం, ఆప్యాయత చెల్లెమ్మ చేతిపంటగా అన్నయ్యకు అందుతాయి. నుదుట తిలకం దిద్ది, నోరు తీపిచేసి, ఆత్మీయ శుభాకాంక్షలు అందించేందుకు ప్రతి ఇంటా చెల్లెమ్మ తన అన్నయ్యకోసం ఎదురుచూస్తుంది. చెల్లెమ్మ కట్టే రాఖీ కోసం రెక్కలుకట్టుకుని వాలతాడు అన్నయ్య. మాటలకందని మధురాను భూతులపందిరి అది. జన్మజన్మల బంధంగా పెనవేసుకున్న అన్నాచెల్లెళ్ల అనుబంధానికి శాశ్వతవేదిక రాఖీపూర్ణిమ.

## ఎన్నో పురాణ కథలు

రాఖీ ఈనాటి పండుగ కాదు. పురాణకాలం నుంచే శ్రావణపూర్ణిమరోజున మనదేశంలో 'రక్ష' (రాఖీ) కట్టుకునే ఆచారం ఉంది. ఈ పండుగ ఏర్పడడానికి ఓ పురాణగాథ కూడా ఉంది. ఒకానొక సమయంలో దేవతలు, రాక్షసుల మధ్య పుష్కరసంవత్సరాల పాటు భీకరయుద్ధం జరిగింది. రాక్షసుల ధాటికి తట్టుకోలేక ఇంద్రుడి శక్తి క్షీణించ సాగింది. పరివారంతో సహా అమరావతిలోని రహస్యప్రాంతంలో దాక్కుంటాడు ఇంద్రుడు.

భర్త నిస్సహాయతను గమనించిన శచీదేవి విష్ణుమూర్తిని పూజించి, ఆ 'రక్ష'ను ఇంద్రుడికి కడుతుంది. ఇది గమనించిన ఇతర దేవపత్నులు కూడా విష్ణువును అర్చించి, తమ భర్తలకు రక్ష కడతారు. ఈశక్తితో ఆత్మస్థైర్యం వచ్చిన దేవతలు రాక్షసులపై విజయం సాధిస్తారు. శ్రావణ పూర్ణిమ రోజున శచీదేవి ఇంద్రునికి రక్ష కట్టడంతో, నాటి నుంచి శ్రావణ పూర్ణిమ రోజున రక్ష కట్టడం ఆచారంలోకి వచ్చింది.

మరికొన్ని పురాణగాథలు కూడా రాఖీపండుగను ప్రాచుర్యానికి తెచ్చాయి. బలిచక్రవర్తి అధీనంలో ఉన్న విష్ణువును విడిపించ డానికి లక్ష్మీదేవి బలి చక్రవర్తికి 'రక్ష' పంపించినట్లు కథ ఉంది.



అదేవిధంగా మరెందరో స్త్రీలు, బలికి రక్ష కట్టి, తమ భర్తలను విడిపించుకున్నట్లు ఐతిహ్యం ఉంది.

ద్వాపరయుగంలో శ్రీకృష్ణుడికి ద్రౌపది రక్ష కడుతుంది. ఇందుకు ప్రతిగా ఆపద కలిగిన ప్రతిసారీ కృష్ణుడు పాండవులను రక్షించి, తన చెల్లెలి పసుపుకుంకుమలు కాపాడతాడు. రక్ష ధరించిన వారికి యమదూతల భయం ఉండదట. శివాజీ మహారాజు జాతీయ సమైక్యత సాధనకోసం రక్షాబంధనాన్ని జాతీయ పండుగగా నిర్వహించినట్లు చరిత్ర.

## 'రక్ష' ఎలా కట్టుకోవాలంటే...

రక్ష(రాఖీ) ధరించడానికి కొన్ని నియమాలున్నాయి. శ్రావణపూర్ణిమ రోజున రక్ష కట్టేవారు, కట్టించుకునేవారు ఇద్దరూ అభ్యంగన స్నానం చేయాలి. తర్వాత సోదరి సోదరుడి నుదుట తిలకం దిద్దాలి.

అనంతరం **'యేన బద్ధో బలీరాజా, దానవేంద్రో మహాబలః, తేన త్వాం అభిబధ్నామి రక్ష మాం అచల'** అనే శ్లోకాన్ని చెబుతూ సోదరుడికి రక్ష కట్టాలి. సోదరుడు సోదరికి మంగళద్రవ్యాలు, మధుర ఫలాలు కానుకలుగా అందించాలి.

## వేదాధ్యయనానికి శ్రీకారం

శ్రావణపూర్ణిమరోజు నుంచే వేదాధ్యయనం ప్రారంభం చేస్తారు. శ్రావణ పూర్ణిమరోజున వేదవాణి స్పష్టంగా వినబడుతుంది. అందుకే ఈ రోజు నుంచి వేదాధ్యయనం ప్రారంభించాలని శాస్త్రనియమం.

శ్రావణపూర్ణిమ రోజున నూతన వటువులకు ఉపాకర్మ చేసి, వేదాధ్యయనం ప్రారంభం చేస్తారు. ఇతరులు నూతన యజ్ఞోపవీతాలు ధరిస్తారు. ఈ కారణంగా రాఖీపూర్ణిమకు జంధ్యాలపూర్ణిమ అనే పేరు కూడా వ్యాప్తిలో ఉంది.

రక్షాబంధనం కేవలం పండుగ మాత్రమే కాదు. కుటుంబసంబంధాల పటిష్ఠతకు పునాది వేసే పరమ ఔన్నత్యం కలిగిన రోజు. భారతీయ సనాతనధర్మం నిత్యనూతనం అనడానికి రక్షాబంధనం కన్నా వేరే నిదర్శనం అవసరం లేదు.

రాఖీ కట్టుకోవడంతోనే శ్రావణపూర్ణిమ పరమార్థం నెరవేరదు. యుగాలనాటి భారతీయచరిత్రకు, ఈ దేశచక్రవర్తుల శౌర్యప్రతాపాలకు రాఖీ ప్రతీకగా నిలుస్తుంది. పాశ్చాత్య సంస్కృతి ప్రభావంతో అనుబంధాలు మరుస్తున్న నేటి తరానికి రాఖీపండుగ అన్నాచెల్లెళ్ల అనురాగ పరిమళాలు అందిస్తుంది. ఇది మనసు పండుగ. మనదైన పండుగ.

**రాఖీ పండుగ కేవలం
అన్నాచెల్లెళ్ళు, అక్కాతమ్ముళ్ళకు మాత్రమే
పరిమితం అనే భావన సమాజంలో వ్యాప్తిలో ఉంది.
అది పూర్తిగా అపోహ మాత్రమే.**

**ఎవరి యోగక్షేమాలు మనం కోరుకుంటున్నామో వారికి
మనం రక్ష కట్టవచ్చు. రక్ష స్వీకరించవచ్చు.**

**సంబంధాలతో సంబంధం లేకుండా... అంటే,
తల్లి బిడ్డకైనా, చెల్లి అక్కకు అయినా... ఇలా ఎవరికి ఎవరైనా రక్ష కట్టవచ్చు.**

రక్షను కట్టడం అంటే అవతలి వ్యక్తి యోగక్షేమాలను మనం పూర్తిగా
కోరుకుంటున్నామని అర్థం. రక్షను స్వీకరించామంటే
అవతలి వ్యక్తి పట్ల మనకు పుణ్యభావన ఉన్నదని అర్థం.

**ఆధ్యాత్మిక పునాదిగా పరస్పరసంబంధాలను పరిపుష్టం
చేసుకోవడమే రక్షధారణకు అర్థం. పరమార్థం కూడా.**



# పిల్లలు పుడతారు ఈ స్వామిని కొలిస్తే...

- శ్రీమతి రమాశాండిల్య, 96187 66600

అప్రమేయస్వామి దేవాలయం, కర్ణాటకరాష్ట్రం, రామనగర జిల్లాలోని, దొడ్డమల్లూరుపట్నంలో ఉంది. ఇది బెంగుళూరు, మైసూరు హైవేమీద ఉన్న చెన్నపట్టణ అనే ఊరికి రెండు కిలో మీటర్ల దూరంలో ఉంది.

ఈ ఊరు బొమ్మలకు ప్రాముఖ్యత కలిగిన ఊరు. ఇక్కడ దేశవిదేశాలకు బొమ్మలు ఎగుమతి చేసే కర్మాగారాలున్నాయి.

ఈ బొమ్మలు బొమ్మలకొలువుల్లో పెట్టుకోవటానికి, అమ్మాయిలను అత్తవారింటికి పంపించటానికి సారెగా ఇస్తారు. ముఖ్యంగా పెద్దమ్మ, పెద్దాయన బొమ్మలు కన్నడిగులందరి ఇళ్ళల్లో ఉంటాయి. అలాంటి ప్రసిద్ధి పొందిన ముఖ్యమైన ఊరికి దగ్గరలో ఉన్న దేవాలయమే, ఈ అప్రమేయస్వామి దేవాలయం.



ఈ ఆలయాన్ని చోళరాజులు పదకొండవ శతాబ్దంలో నిర్మించారు. ద్రవిడనిర్మాణశైలిని కలిగి ఉంటుంది. విజయ నగరరాజులకాలంలో ప్రాకారాలన్నీ పునర్నిర్మించారు. కనుకే, చోళుల, విజయనగరరాజుల కాలంలోని శిల్పకళతో, కట్టుబడి కలయికతో ఉంటాయి.

ఈ ఆలయంలో గర్భగుడిలోని ముఖ్యమూర్తులు అప్రమేయస్వామి, అరవిందవల్లీతాయారు. ఈ ఆలయానికి మరొక పేరు కూడా ఉంది. అంబేగళు దేవాలయం. అంబేగళు అంటే కన్నడభాషలో పారాడే కృష్ణుడి ఆలయం అని.

ఈ దేవాలయాన్ని దొడ్డమల్లూరుగానూ, దక్షిణఅయోధ్య గానూ, చతుర్వేదమంగళపుర గాను, జ్ఞానమంటపక్షేత్రంగాను పిలుస్తుంటారు.

దొడ్డమల్లూరుకు ఎన్నో పేర్లు ఉన్నా, అన్నిటికన్నా కూడా ఒక ప్రత్యేకమైన పేరు ఉంది. అది, స్వామి యొక్క మాయావిలాసాన్ని, గొప్పతనాన్ని గుర్తుచేస్తుంటుందట. అదే, 'మల్లెత్తూరు. 'మల్లెత్తూరు అంటే ఎదగటం అని అర్థం అట.

దక్షిణ అయోధ్య అనే పేరు రావటానికి కూడా ఒక కథ ఉంది.

శ్రీరామచంద్రస్వామి ఇక్కడ కొంతకాలం ఉండి, యజ్ఞ యాగాదులు చేశాడు. ఆ ఆనవాళ్లు ఇప్పటికీ ఇక్కడ ఉన్నాయి. అందుకే, దీన్ని దక్షిణఅయోధ్య అంటారు.

ఇక ఆలయంలో ఒకే రాతిలో చెక్కిన దీపస్తంభం ఉంటుంది. ఆలయం ముందుభాగంలో ఒక మంటపం ఉంటుంది. ఆ మంటపానికి కొంచెం వెనుకగా రథమంటపం ఉంటుంది. అందులోనే రథం కూడా ఉంది. ఒక స్తంభాన్ని

కావలించుకుంటే, ఆ స్తంభాన్ని పట్టుకుని, పడిపోకుండా ప్రదక్షిణ చేసినా కోరిన కోరికలు తీరుతాయని భక్తుల నమ్మకం.

ఇంతకూ అప్రమేయస్వామి అంటే అర్థం... ప్రమేయ మంటే కొలవగలిగింది అని, అప్రమేయమంటే కొలవలేనంత ఉన్నతమైనవాడని అర్థం.

అప్రమేయస్వామి అతిసౌందర్యమూర్తి. చారెడేసి అందమైన కన్నులు గలవాడు. ఈయన చతుర్భుజమూర్తి. పై రెండుచేతులలో పాంచజన్యం, సుదర్శనచక్రం, క్రింది రెండు చేతులలో కౌముది, పద్మమూ ధరించి ఉంటాడు.

ఆలయానికి వాయవ్యంలో ఉన్న విష్ణుతీర్థం అనే కొలనులో అనేక అరవిందాలు విరిసేవట. అందులోనే దర్శన మిచ్చిన లక్ష్మీదేవిని అరవిందవల్లిగా పూజిస్తారు. ఈ అమ్మవారు కూడా చతుర్భుజి. పై రెండుచేతులలో తామరపూవులు, క్రింది రెండుచేతులలో అభయ, వరదముద్రలు ఉంటాయి.

అక్కడినుంచి కొంచెం ముందుకు వెడితే అంబెగళు కృష్ణుని ఆలయం ఉంటుంది. ఇక్కడి మూలస్వామి అందమైన పాకే కృష్ణుడు. అతనే మన నవనీతచోరుడైన కృష్ణుడు. ఈ మూర్తి ఎడమచేతిలో వెన్నముద్ద ఉంటుంది. కుడిచేతిని భూమిని ఆధారం చేసుకుని పారాడే రూపం ఈయనది.

కన్నడ వాగ్గేయకారుడైన పురందరదాసు ఇక్కడి నవనీతచోరుని రూపసౌందర్యానికి మైమరచిపోయాడు. ఆ రూపం ఆయనకు యశోద ఒడిలోని కృష్ణుడుగా కనిపించింది. అందుకనే, ఆశువుగా ప్రపంచ ప్రసిద్ధిచెందిన కీర్తనను రచించి, గానం చేశాడు. ఆ కీర్తన... "జగదోద్ధారన ఆడిసిదలే యశోదే" అనే కీర్తన.

ఈ కృష్ణుణ్ణి సంతానం ప్రసాదించేస్వామిగా కూడా కొలుస్తారు. పిల్లలు లేని దంపతులు ఊయల ఇస్తామని మొక్కు కుంటారు. ఈ ఆలయంలో వైకుంఠనారాయణస్వామి, మహాలక్ష్మి మొదలైనవారు కూడా పూజలందుకుంటూ ఉంటారు.

ఇక్కడ ధనుర్మాసం నెలరోజులు ఉదయం, సాయంత్రం అభిషేకం, అర్చనలు, బాలభోగం, మహానైవేద్యం, రాత్రి నైవేద్యం కూడా పెట్టి స్వామిని పూలతో అందంగా అలంకరిస్తారు.



తప్పకుండా దర్శించాల్సిన ఆలయమిది. ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం పన్నెండుగంటల వరకూ, సాయంత్రం నాలుగు నుంచి, రాత్రి ఎనిమిది గంటల వరకూ ఉంటుంది ఆలయం!

## నారాయణగిరిలో ఛత్రస్థాపనోత్సవం

**(2024, ఆగష్టు 16వ తేది)**

**ప్రతి సంవత్సరం సౌరమాన ఆషాఢమాసం శుద్ధ ఏకాదశీ సందర్భంగా మరునాడు శుద్ధద్వాదశి రోజున ఈ ఉత్సవం జరుగుతుంది. ఆనాడు ఉదయం శ్రీవారి ఆలయం నుంచి బాజాభజంత్రీలతో శ్రీవారి అర్చకులు, వేదపండితులు, ప్రసాదాలతో, ఛత్రచామరాలతో బయలుదేరి నారాయణగిరి పర్వతంపైన వెలసిన శ్రీవారి దివ్యపాదపద్మాల సన్నిధికి చేరుకుంటారు.**

**మహావైకుంఠం నుండి వచ్చి భూలోక వైకుంఠ మైన ఈ క్షేత్రంలో శ్రీవేంకటేశ్వరుడు మొట్టమొదట ఈ పర్వతంపై కాలుమోపాడు. ఈ పర్వతంపై వెలసిన శ్రీని వాసుని దివ్యపాదపద్మాలకు అభిషేకాది అలంకార అర్చనలు, నివేదనాదులు అయిన తర్వాత రెండు భూచక్ర గొడుగులను అక్కడి స్తంభాలకు గాని, చెట్లకుగాని కట్టి వస్తారు. అక్కడ చేరిన భక్తులకు ప్రసాదవితరణ జరుగు తుంది.**

108 దివ్యదేశాలు

# తిరువైగుందవిణ్ణగరమ్

– ఆచార్య చక్రవర్తి రంగనాథన్, 94409 19186

తిరునాంగూర్ దివ్యదేశాలలో ఐదవ దివ్యదేశం ఇది. వైకుంఠనాథదేవాలయం అని కూడా ఈ దివ్యదేశాన్ని పిలుస్తారు. తిరువిణ్ణాళీ అని కూడా ఒక పేరుంది. అద్భుతప్రాకారాలతో, శ్రీవైకుంఠంలో శ్రీమన్నారాయణుడు ఎలా వేంచేసి ఉంటాడో అదే ప్రకారం కూర్చున్న భంగిమలో వైకుంఠనాథుడనే దివ్య నామంతోనే మూలమూర్తి శ్రీదేవి, భూదేవి, నీళాదేవీ సమేతుడై తూర్పుదిక్కు చూస్తూ అందరినీ అనుగ్రహిస్తూ ఉన్నాడు. ఉత్సవ మూర్తి కూడా వైకుంఠనాథుడై కూర్చున్న భంగిమలో సేవను ప్రసాదిస్తున్నాడు. అమ్మవారు వైకుంఠవల్లీ తాయార్ అనే పేరుతో కూర్చున్న భంగిమలో ప్రత్యేక ఆలయంలో వేంచేసి ఉన్నారు. స్థలతీర్థం–లక్ష్మీపుష్కరిణి, ఉదంక పుష్కరిణి. ఆనంద సత్యవర్ధక విమానం, సత్యవ్రత విమానం అని విమానాలు.

## స్థలపురాణం


ప్రతిజీవుడు కూడా పరమపురుషార్థమైన మోక్షాన్ని పొంది అక్కడ శ్రీవైకుంఠనాథునికి ఆ దివ్యలోకంలో కైంకర్యం చేయాలి అనే ఆశతో ఉంటారు. అదే ప్రకారం శ్వేతకేతువు అనే రాజు, అతని ధర్మపత్ని దమయంతి, పరమపదంలో వైకుంఠ నాథుడికి సేవచేయాలి అనే ఉద్దేశ్యంతో రాజ్యసుఖభోగాలన్నీ పరిత్యజించి గాఢంగా తపస్సు చేశారు. ఫలితంగా వీళ్లిద్దరూ శ్రీవైకుంఠలోకానికి వెళ్లారు. అక్కడ భగవంతుడి దర్శనం దొరకలేదు. అది కాకుండా ఆ లోక విరుద్ధంగా వీళ్లకు ఆకలి, దప్పిక, నిద్ర, బాధ, కష్టం అన్నీ కలిగాయి. "అయ్యో! ఇలా ఎందుకు జరిగింది" అని వాళ్లిద్దరూ భూలోకా నికి వస్తున్న సమయంలో నారదముని కనిపిం చాడు. ఆ దంపతులు తమ బాధనంతా వెళ్ల బుచ్చారు. నారదమహర్షి "శ్వేతకేతువు పూర్వజన్మలో యజ్ఞయాగాదులు చేయకపోవడం, వేదమంత్రాలు




పఠించకపోవడం, భాగవతులకు కైంకర్యం చేయకపోవడం వల్ల ఇలాంటి స్థితి నీకు కలిగింది, అందువల్ల మీరు భగవంతుడు శ్రీవైకుంఠంలో పొందేటటువంటి ఆ ఆనందాన్ని భూలోకంలోనే ప్రాప్తింపచేయడంకోసం భగవంతుడు సంకల్పం చేసుకున్నాడేమో. అందువల్ల మీరు నారాయణుడి దర్శనంకోసం ఐరావతేశ్వరుడు అనే పేరుతో పరమశివుడు, ఉదంకమహర్షి ఈ వైగుందవిణ్ణగరమ్‌లో, కావేరీనదీతీరంలో, పలాసవనం సమీపంలో తపస్సు చేస్తూ ఉన్నారు. అందుచేత మీరు కూడా వెళ్లి తపస్సు చేస్తే శ్రీమన్నారాయణుని దర్శనం కలుగుతుంది" అని ఉపదేశించాడు.

నారదుని సూచనను మన్నించి శ్వేతకేతువు, దమయంతి ఇద్దరూ ఐరావతేశ్వరుడు, ఉదంకమహర్షి అందరూ వేయి సంవత్సరాల పాటు తపస్సు చేశారు. వాళ్ల తపస్సుకు మెచ్చిన భగవంతుడు శ్రీవైకుంఠనాథుడిగానే ఇక్కడ వాళ్లకు దర్శన భాగ్యాన్ని కలిగించాడు. వాళ్ల ప్రార్థన మేరకు దేవదేవుడు ఈ దివ్యదేశంలోనే వైకుంఠనాథుడిగా వేంచేసి ఉన్నాడు. శ్వేత కేతు, దమయంతి దంపతులు ఈ శ్రీవైకుంఠనాథుడికి అనేక విధములైన కైంకర్యాలు చేసి చివరగా పరమపదాన్ని పొందారు.

ఈ దివ్యదేశస్థలపురాణాన్ని ఎవరైతే వింటారో, ఎవరైతే చదువుతారో వాళ్లకు తప్పక సత్సంతానం కలుగుతుంది. ధన ధాన్య ఐశ్వర్యాదులు, ముక్తి కలుగుతాయని పద్మపురాణం తెలియజేస్తోంది. తిరుమంగైఆళ్వారు మంగళాశాసనం చేశాడు. పాంచరాత్ర ఆగమోక్తంగా భగవంతుడికి పూజాది కార్యక్రమాలు జరుగుతాయి.



# గోపూజా విధానం



'గోకులాష్టమి' సందర్భంగా గోపూజావిధానం.. 'సప్తగిరి' పాఠకుల కోసం...!!

హిందువులకు గోవు పవిత్రపూజ్యమూర్తి, సకలదేవతా స్వరూపం. గోమాతను పూజించేవారికి సత్సంతానం, సౌభాగ్యం, జ్ఞానమోక్షాలు కలుగుతాయి. గోవును పూజించడమంటే శ్రీకృష్ణుని పూజించడమే! గోవు రాహుగ్రహాధిదేవత. గోపూజ సకల పీడాపరిహారకం. ప్రత్యక్షంగానైనా, విగ్రహరూపంలోనైనా గోపూజ చేయ వచ్చు. దీపారాధన తర్వాత, గోమాత ప్రార్థనతో పూజను ప్రారంభించాలి.

## గో ప్రార్థన

శ్లో॥ నమో బ్రహ్మణ్యదేవాయ, గో బ్రాహ్మణహితాయ చ ।
జగద్ధితాయ కృష్ణాయ గోవిందాయ నమో నమః ॥

శ్లో॥ ఘృతక్షీరప్రదా గావో ఘృతయోన్యో ఘృతోద్భవాః ।
ఘృతనద్యో ఘృతావర్తాః, తా మే సంతు సదా గృహే ॥

శ్లో॥ గావో మమాగ్రతో నిత్యం గావః పృష్ఠత ఏవ చ ।
గావో మే సర్వతశ్చైవ గవాం మధ్యే వసామ్యహమ్ ॥

(ఇలా ప్రార్థించిన తర్వాత- ఆచమనం చేసి, ప్రాణాయామం, సంకల్పం అనగా దేశకాలాదికాన్ని పఠించి, గోత్ర నామాదికం చెప్పుకొన్న తర్వాత)

"మమ శ్రుతి స్మృతి పురాణోక్త సర్వఫలప్రాప్త్యర్థం, సర్వపీడాపరిహారార్థం జ్ఞానప్రాప్తిద్వారా మోక్షఫలావాప్త్యర్థం, అఖండిత సుఖ సౌభాగ్య సంతత్యాయురారోగ్యైశ్వర్యాభివృద్ధ్యర్థం, కల్పోక్తప్రకారేణ గోపూజాం కరిష్యే॥" (అని చెప్పి, గోవుపై పూలు, అక్షతలు వేసి నమస్కరించాలి.)

(తర్వాత కలశపూజ, గణపతిపూజ చేయాలి)

(గణపతి పూజ తర్వాత, పూలు, అక్షతలు తీసుకొని, ఈ క్రింది విధంగా గోమాతను ధ్యానించి, తర్వాత పూలు, అక్షతలు గోపాదాల పై పెట్టి నమస్కరించాలి.)

## ధ్యానం

శ్లో॥ నమోగోభ్యః శ్రీమతీభ్యః సౌరభేయీభ్య ఏవ చ ।
నమో బ్రహ్మసుతాభ్యశ్చ పవిత్రాభ్యో నమో నమః ॥

శ్లో॥ గవామంగేషు తిష్ఠంతి భువనాని చతుర్దశ ।
యస్మాత్తస్మా చ్ఛివం మే స్యా దిహలోకే పరత్ర చ ॥

శ్రీగోమాత్రే నమః. ధ్యానం సమర్పయామి

## ఆవాహనం

శ్లో॥ "ఆగచ్ఛ దేవి కల్యాణి! శుభాం పూజాం గృహాణ చ ।
వత్సేన సహితాం త్వాఽహం దేవీ మావాహయామ్యహమ్ ॥

శ్రీగోమాత్రే నమః. ఆవాహనం సమర్పయామి

(అని చెప్పి, పూలు, అక్షతలు సమర్పించి నమస్కరించాలి.)

## ఆసనం

శ్లో॥ నానారత్నసమాయుక్తం కార్తస్వరవిభూషితమ్ ।
ఆసనం తే మయా దత్తం గృహాణ జగదంబికే!

శ్రీగోమాత్రే నమః. దివ్య సింహాసనం సమర్పయామి

(అని చెప్పి, పూలు, అక్షతలు సమర్పించి, నమస్కరించాలి.)

## పాద్యం

శ్లో॥ సౌరభేయి! సర్వహితే! పవిత్రే! పాపనాశిని!
గృహ్ణీ ష్వైత న్మయా దత్తం పాద్యం త్రైలోక్యవందితే!

శ్రీగోమాత్రే నమః. పాద్యం సమర్పయామి. (అని చెప్పి, కలశంలోని జలాన్ని ఉద్ధరణితో తీసుకొని, గోపాదాలు కడగాలి)

## అర్ఘ్యం

శ్లో॥ సర్వదేవమయే! దేవి! సర్వతీర్థమయే! శుభే!
గృహాణార్ఘ్యం మయా దత్తం సౌరభేయి! నమోఽస్తుతే

శ్రీగోమాత్రే నమః. అర్ఘ్యం సమర్పయామి. (కలశజలాన్ని ఉద్ధరిణితో తీసుకొని, గోమాతృహస్తాలు కడిగినట్లు భావించి, అర్ఘ్యపాత్రలో వదలాలి.)

## ఆచమనం

శ్లో॥ దేహస్థితాస్తి రుద్రాణీ శంకరస్య సదా ప్రియా ।
ధేనురూపేణ సా దేవీ మమ పాపం వ్యపోహతు ॥

శ్రీగోమాత్రే నమః. ముఖే ఆచమనీయం సమర్పయామి

(అని చెప్పి, ఉద్ధరిణి నీటిని గోముఖానికి మూడుసార్లు చూపించి, అర్ఘ్యపాత్రలో వేయాలి)

## స్నానం

శ్లో॥ యా లక్ష్మీః సర్వలోకేషు యా చ దేవే ష్వవస్థితా ।
ధేనురూపేణ సా దేవీ మమ పాపం వ్యపోహతు ॥

శ్రీగోమాత్రే నమః. స్నానం సమర్పయామి.

(అని చెప్పి, గోవుకు/గోవిగ్రహానికి స్నానం చేయించాలి.)
(అవకాశాన్ని బట్టి "శ్రీ సూక్తం" చెప్పి, అభిషేకించవచ్చు.)

## వస్త్రం

శ్లో॥ అచ్ఛాదనం గవే దద్యాం సమ్యక్ శుద్ధం సుశోభనమ్ ।
సురభి ర్వస్త్రదానేన ప్రీయతాం పరమేశ్వరి ॥

శ్రీగోమాత్రే నమః. వస్త్రం సమర్పయామి.

(అని చెప్పి, గోదేహం తుడిచి, వస్త్రాన్ని కప్పాలి.)

## గంధం

శ్లో॥ సర్వదేవమయే దేవి! చందనం చంద్రసన్నిభమ్ ।
కస్తూరీ కుంకుమాఢ్యం చ సుగంధం ప్రతిగృహ్యతామ్ ॥

శ్రీగోమాత్రే నమః. దివ్యపరిమళ శ్రీచందనం సమర్పయామి.

(అని చెప్పి, గంధం పెట్టి, దానిపై కుంకుమ పెట్టాలి)
(కాళ్లకు, ముఖానికి, కొమ్ములకు, మూపురానికి, తోక మొదటికి)

## అక్షతలు

శ్లో॥ శాలీయాం శ్చంద్రవర్ణాంశ్చ, హరిద్రామిశ్రితాన్ శుభాన్ ।
అక్షతాం శ్చార్పయే తుభ్యం గృహాణ జగదంబికే ॥

గోమాత్రే నమః. అలంకరణార్థం అక్షతాన్ సమర్పయామి.

(అక్షతలు గోవుపై వేసి, నమస్కరించాలి)

## పూలమాల / వనమాల

శ్లో॥ తులసీ కుందమందార పారిజాతాంబుజైర్యుతామ్ ।
వనమాలాం ప్రదాస్యామి, గృహాణ జగదీశ్వరి ॥

శ్రీ గోమాత్రే నమః. పుష్పమాలికాం సమర్పయామి.

(పుష్పమాలను గోవుకు వేసి, నమస్కరించాలి)

(తర్వాత గోమాతృశరీరంలో ఆయాస్థానాలలో ఆయా దేవతలను భావిస్తూ, అంగపూజ చేయాలి.)

## (గోః సర్వాంగేషు దేవతాహ్వానమ్)

గోపూజాంగత్వేన గోః అంగేషు సర్వాన్ దేవాన్ ఆవాహయామి

శృంగమూలయోః - బ్రహ్మ విష్ణూ ఆవాహయామి (కొమ్ముల మొదట)
శృంగాగ్రయోః - సర్వతీర్థాణి ఆవాహయామి (కొమ్ముల చివర)
లలాటే - మహాదేవం ఆవాహయామి (నుదురు)
లలాటాగ్రే - మహాదేవం ఆవాహయామి (నుదురు పై భాగం)
నాసా దండే - షణ్ముఖం ఆవాహయామి (ముక్కు కొనలు)
కర్ణయోః - అశ్వినౌ ఆవాహయామి (చెవులు)
చక్షుషోః - శశిభాస్కరౌ ఆవాహయామి (కన్నులు)
జిహ్వాయాం - వరుణం ఆవాహయామి (నాలుక)
హుంకారే - సరస్వతీం ఆవాహయామి (హుంకారం)
గండయోర్మధ్యే - ధర్మంఆవాహయామి (దవుడ)
ఓష్ఠయోః - సంధ్యా ద్వయం ఆవాహయామి (పెదవులు)
గ్రీవాయాం - ఇంద్రం ఆవాహయామి (మెడ)
కుక్షిదేశే - రక్షాంసి ఆవాహయామి (కడుపు)
ఉరసి - సాధ్యాన్ ఆవాహయామి (వక్షఃస్థలం)
చతుష్పాదేషు - ధర్మం ఆవాహయామి (నాలుకాళ్లు)
ఖురమధ్యే - గంధర్వాన్ ఆవాహయామి (గిట్టల మధ్య)
ఖురాగ్రే - పన్నగాన్ ఆవాహయామి (గిట్టల కొనలు)
ఖుర పార్శ్వేషు - అప్సరసః ఆవాహయామి (గిట్టల ప్రక్కల)
పృష్ఠే - ఏకాదశరుద్రాన్ ఆవాహయామి (వీపు చివర)
సర్వ సంధిషు - వసూన్ ఆవాహయామి (అవయవ సంధులు)
శ్రోణితటే - పితౄన్ ఆవాహయామి (పిఱుదులు)
లాంగూలే - సోమం ఆవాహయామి (తోక)
వాలరోమేషు - ఆదిత్యరశ్మీన్ ఆవాహయామి (తోక కుచ్చు)
మూత్రే - గంగాం ఆవాహయామి (పంచితం)
క్షీరే - సరస్వతీం ఆవాహయామి (పాలు)
దధ్ని - నర్మదాం ఆవాహయామి (పెరుగు)
సర్పిషి - హుతాశనం ఆవాహయామి (నేయి)
రోమసు - త్రయస్త్రింశత్కోటిదేవాన్ ఆవాహయామి (వెంట్రుకలు)
ఉదరే - పృథివీం ఆవాహయామి (కడుపు)
పయోధరేషు - సాగరాన్ ఆవాహయామి (పొదుగు)

గోః సర్వాంగేషు సర్వాన్ దేవాన్ ఆవాహయామి

## (తర్వాత - అంగపూజ)

నందిన్యై నమః - గోః పాదౌ పూజయామి
జగదుత్పత్తికారణాయై నమః - గోః జానునీ పూజయామి
జగద్రక్షణాయై నమః - గోః కటిం పూజయామి
పవిత్రాయై నమః - గోః కంఠం పూజయామి
సుశీలాయై నమః - గోః శృంగే పూజయామి
యజ్ఞసాధనాయై నమః - గోః ముఖం పూజయామి
విశ్వస్యాఘప్రణాశిన్యై నమః - గోః శిరః పూజయామి


(తర్వాత గో రహస్య నామావళితో గోవును పూజించాలి)

శ్లో॥ తులసీ కుంద మందార జాతీ పున్నాగ చంపకైః ।
కదంబ కరవీరైశ్చ కుసుమై శ్శతపత్రకైః ॥

శ్లో॥ నీలాంబుజైః బిల్వపత్రైః చంపకైః రుద్రరూపిణి ।
పూజయిష్యామ్యహం భక్త్యా సంగృహాణాచ్యుతార్చితే ॥

శ్రీగోమాత్రే నమః. పత్ర పుష్పైః పూజయామి

(గోమాత రహస్య నామావళి చెబుతూ, పత్రపుష్పాలతో గోమాతను పూజించాలి.)



# గో రహస్య నామావళి

ఓం శ్రీ కృష్ణవల్లభాయై నమః
ఓం కృష్ణాయై నమః
ఓం శ్రీకృష్ణపారిజాతాయై నమః
ఓం కృష్ణప్రియాయై నమః
ఓం కృష్ణరూపాయై నమః
ఓం కృష్ణప్రేమవివర్ధిన్యై నమః
ఓం కమనీయాయై నమః
ఓం కామధేనవే నమః
ఓం కల్యాణ్యై నమః
ఓం కల్యవందితాయై నమః 10
ఓం కల్పవృక్షస్వరూపాయై నమః
ఓం దివ్యకల్పసమలంకృతాయై నమః
ఓం క్షీరార్ణవసుసంభూతాయై నమః
ఓం క్షీరదాయై నమః
ఓం క్షీరరూపిణ్యై నమః
ఓం నందాది గోపవినుతాయై నమః
ఓం నందిన్యై నమః
ఓం నందనప్రదాయై నమః
ఓం బ్రహ్మానందవిధ్యాయిన్యై నమః
ఓం సర్వదేవగణస్తుత్యాయై నమః 20
ఓం సర్వధర్మస్వరూపిణ్యై నమః
ఓం సర్వభూతావనరతాయై నమః
ఓం సర్వదాయై నమః
ఓం సర్వమోదదాయై నమః
ఓం శిష్టేష్టాయై నమః
ఓం శిష్టవరదాయై నమః
ఓం సృష్టిస్థితిలయాత్మికాయై నమః
ఓం సురభ్యై నమః
ఓం సౌరభేయ్యై నమః
ఓం సురాసురనమస్కృతాయై నమః 30
ఓం సిద్ధిప్రదాయై నమః
ఓం అభీష్టసిద్ధి ప్రవర్షిణ్యై నమః
ఓం జగద్ధితాయై నమః
ఓం బ్రహ్మపుత్ర్యై నమః
ఓం గాయత్ర్యై నమః
ఓం ఏకహాయన్యై నమః
ఓం గంధర్వాదిసమారాధ్యాయై నమః
ఓం రాధాహస్తోపలాలితాయై నమః
ఓం యజ్ఞాంగాయై నమః
ఓం యజ్ఞఫలదాయై నమః 40
ఓం యజ్ఞేశ్యై నమః
ఓం యజ్ఞరూపిణ్యై నమః
ఓం హవ్యకవ్యప్రదాయై నమః
ఓం శ్రీదాయై నమః
ఓం స్తవ్యభవ్యక్రమోజ్జ్వలాయై నమః
ఓం బుద్ధిదాయై నమః
ఓం బుద్ధిదాయై నమః
ఓం బుద్ధ్యై నమః
ఓం ధనధాన్యవివర్ధిన్యై నమః
ఓం యశోదాయై నమః 50
ఓం సుయశఃపూర్ణాయై నమః
ఓం యశోదానందవర్ధిన్యై నమః
ఓం ధర్మజ్ఞాయై నమః
ఓం ధర్మవిభవాయై నమః
ఓం ధర్మరూపతనూరుహాయై నమః
ఓం విష్ణుపాదోద్భవీప్రఖ్యాయై నమః
ఓం వైష్ణవ్యై నమః
ఓం విష్ణురూపిణ్యై నమః
ఓం వసిష్ఠపూజితాయై నమః
ఓం శిష్టాయై నమః 60
ఓం శిష్టేష్టాయై నమః
ఓం శిష్టకామధుహే నమః
ఓం దిలీపసేవితాయై నమః
ఓం దివ్యాయై నమః
ఓం ఖురపావిత విష్టపాయై నమః
ఓం రత్నాకరసముద్భూతాయై నమః
ఓం రత్నదాయై నమః
ఓం శక్రపూజితాయై నమః
ఓం పీయూషవర్షిణ్యై నమః
ఓం పుణ్యాయై నమః 70
ఓం పుణ్యాపుణ్యఫలప్రదాయై నమః
ఓం పయఃప్రదాయై నమః
ఓం ఘృతదాయై నమః
ఓం ఘృతసంభవాయై నమః
ఓం కార్తవీర్యార్జునమృతిహేతవే నమః
ఓం హేతుక సన్నుతాయై నమః
ఓం కార్తవీర్యార్జునమృతిహేతవే నమః
ఓం హేతుకసన్నుతాయై నమః
ఓం జమదగ్నికృతాజస్రసేవాయై నమః
ఓం సంతుష్టమానసాయై నమః 80
ఓం పాదరేణుపాలితభూతలాయై నమః
ఓం సవత్సాయై నమః
ఓం వత్సకారాతి పాలితాయై నమః
ఓం భక్తవత్సలాయై నమః
ఓం వృషదాయై నమః
ఓం కృషిదాయై నమః
ఓం హేమశృంగాగ్రతల శోభితాయై నమః
ఓం భవ్యాయై నమః
ఓం భావితాయై నమః
ఓం భవనాశిన్యై నమః 90
ఓం భక్తిముక్తిప్రదాయై నమః
ఓం కాంతాయై నమః
ఓం కాంతాజనశుభంకర్యై నమః
ఓం సురూపాయై నమః
ఓం బహురూపాయై నమః
ఓం అచ్ఛాయై నమః
ఓం కర్బురాయై నమః
ఓం కపిలాయై నమః
ఓం అమలాయై నమః
ఓం సాధుశీలాయై నమః 100
ఓం సాధుబృందనిషేవితాయై నమః
ఓం సర్వవేదమయ్యై నమః
ఓం సర్వదేవరూపాయై నమః
ఓం ప్రభావత్యై నమః
ఓం వసూనాం దుహిత్రే నమః
ఓం రుద్రమాత్రే నమః
ఓం ఆదిత్యసహోదర్యై నమః
ఓం తుష్ట్యై పుష్ట్యై నమః
ఓం స్వధాయై నమః
ఓం మేధాయై నమః 110
ఓం బుద్ధ్యై నమః
ఓం సిద్ధ్యై నమః
ఓం స్మృత్యై నమః
ఓం ధృత్యై నమః
ఓం కాంత్యై నమః
ఓం లక్ష్మ్యై నమః
ఓం మహామాయాయై నమః
ఓం మహాదేవాదివందితాయై నమః
ఓం తీర్థస్వరూపాయై నమః
ఓం దేవేశ్యై నమః 120
ఓం లోకానాం మలహారిణ్యై నమః
ఓం జాహ్నవ్యై నమః
ఓం యమునాయై నమః
ఓం గోదాయై నమః
ఓం సూర్యపుత్ర్యై నమః
ఓం సరస్వత్యై నమః
ఓం యోగానందాయై నమః
ఓం యోగసిద్ధిప్రదాయై నమః
ఓం యోగిసేవితాయై నమః
ఓం శ్రీకర్యై నమః 130
ఓం శ్రీమత్యై నమః
ఓం శ్రీదాయై నమః
ఓం శ్రీమద్గోలోకవల్లభాయై నమః
ఓం శ్రీ గోమాత్రే నమః 134

శ్రీ గోమాత్రే నమః నానావిధ పుష్పాణి సమర్పయామి

*(తర్వాత ధూప, దీప, నైవేద్యాదులు సమర్పించాలి)*

## ధూపం

శ్లో॥ దేవద్రుమరసోద్భూతో గోఘృతేన సమన్వితః ।
ప్రయచ్ఛామి మహాభాగే! ధూపోఽయం ప్రతిగృహ్యతామ్ ॥

శ్రీగోమాత్రే నమః. ధూపం ఆఘ్రాపయామి

## దీపం

(మూడు వత్తులు వేసి వెలిగించాలి)

శ్లో॥ ఆనందకృత్ సర్వలోకే దేవానాం చ సదా ప్రియః ।
గౌ స్త్వం పాహి జగన్మాతః దీపోఽయం ప్రతిగృహ్యతామ్ ॥

శ్రీగోమాత్రే నమః. ఘృతవర్తి దీపం దర్శయామి.

## నైవేద్యం

(పచ్చిగడ్డి తినిపించాలి)

శ్లో॥ సురభి స్త్వం జగన్మాతః దేవి! విష్ణుపదే స్థితా ।
సర్వదేవమయే గ్రాసం మయా దత్తమిమం గ్రస ॥

శ్రీగోమాత్రే నమః. గ్రాస నైవేద్యం సమర్పయామి

(పిదప పులగం తినిపించాలి.)

శ్లో॥ కృశరాన్నసమాయుక్తం గోఘృతేన పరిప్లుతమ్ ।
నైవేద్యం చ మయా దత్తం సురభిః ప్రీయతా మితి॥

శ్రీగోమాత్రే నమః. కృశరాన్నం సమర్పయామి.

## తాంబూలం

శ్లో॥ పూగీఫలసమాయుక్తం నాగవల్లీదళైర్యుతమ్ ।
సౌరభేయి! నమస్తుభ్యం తాంబూలం ప్రతిగృహ్యతామ్ ॥

శ్రీగోమాత్రే నమః. తాంబూలం సమర్పయామి



## నీరాజనం

(హారతి కర్పూరం వేసి, దీనికి తోడుగా అయిదు నెయ్యి వత్తులు వాడాలి)

శ్లో॥ నీరాజనం గృహాణేదం పంచవర్తిసమన్వితమ్ ।
తేజోరాశిమయం దత్తం గృహాణ త్వం సురేశ్వరి!

శ్రీ గోమాత్రే నమః. కర్పూరనీరాజనం సమర్పయామి.

నీరాజనానంతరం శుద్ధాచమనీయం సమర్పయామి

(అని చెప్పి, ఉద్ధరణి నీళ్లు గోవుకు చూపించి, అర్ఘ్యపాత్రలో వదలాలి)

## పుష్పాంజలి

(దోసిలిలోనికి పూలు తీసుకొని - ఈ క్రింది శ్లోకాలు చెప్పి, గోవు పాదాలందుంచి నమస్కరించాలి.)

శ్లో॥ గావో మమాగ్రత స్సంతు, గావో మే సంతు పృష్ఠతః ।
గావో మే హృదయే నిత్యం గవాం మధ్యే వసామ్యహమ్ ॥

శ్లో॥ సర్వదేవమయే! దేవి! సర్వదేవైరలంకృతే ।
మాత ర్మమాభిలషితం సఫలం కురు నందిని ॥

## ప్రదక్షిణ నమస్కారం

(గోవు చుట్టు మూడుసార్లు ప్రదక్షిణంగా (ఎడమనుండి కుడికి) తిరిగి, సాష్టాంగంగా నమస్కరించాలి.)

శ్లో॥ గాం దృష్ట్వా తు నమస్కృత్య కుర్యాచ్చైవ ప్రదక్షిణమ్ ।
ప్రదక్షిణీకృతా తేన సప్తద్వీపా వసుంధరా ॥

శ్లో॥ మాతర స్సర్వభూతానాం గావ స్సర్వసుఖప్రదాః ।
వృద్ధి మాకాంక్షతా నిత్యం గావః కార్యాః ప్రదక్షిణాః ॥

గోమాత్రే నమః. ప్రదక్షిణ నమస్కారాన్ సమర్పయామి.

## నమస్కారాలు

శ్లో॥ క్షీరోదార్ణవసంభూతే! సురాఽసుర నమస్కృతే ।
మాత ర్మమాభిలషితం సఫలం కురు నందిని!

శ్లో॥ దేహస్థా యా చ రుద్రాణీ శంకరస్య సదా ప్రియా ।
ధేనురూపేణ సా దేవీ మమ శాంతిం ప్రయచ్ఛతు ॥


శ్రీగోమాత్రే నమః. నమస్కారాన్ సమర్పయామి.

(తర్వాత పూలు, అక్షతలు చేతిలోకి వేసికొని, మూడు ఉద్ధరణులు నీళ్లు అందులోవేసి, ఈ క్రింది వాక్యాన్ని చెప్పి, తట్టలో వదలాలి.)

"అనయా ధ్యానావాహనాది షోడశోపచారపూజయా మాతా సౌరభేయీ ప్రీణాతు".

"సర్వం శ్రీకృష్ణార్పణమస్తు"
"లోకా స్సమస్తా స్సుఖినో భవంతు"
ఓం శాంతిః శాంతిః శాంతిః
(తర్వాత గోవును మేత కోసం వదలాలి.)

ఈ నెల 16న
వరలక్ష్మీవ్రతం సందర్భంగా...



# నీ పూజ చేసేము తల్లీ!

– శ్రీమతి జానపాటి మనస్విని, 83175 81997

అన్ని సౌభాగ్యాల్ని (లక్ష్మిని) అందించేది వరలక్ష్మీదేవి. 'వర' అంటే 'కోరుకున్నది', 'శ్రేష్ఠమైంది' అని అర్థాలు. ఈ అర్థాలను అన్వయం చేస్తే కోరిన కోర్కెలు లేదా శ్రేష్ఠమైన కోర్కెలు ఇచ్చే తల్లిగా వరలక్ష్మీదేవిని భావించవచ్చు. ఈ దేవిని సమంత్రకంగా, భక్తిభావనతో కొలిచే వ్రతమే **'వరలక్ష్మీవ్రతం'**.

స్వయంగా పరమేశ్వరుడే పార్వతికి ఈ వ్రతం గురించి చెప్పాడు. అదే సందర్భంలో మహాభక్తురాలైన చారుమతీదేవివృత్తాంతాన్ని కూడా పరమేశ్వరుడు పార్వతికి వివరించాడు. చారుమతి ఉత్తమఇల్లాలు. మహాలక్ష్మీదేవిపట్ల ఎంతో భక్తిశ్రద్ధలు కలిగిన చారుమతి అమ్మవారిని త్రికరణశుద్ధిగా పూజిస్తుండేది. ఆమె పట్ల వరలక్ష్మీదేవికి అనుగ్రహం కలిగి, స్వప్నంలో ఆమెకు సాక్షాత్కరించింది. శ్రావణ పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం రోజున తనను ఆరాధిస్తే కోరిన వరాలన్నీ ఇస్తానని ఆమెకు అభయమిస్తుంది. అమ్మ ఆదేశానుసారం వరలక్ష్మీవ్రతాన్ని ఆచరించిన చారుమతి సమస్తసిరిసంపదల్ని వరలక్ష్మీవ్రతప్రసాదంగా అందుకుంటుంది.

## వరలక్ష్మి వైభవం

ఈ వ్రతాన్ని శ్రావణమాసంలో చేస్తారు. శ్రావణమాసంలో శ్రవణనక్షత్రం రోజున పూర్ణిమ వస్తుంది. శ్రవణం శ్రీనివాసుడి జన్మనక్షత్రం. పూర్ణిమ రోజున అమ్మవారు షోడశ కళలతో వెలుగొందుతుంది. శుక్రవారం అమ్మకు ప్రీతిపాత్రమైన వారం. ఈవిధంగా చూస్తే లక్ష్మీశ్రీనివాసుల వైభవం అనంతంగా ప్రకాశించే పూర్ణిమకు ముందు వచ్చే శుక్రవారం రోజున వరలక్ష్మీవ్రతం చెయ్యటం లక్ష్మీశ్రీనివాసుల అనుగ్రహానికి తొలిసోపానంగా చెప్పుకోవచ్చు. సకలసౌభాగ్యాలు కలగాలని, నిత్యసుమంగళిగా తాము జీవితకాలం ఉండాలని కోరుకుంటూ మహిళలు ఈ వ్రతాన్ని ఆచరిస్తారు. దేశ, కాల, ప్రాంత, ఆచారాలు వేరుగా ఉన్నప్పటికీ అందరి అంతరంగంలో కొలువై ఉన్న మాత ఒక్కరే. ఆమె అందరినీ అనుగ్రహించే తీరు ఒక్కటే.

వరలక్ష్మీవ్రతంలో భాగంగా కలశాన్ని స్థాపించి పూజించటం జరుగుతుంది. కలశం అమ్మవారికి ప్రతిరూపం. చేసుకునే యజమానిశక్తిని బట్టి కలశపాత్రగా మట్టిపాత్రనుగాని, వెండి, బంగారు, రాగి, పంచలోహపాత్రలను గాని వినియోగిస్తారు. లోహమైనా, మట్టి అయినా అది పృథ్వీతత్త్వానికి సంకేతం. అందులో పోసే నీరు జలతత్త్వానికి సంకేతం. అందులో కలశాన్ని పూర్తిగా నీరుతో నింపం కనుక శూన్యస్థితి ఆకాశతత్త్వానికి సంకేతం. మనం చదివే మంత్రం వాయుజనితం. కనుక అది వాయుతత్త్వానికి సంకేతం. కలశం ముందు ఉంచే దీపం అగ్నితత్త్వానికి సంకేతం. ఇలా పంచభూతాలను ఒకచోటికి చేర్చి

పూజిస్తాం. ఈవిధంగా పంచభూతాలకు ప్రతీకగా ఆయా వస్తువులను ఉంచి పంచభూతాల్లోనూ వ్యాపించి ఉండే పర తత్త్వం, శక్తిస్వరూపమైన అమ్మను ఆరాధించటం కలశారాధన లోని అంతరార్థం.

## వ్రతాచరణకు నియమాలు


కలశం కోసం తెచ్చుకున్న పాత్రను శుభ్రంగా కడిగి, పసుపు, కుంకుమలతో అలంకరించాలి. వ్రతానికి ఎంపిక చేసుకున్న స్థలాన్ని శుభ్రం చేసుకుని, పీటవేసి, దానిమీద నూతన వస్త్రం వేసి, దానిపై బియ్యంపోసి వేదికను సిద్ధం చేయాలి. వేదికను పూలు, చందనం, పరిమళద్రవ్యాలు చల్లి శోభాయ మానంగా చేసుకోవాలి. ఆ తర్వాత కలశాన్ని దానిపై అమర్చాలి. దానికి తాంబూలం సమర్పించి ఆరాధించాలి. కలశంలో నీరు పోసి మామిడాకులు లేదా తమలపాకులు కాని అందులో వేయాలి. ఆకులు ఏవైనా అవి నిటారుగా నిలిచేటట్టు చూచు కోవాలి. దాని మీద కొబ్బరికాయ నుంచి దానికి రవికెగుడ్డను వస్త్రంగా చుట్టాలి. కొబ్బరికి ముఖస్వరూపం వచ్చేలా కళ్లు, ముక్కు, పెదవులు, కనుబొమలు అమరేలా దిద్దవచ్చు లేదా అమ్మవారి రూపును దానికి తగిలించి ఆకారం ఏర్పరచవచ్చు. దానికి తమకు తోచిన నగలు వగైరాలు అలంకరించవచ్చు.

వ్రతతోరాన్ని ఐదుపోరలుగా తీసుకుని దానికి పసుపు రాయాలి. దానికి మధ్యలో మామిడాకునుకాని, తమల పాకును కాని పెట్టి ముడివేయాలి. దీన్ని అమ్మవారి సమక్షంలో ఉంచి పూజించాక చేతికి మణికట్టు దగ్గర ధరించాలి. దీన్ని మొదటి శుక్రవారం కట్టుకుంటే నెలంతా ఉంచుకుని అమ్మవారి పూజ నెలరోజులూ జరుపుకోవాలి లేదా వరలక్ష్మీవ్రతంనాడు కట్టుకుని కలశానికి ఉద్వాసన పలికిన తర్వాత తీసేయొచ్చు. ఇంటి ఆచారాలను బట్టి పూజావిధానంలో మార్పులు ఉండొచ్చు.

అమ్మవారికి పూజలో ప్రసాదంగా చక్కరపొంగలి కానీ పాయసం కాని నివేదన చెయ్యాలి. పాయసం దేనితో తయారు చేసినా దోషం కాదు. పూజలో వినియోగించిన బియ్యాన్ని మర్నాడు అన్నం వండి దేవతామందిరంలో ఇలువేలుపుకు ప్రసాదంగా సమర్పించి స్వీకరించాలి. కలశంలో ఉంచిన కొబ్బరికాయను మరుసటిరోజున మనం రోజూ పూజించే దేవుడికి నివేదన చేసి కొట్టి ప్రసాదంగా చేసుకుని అందరూ తీసుకోవాలి. కలశంలో ఉన్న జలాన్ని కుటుంబసభ్యులందరూ తీర్థంగా తీసుకోవాలి. శిరస్సు మీద చల్లుకోవచ్చు. ఏదైనా అవాంతరం వల్ల శ్రావణ శుక్రవారం రోజున వ్రతం చేసు కోవటం సాధ్యపడకపోతే తర్వాతి వారం చేసుకోవచ్చు. ఇందులో ఎలాంటి సందేహం అవసరం లేదు.

## వరలక్ష్మీ సందేశం

సంప్రదాయకంగా తరతరాల నుంచి వస్తున్న ఈ వ్రతం పైకి మామూలు పురాణకథలానే కనిపించినా ఇందులో ఒక సామాజికచైతన్యసూత్రం ఇమిడి ఉంది. చారుమతికి శ్రీవరలక్ష్మీ దేవి కలలో కనిపించి తనను పూజించమని, సకలఐశ్వర్యా లనూ ఇస్తానని చెప్పింది. చారుమతి ఆ వ్రతాన్ని స్వార్థబుద్ధితో తానొక్కతే చెయ్యలేదు. తనతోపాటు తనవారు, తన చుట్టుపక్కల ఉన్న కుటుంబాల స్త్రీలంతా వరలక్ష్మీదేవి కటాక్షానికి పాత్రులు కావాలని అందరినీ కలుపుకుని వ్రతం చేసింది. స్త్రీలు ఇలా అందరినీ కలుపుకొని సామరస్యధోరణిలో, నిస్వార్థబుద్ధితో మెలగాలనే ఓ సామాజికసందేశం ఈ వ్రత కథ వెనుక ఉంది.



ధారావాహిక



# మేల్నాడు- రామానుజుల అడుగుజాడలు

ఆంగ్ల మూలం- శ్రీ లక్ష్మీనరసింహన్ శ్రీధర్

తెలుగు- శ్రీదేవీ మురళీధర్

*గత సంచిక తరువాయి భాగం....*

మఠంలోని గోవుల సంరక్షణ, పాలు పితకటం, పాలు కాచి ఆచార్యులు త్రాగటానికి అనుకూలంగా సిద్ధం చెయ్యటం, ఆచార్యుల ఊర్ధ్వపుండ్రధారణ కోసం తిరుమణి, తిరుచూర్ణాలు కలిపి అందివ్వటం, వారు ధరించగా మిగిలిన చూర్ణాన్ని తాను ధరించటం... తదితరపనులన్నీ వడుగనంబి అత్యంత భక్తి శ్రద్ధలతో, ఒక తపస్సులాగా నిర్వర్తించేవాడు.

సర్వసాక్షి శ్రీమన్నారాయణుడు వడుగనంబి ఆచార్యులకు చేసే సేవలను చూచి ప్రసన్నుడైనాడు. ఒకసారి రామానుజాచార్యులు తిరుక్కురుంగుడి దివ్యదేశం వెళ్లాల్సి వచ్చింది. అదే సమయంలో వడుగనంబి వేరే ప్రదేశానికి వెళ్లియున్నాడు. రామానుజులు తామ్రపర్ణీనదికి తమ నిత్యానుష్ఠానం కోసం వెళ్లి, స్నానానంతరం 'వడుగా, తిరుచూర్ణం సిద్ధం చెయ్యి నాయనా' అని అలవాటు ప్రకారం కేక వేశారు. పరమపురుషుని లీల ఇక్కడ ప్రారంభమైంది.

తిరుక్కురుంగుడి అధిష్ఠానదైవం భగవాన్ సుందర పరిపూర్ణుడు వడుగనంబిశరీరాన్ని ధరించి అతడు అవలంబించిన ఆచార్యనిష్ఠ అనుభవించదలచాడు. తక్షణమే అతిలోక సుందరమూర్తియైన సుందరపరిపూర్ణభగవానుడు వడుగనంబి రూపంలో ఆచార్యునికి ఊర్ధ్వపుండ్రధారణ నిమిత్తం తిరుమణి, తిరుచూర్ణాన్ని అందించాడు.

శాస్త్రానుసారం తిరుమణి తిరుచూర్ణాలను ధరించిన రామానుజాచార్యులు తాము ధరించగా మిగిలిన చూర్ణం శిష్యుడు ధరించే అలవాటు ఉంది కాబట్టి అతడి చేతికి ఇద్దామని వెనుదిరిగి చూచేటప్పటికి అక్కడ ఎవ్వరూ లేరు. నదీతీరం నిర్మానుష్యంగా ఉంది. అప్పుడు ఆచార్యులకు వడుగనంబి తిరువనంతపురంలో అనంతపద్మనాభస్వామిని సేవించటానికి వెళ్లియున్నాడనే స్పృహ కలిగింది. మరి వచ్చిందెవరు? తిరుచూర్ణమిచ్చిందెవరు?

సుందరపరిపూర్ణుడే అపారదయతో తన శిష్యుడి రూపంలో వేంచేసి అనుగ్రహించాడని అర్థమై ఆనందాశ్రువులు ధార కడుతుంటే పరుగుపరుగున సన్నిధికి చేరుకుని స్వామి తిరుచరణాలపై వాలిపోయారు రామానుజులు. 'ఆచార్యసేవ' కోసం శిష్యుని రూపంలో అవతరించిన భగవానుడు సుందర పరిపూర్ణుడు. ఈ అద్భుత ఉదంతం తరువాత 'వైష్ణవనంబి'గా ప్రఖ్యాతుడైనాడు.

## వడుగనంబి ఔన్నత్యం

మేల్నాడుయాత్ర పూర్తి చేసుకుని యతిరాజు రామానుజులు శ్రీరంగం తిరిగివచ్చి 'నమ్‌పెరుమాళ్' (మన భగవానుడు- శ్రీరంగనాథుడు) సన్నిధి చేరి స్వామిని దర్శించి సేవించుకున్నారు. ఒకనాడు యథాప్రకారం వడుగనంబి ఆచార్యులు తాగటానికి ఆవుపాలు కాచి సిద్ధం చేసే ప్రయత్నంలో ఉన్నాడు. సరిగ్గా అప్పుడే శ్రీరంగపుర సార్వభౌముడు భగవాన్ రంగనాథుల ఊరేగింపు ఉత్సవం ఆలయం వెలుపల నాలుగు వీధుల కూడలి వద్దకు వచ్చి నిలిచింది.

భక్తజనులంతా ఆలయం దాటి తమ వీధులలోకి వేంచేసిన భగవానుని హారతులతో, నైవేద్యాలతో, సాష్టాంగ నమస్కారాలతో సేవిస్తున్నారు. *(ఇంకా ఉంది)*

ఈ నెల 4వ తేదీన
శ్రీచక్రత్తాళ్వార్
వర్షతిరునక్షత్రం
సందర్భంగా...

# స్వామిచేతిలో ఎప్పుడూ ఉండాల్సిందే!

– డా॥ ఆకెళ్ల విభీషణశర్మ

శ్రీమహావిష్ణువు పంచాయుధాలలో 'సుదర్శనం' ఒకటి. ఇది చక్రాకారం. విష్ణువు ఆయుధాలలో మహిమాన్వితమైంది, రాక్షస సంహార నిర్మూలకమైంది, వైష్ణవాలయాలలో విశేష పూజలందు కొంటున్నదీ చక్రాయుధమే! వైష్ణవసంప్రదాయాలలో సుదర్శనా యుధాన్ని 'చక్రత్తాళ్వార్' అంటారు.

తిరుమలచరిత్రలో సుదర్శనచక్రానికి ఎనలేని ప్రాముఖ్యముంది. వేంకటాచలమాహాత్మ్యంలో తిరుమలకు విచ్చేసే భక్తులకు కంటకులుగా మారిన దుర్మార్గుల్ని, చోరుల్ని వధించిన మూర్తి సుదర్శనమూర్తి. ఈ అంశం తరిగొండ వెంగమాంబ శ్రీవేంకటాచలమాహాత్మ్యంలో విపులంగా వర్ణితం.

సంస్కృతంలో చక్రాయుధస్తోత్రాలు అనంతం. వీటిలో వేదాంతదేశికుల సుదర్శనాష్టకం ప్రసిద్ధం. పాంచరాత్ర ఆగమం కూడా సుదర్శనచక్రాన్ని వేనోళ్ల ప్రస్తుతించింది. శ్రీ వైష్ణవా లయాలలో సుదర్శనసన్నిధులు కన్పిస్తాయి.

తిరుపతి నగరంలో తి.తి.దే. పరిపాలన భవనాన్ని అనుకొని వున్న వరదరాజస్వామి ఆలయంలో 'చక్రత్తాళ్వార్ సన్నిధి' ఉంది. అలాగే గోవిందరాజస్వామి ఆలయంలో పెరియగోపురం సమీపంలోని ఒక మంటపం రెండో అంతస్థులో చక్రత్తాళ్వారు మూర్తి దర్శనీయం. తిరుపతి కపిలేశ్వరస్వామి తీర్థంలో నాలుగువైపుల సుదర్శన చక్రాంకితాలైన శిలలున్నాయి. తిరుమల బ్రహ్మోత్సవాలలో చక్రత్తాళ్వార్‌ది ప్రధానపాత్ర. చక్రత్తాళ్వార్ తిరునక్షత్రం సందర్భంలో జరిగే కైంకర్యాలను తాళ్లపాకవారు ఎన్నో కట్టడి చేశారు.

తెలుగుకవులలో నాచనసోమన, పోతన, రాయలు తమ తమ కావ్యాలలో చక్రత్తాళ్వార్‌ను కీర్తించారు. సుదర్శన చక్రత్తాళ్వారును సంకీర్తనల రూపంలో నుతించినవారు తాళ్ల పాకకవులు. వీరశైవసాహిత్యంలో బహుళ ప్రసిద్ధమైన రగడలలో బసవ రగడాదులు ప్రసిద్ధమైనట్లే తాళ్లపాక పెదతిరుమలా చార్యుల 'సుదర్శనరగడ' ప్రసిద్ధమైంది.

కాంచీపురం దగ్గర తిరుప్పుక్కుళివాసులను విషజ్వరం నుండి రక్షించడం కోసం దేశికులవారు సుదర్శనాష్టకం కూర్చినట్టు ఐతిహ్యం. ఈ అష్టకాన్ని పఠించినవారి కష్టాలు ఎటువంటివైనా వాటిని తొలగించే భారాన్ని ఆ సుదర్శనుడే వహిస్తాడని భక్తుల విశ్వాసం.

భక్తజనసంరక్షణార్థం శ్రీమహావిష్ణువు ఎక్కువగా చక్రా యుధాన్నే ప్రయోగించాడు. గజేంద్రుణ్ణి మొసలి బారి నుండి రక్షించింది, అంబరీషుని రక్షించింది, అర్జునుని ప్రతిజ్ఞ నెరవేరడానికి సైంధవవధ సమయంలో అండగా నిలిచింది, నరకాసురవధ జరగడానికి తోడ్పడింది ఈ చక్రమే.

సుదర్శనమంత్రోపాసకులు మహావిష్ణువు ప్రతి అవతారంలోను సుదర్శనుని వంతు ఉందంటారు. వరాహావ తారంలో కోరల్లో, నరసింహావతారంలో గోళ్లల్లో, పరశు రామావతారంలో గొడ్డలిలో, శ్రీరామావతారంలో కోదండంలో, వామనావతారంలో శుక్రుని అంధుణ్ణి చేసిన దర్భల్లో సుదర్శన స్వామి తన బాధ్యత నిర్వహించాడని వారి భావన.

ఆళ్వారుల పాశురాలలో చాల చోట్ల సుదర్శన ప్రస్తావన ఉన్నాయి. మరొకవిశేషం ఆళ్వారులలో తిరుమళిశైఆళ్వార్ సుదర్శనచక్ర అంశజులని ప్రతీతి.

తిరుమలలో మూలవరులకున్న శంఖచక్రాలు చెవికి దగ్గరలో ఉన్నట్లు కనిపిస్తాయి. స్వామిని దర్శించడానికి విచ్చేసే భక్తాదులను పరిచయం చేసే లాగా ఉన్నాయని చమత్కారం. తిరుమలలో సంవత్సరంలో నాలుగుసార్లు సుదర్శన ఆళ్వారుకు విశేష తిరుమంజనాదులు జరుగుతాయి. తిరుమలలో చక్ర స్నానం రోజున పెరుమాళ్ తిరుమొళి, చూర్ణాభిషేక సందర్భంలో తిరుచ్చందవిరుత్తం, తిరుప్పళ్లి ఎళుచ్చి, అమలనాదిపిరాన్, కణ్ణినున్ శిరుత్తాంబు పఠిస్తారు.

# అన్ని సమస్యలకు ఔషధం...

– డా॥ ఈ.ఏ.సింగరాచార్యులు, 98850 03420

శ్రీసుదర్శనయంత్రం శ్రీసుదర్శన భగవానుని మహిమను అంతటిని నిక్షిప్తం చేసుకొన్న యంత్రం. ఇది చాలా మహిమ కలిగిన అతిపవిత్రమైన యంత్రం. దుష్టశక్తులను ఇది మనకు చాలా దూరంలో ఉంచుతుంది. చక్రాయుధానికి కల మహిమలన్నీ కూడా శ్రీసుదర్శనయంత్రంలో నిక్షిప్తమై ఉన్నవి. దీని ఆరాధన వల్ల జీవితం ఏ విధమైన ఒడిదుడుకులు లేకుండా ఉంటుంది. సుదర్శన భగవానుని అనుగ్రహం ఈ యంత్రారాధన వల్ల లభిస్తుంది కనుక, జీవితం సజావుగా సాగిపోతుంది. మానసికమైన, శారీరకమైన రుగ్మతలు తొలగడానికి ఈ యంత్రారాధన ఎంతో ఉపకరిస్తుంది.

శ్రీసుదర్శనచక్రం సూర్యభగవానుని తేజస్సుకు సారాంశ రూపమైంది. కోటిసూర్యుల ప్రతాపాన్ని కలిగింది. శ్రీసుదర్శన యంత్రం సుదర్శనుని మహిమను తనలో ఇముడ్చుకున్నది అయి నందువల్ల, ఆగమోక్తం ప్రకారం ప్రతిష్ఠితమైన శ్రీసుదర్శనయంత్రం కూడా అంతటి తేజస్సును, ప్రతాపాన్ని వెదజల్లే శక్తిని కలిగింది.


### ఈ సుదర్శన యంత్రారాధన వల్ల ప్రయోజనాలు

- ఈ యంత్రాన్ని ఆరాధించడం వల్ల దుష్టశక్తులు దూరంగా తొలగిపోతాయి.
- జీవితంలో ఎదురయ్యే సమస్యలను ధైర్యంగా ఎదుర్కొని, పోరాడి విజయాన్ని సాధించే మానసిక మైన శక్తిసామర్థ్యాలు లభిస్తాయి.
- శ్రీమన్నారాయణుని అనుగ్రహం మనకు పరిపూర్ణంగా లభిస్తుంది.
- జీవితంలో ఏర్పడే మానసికమైన ఒత్తిడినుండి బయటపడే శక్తి ఏర్పడుతుంది.
- శ్రీసుదర్శన శతకస్తోత్రపారాయణవల్ల ఏయే ప్రయోజనాలు సమకూరుతాయో, ఆ ప్రయోజనాలన్నీ శ్రీసుదర్శనయంత్రారాధన వల్ల లభిస్తాయి.

### శ్రీ సుదర్శనయంత్రం- ఆరాధన విధానం

- ఈ యంత్రాన్ని తూర్పుముఖంగా కానీ, ఉత్తరముఖంగా కానీ, పవిత్రస్థలంలో పెట్టుకొని ఆరాధించాలి.
- స్నానం చేయకుండా కానీ, వేరే కారణాల చేత శరీరానికి అపవిత్రత కలిగినప్పుడు గానీ ఈ యంత్రాన్ని తాకరాదు, ఎవరినీ తాకనివ్వరాదు.
- పన్నీరు, పాలు, పెరుగు, తేనె మొదలైన పవిత్రపదార్థాలతో ఈ యంత్రాన్ని అభిషేకించాలి. గ్రహణ సమయాలలో, గ్రహణం పూర్తి అయిన తరువాత, ఈ యంత్రాన్ని శుద్ధి చేసి అభిషేకం చేయడం మంచిది.
- ఈ యంత్రాన్ని దైవారాధనపేటికలో భద్రపరచుకోవాలి.
- శ్రీ సుదర్శనగాయత్రీమంత్రాన్ని పెద్దల ద్వారా ఉపదేశం పొంది, శారీరకంగా పవిత్రంగా ఉన్నప్పుడు 108 మార్లు జపించడం మంచి ఫలితాన్ని ఇస్తుంది. శ్రీ సుదర్శనునకు సంబంధించిన స్తోత్రాలను యథాశక్తి పారాయణ చేయడం మంచిది.

ఇంకా మరిన్ని వివరాలు పాంచరాత్రాగమానికి సంబంధించిన అహిర్బుధ్న్యసంహితలో దర్శించవచ్చు.




శ్రీ సుదర్శన యంత్రం




# పొట్టనిండా పాలుపోసేము తండ్రీ!!

- డా॥ డి. ఉదయకుమార్, 70134 66957

భూభారాన్ని నిరంతరం తన అజస్రసహస్రఫణాలపై మోస్తూ, దర్శించడానికి వీలుకాని మహాతేజుడు, హృదయంనిండా శ్రీహరిని నిలుపుకొని, ఆ దేవదేవునికి శయ్యయైన ఆదిశేషుడు సదా ఆరాధ్యుడు. అందుకే శ్రీకృష్ణభగవానుడు "అనంతశ్చాస్మి నాగానామ్ (భగవద్గీత అధ్యాయం 10-శ్లో. 29) నాగజాతి వారిలో ఆదిశేషుణ్ణి (అనంతుడను) నేను" అని బోధించాడు.

పరమశివుడు నాగభూషణుడు. నాగం పవిత్రతకు చిహ్నం. వాయువును మాత్రమే ఆహారంగా భుజించి, బ్రతికే ప్రాణి ఒక్క సర్పమే! శివుని శిరస్సుపై ఒకటి, కంఠమందు రెండు, భుజాలందు రెండు, చేతులకు రెండు, పాదాలకు రెండు, నడుముకు ఒకటి మొత్తం తొమ్మిది స్థానాలలో తొమ్మిది నాగాలు ఉంటాయి. శివలింగాన్ని చుట్టుకొనియున్న 3 1/2 చుట్లనాగం మానవునిలోని కుండలినీశక్తిని సూచిస్తుంది. మన దేహంలో పంచ వాయువులు ఐదునాగాలను సూచిస్తున్నాయి. మిగిలిన నాలుగు వాయువులు ఆధ్యాత్మికోన్నతి పొందిన సాధకులలో ఏర్పడతాయి. నాగం పురుషతత్త్వానికి చిహ్నం. కాబట్టి సంతాన దాయకుడవుతున్నాడు. నాగదోషనివృత్తిచేస్తే సత్సంతానం కలుగుతుంది.

భారతదేశంలో నాగపూజ చేసేవారు అధికం. నాగ ప్రతిమలు చెక్కిన శిలలు ప్రతిచోటా కనబడుతున్నాయి. వీటిని నాగశిలలనీ, నాగకల్లులనీ వ్యవహరిస్తారు. పుట్టినబిడ్డలు మరణిస్తూ ఉంటే, సంతానం నిలవడానికి నాగప్రతిష్ఠచేసి ఆరాధిస్తున్నారు.

నాగుల్ని పూజించి స్త్రీలు పాలుపోస్తారు. నువ్వులతో చేసిన చలిమిండి ముద్దలు నైవేద్యం పెడ్తారు. నాగపూజ చేస్తే స్త్రీల కడుపు పండుతుందని వారి విశ్వాసం. పిండి, నూకలు కూడ సమర్పిస్తుంటారు. నాగన్న వారికి ఇంటినిండ పిల్ల పాపల నీయాలని వాళ్ల కోరిక.

స్వప్నంలో సర్పాన్ని చూచి, ఐశ్వర్యవంతులైనవా రున్నారు. నాగదేవతల అనుగ్రహంతో కలిగిన సంతానానికి నాగన్న, నాగమ్మ, నాగిరెడ్డి, నాగరాజారావు, ఇలా 'నాగ' శబ్దం ముందు చేర్చి నామకరణం చేస్తుంటారు. చెవిలో చీముపట్టినా, వినపడకపోయినా, పాముతోకను చెవిలో పెట్టించుకుని, త్రిప్పించుకొని బాగుచేసుకుంటున్నారు. జంగం వారు సర్పాలను పూజిస్తారు.

చెవిబాధలు, కంటిబాధలు ఉండేవారు నాగపర్వ దినాలలో ఉపవాసం ఉండాలి. పుట్టలో పాలుపోసి పుట్టమట్టిని చెవులకు పూసుకుంటారు. నాగవస్త్రాలు పుట్టమీదపెట్టి, తరువాత తీసుకొని ధరిస్తే అభీష్టసిద్ధి కలుగుతుంది.

సుబ్రహ్మణ్యస్వామిని, కాళికాదేవిని సర్పరూపంలో పూజిస్తారు. కర్ణాటకరాష్ట్రం పావగడ సమీపంలో నాగమడకలో సుబ్రహ్మణ్యస్వామి సర్పరూపంలో దర్శనమిస్తాడు. అనంతపురానికి 20 కి.మీ. దూరంలో అనంతపురం-ఆత్మకూరు రోడ్డులో పంపనూరు గ్రామంలో వెలసిన సుబ్రహ్మణ్యస్వామి సర్ప రూపంలో పూజలందుకొంటున్నాడు. కర్నూలుజిల్లా కొత్తూరులో సుబ్రహ్మణ్యస్వామి సర్పాకారంలో పూజలందుకొని భక్తుల కోరికలు ఈడేర్చుతున్నాడు. ఇవన్నీ మహిమగల పుణ్యక్షేత్రాలు.

ఐదు పడగల నాగేంద్రుడు శివాంశసంభూతుడు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు లక్ష్మీనరసింహస్వామిఅంశం. అట్లే పంద్రెండు శిరస్సుల నాగేంద్రుడు వాసుదేవునికి ప్రీతిపాత్రుడు. మానవుని వెన్నెముక లేదా వెన్నుపాము సర్పాకారంలో ఉంటుంది. యోగశాస్త్రంలో కుండలినీశక్తి సర్పరూపంలో మూడున్నరచుట్లు చుట్టుకొని ఉంటుంది. సాధకులు వీటిని ఉత్థాపన చేస్తారు. దేవతార్చనలో ఉద్ధరిణికూడా సర్పాకారంలో ఉంటుంది.

నాగులచవితి, నాగపంచమి, సుబ్రహ్మణ్యషష్ఠి పర్వ దినాల్లో భారతీయులు భక్తిప్రపత్తులతో, శ్రద్ధాసక్తులతో నాగారాధన చేస్తున్నారు. ఈ విధంగా భారతీయులు అనాది నుండి **'నాగారాధన'** తత్పరులై ప్రశాంత జీవనంచేస్తూ మనోభీష్టాలు పొందుతున్నారు. పుణ్యజీవనులై, ధన్యులై జీవన్ముక్తులౌతున్నారు. పరమార్థదృష్టిగల మానవులు- చేతులు, వెన్నెముక, వీణ, ఏనుగుతొండం, సంగీతవాద్యాలు అన్నింటిలో అనంతుణ్ణి దర్శించి, తరిస్తున్నారు.

ఎవరైతే వారి శక్తికొలది ద్రవ్యలోపం చేయకుండా నాగాధిదేవతలను ఆరాధిస్తారో, వారికోసం నాగాధిపతి ఆది శేషుడు, వాసుకి మొదలైనవారు శ్రీహరిని, పరమశివుని చేతులు జోడించి ప్రార్థిస్తారు. దాంతో ప్రసన్నులైన హరిహరులు ఆ భక్తుల కోరికలను తీర్చుతారు. అలాంటి భక్తులు మరణానంతరం నాగలోకంలో అనేకభోగాలను అనుభవించి, వైకుంఠ, కైలాసాదు లలో విష్ణు/శివగణాలుగా సుఖాన్ని పొందుతారు.

**గ్రంథసమీక్ష**


## కార్వేటినగరం కథలు

**రచయిత-** ఆర్.సి.కృష్ణస్వామిరాజు; **సైజు-**1/8 క్రౌన్ సైజు; **పుటలు-**108; **ధర-**రూ.140/-; **ప్రతులకు-**ఆర్.సి.కృష్ణ స్వామిరాజు; ఇ.నెం.22-4-71, బ్యాంక్ కాలనీ, అక్కారంపల్లి పోస్ట్, తిరుపతి-517 501. సెల్-93936 62821

ఒకప్పుడు పెద్దలు కూడా పిల్లలకథలు చదివేవారు. శారీరకంగా వృద్ధాప్యం వచ్చినా బాలసాహిత్యం చదువు తుంటే మనసుకు వయసు తెలిసేది కాదు. ఈ నేపథ్యంలో ఎన్నో బాలలకథల పుస్తకాలు వచ్చాయి. వాటిలో ఈ మధ్య కాలంలో వెలువడి పాఠకాదరణ పొందింది ఆర్.సి.కృష్ణ స్వామిరాజు రచించిన 'కార్వేటినగరం కథలు'.

ఇందులోని ప్రతికథ ఒక రస గుళిక. అంతేకాదు ఒక నీతిసుధ. 'ఊరు-పేరు' అన్న కథ ప్రతి ఊరికి పేరు ఎలా వస్తుందో తెలుపుతుంది.


'రోగానికి సేవ' అన్న కథ ద్వారా రచయిత రోగాన్ని చూచి భయపడితే అది మరింత భయపెడుతుందని, పట్టించు కోవడం మానేస్తే వచ్చిన దారినే పోతుం దని తెలిపారు. ఇదినిజమే! కరోనా సమయంలో భయంతోనే చాలా మంది చనిపోయారన్న సంగతి విదితమే!




'గగనవిహారం' అనే కథ పిల్లలకు ఒక గొప్ప సందేశాన్నిస్తుంది. అదేమంటే పక్షుల చలాకీదనానికి కారణం ప్రకృతిలో మమేకం అయి గడపడమేనని రచయిత చక్కగా విశదీకరించారు. 'సిసలైన పెళ్లికానుక' కథలో పెళ్లిరోజున అమ్మాయికి అమ్మానాన్నలు ఇవ్వాల్సిన అసలు సిసలు కానుక 'ఏమి'టో హృద్యంగా చెపుతుంది. ఇందులోని ముప్పై కథల్లో చాలావాటిల్లో రాజు లేదా జమీందారు ప్రధాన వ్యక్తి. అలాగే పరిచిత ప్రాణులైన కుందేలు, గాడిద, కుక్క, పాము స్వభావాల జోడింపులున్నాయి. భాష విషయకంగా పరిశీలిస్తే నీతి కథల ప్రధాన లక్ష్యమైన నీతి, ఈ కథలలో చివర చెప్పడం కాకుండా మధ్యలోనే పాలు చక్కెర కలిసినట్లు చెప్పడం విశేషం. ఇక సామెతల సంగతి చెప్పపనిలేదు. రాజు గారి బాలసాహిత్యంలో ఇవి పరిమళంతో వీచే తోటగాలులు. తీరంలో నిలబడిన వాళ్లను పరవశింపచేసే నదీ తరంగాలు. తన రచనాపాటవంతో పిల్లల్ని, పెద్దల్ని ఆకర్షించే విధంగా రచన సాగిస్తున్న రాజుగారు అభినందనీయులు. ప్రతి ఒక్కరూ చదవదగిన కథల సంపుటం ఇది.

*- డా॥ గంగిశెట్టి శివకుమార్.*

ఈ నెల 9వ తేదీన గరుడపంచమి సందర్భంగా...




# అంతులేని బలం ఆయనకే సొంతం

- డా॥ కప్పగంతు రామకృష్ణ,
88975 47548

శ్రావణశుద్ధపంచమి గరుత్మంతుడు పుట్టినరోజు. ఇందుకు ప్రతీకగా ఆ రోజున గరుడపంచమి జరుపుకోవటం ఆనవాయితీ. గరుత్మంతుడిని అర్చించిన వారికి సర్పబాధలనుంచి విముక్తి కలుగుతుందని శాస్త్రాలు చెబుతున్నాయి.

గరుత్మంతుడి పేరుతో అధర్వణవేదంలో ప్రత్యేకంగా ఉపనిషత్తు కూడా ఉంది. దీన్ని గారుడోపనిషత్తు అంటారు. గరుత్మంతుడిని ధ్యానించటం, అర్చించటం వల్ల కలిగే ఫలితాలు ఈ ఉపనిషత్తులో ఉన్నాయి.

గరుత్మంతుడి పరాక్రమానికి, శక్తికి ప్రతీకగా నిలిచే ఘట్టం రామాయణంలో ఉంది. ఇంద్రజిత్తు చేసిన మాయా యుద్ధప్రభావం, నాగాస్త్ర ప్రయోగంవల్ల రామలక్ష్మణులిద్దరూ మూర్ఛపోతారు. వారి దేహమంతా బాణాల దెబ్బలతో నిండిపోయింది. అమోఘమైన నాగపాశాల నుంచి వారిని విడిపించటం ఎవరివల్లా కాలేదు. తన నాగాస్త్రబంధం నుంచి ఎవ్వరూ తప్పించుకోలేరనే గర్వంతో ఇంద్రజిత్తు లంకకు వెళ్తాడు. రామలక్ష్మణులు ఎప్పటికీ మూర్ఛనుంచి తేరుకోకపోవటంతో విభీషణుడితో సహా వానరసేన ఆవేదన చెందుతుంది. ఇంతలో గరుత్మంతుడు మహాప్రభంజనంగా దేవలోకం నుంచి వస్తాడు. అతడు వస్తున్నప్పుడు వీచిన గాలికి సముద్రం అల్లకల్లోలమౌతుంది. అతడు రామలక్ష్మణులను సమీపించటంతోనే వారిని బంధించిన నాగపాశాలన్నీ విడిపోతాయి.


గరుత్మంతుడు వారికి నమస్కరించి తన రెండు చేతులతో వారి సర్వావయవాలను నిమురుతాడు. క్షణకాలంలో గాయాలు మాని, వారిద్దరికీ దివ్యతేజస్సు కలగటంతో పాటు ఇంతకుముందు కంటే ఎక్కువ బలం కలిగింది. గరుత్మంతుడు చేసిన మేలుకు అందరూ అతడిని ప్రశంసిస్తారు. గరుత్మంతుడు గనుక ఆదుకోకపోతే రామాయణకథ ఏ మలుపు తిరిగేదో.

ప్రతి వ్యక్తి రాత్రి నిద్రపోయేముందు రాముడు, సుబ్రహ్మణ్యస్వామి హనుమంతుడు, గరుత్మంతుడు, భీముడు – వీరిని తలుచుకుంటే దుస్స్వప్నాలు కలగవని పెద్దలు చెబుతారు.

తిరుమల కొండపై శ్రీవారికి జరిగే బ్రహ్మోత్సవాల్లో అగ్రతాంబూలం గరుత్మంతుడిదే. శ్రీవారి ఉత్సవాల ప్రారంభ సూచకంగా గరుత్మంతుడి చిత్రం ఉన్న పతాకాన్ని అర్చకస్వాములు ఎగురవేస్తారు. దీన్నే ధ్వజారోహణం అంటారు. ముక్కోటిదేవతల్ని ఉత్సవాలకు రావల్సిందిగా గరుత్మంతుడు ఆహ్వానిస్తాడు. ఉత్సవాల్లో గరుడపతాకావిష్కరణకు ఎంతో ప్రాధాన్యత ఉంది. అలాగే, బ్రహ్మోత్సవ వాహనసేవల్లో గరుడవాహనసేవ ఎంతో ప్రత్యేకమైంది. ఈ ఉత్సవాన్ని చూడటానికి లక్షలాదిమంది భక్తులు కొండకు చేరుకుంటారు. దాసుడిగా, మిత్రుడిగా, విసనకర్రగా, ఆసనంగా, ఆవాసంగా, ధ్వజంగా ఇలా తన జీవితసర్వస్వాన్నీ శ్రీహరిసేవకు అంకితం చేసిన దాసోత్తముడు గరుత్మంతుడు. వైష్ణవసంప్రదాయంలో గరుత్మంతుని గరుడాళ్వార్ అనే పేరుతో దైవంగా కొలుస్తారు.

పక్షిజాతిలో మరెవ్వరికీ దక్కనిది గరుత్మంతుడికి మాత్రమే దక్కిన ఘనత అతని పేరుతోనే ఒక పురాణం ఏర్పడటం. వ్యాసమహర్షి రాసిన 18 పురాణాల్లో గరుడపురాణం ఒకటి. శ్రీమహావిష్ణువు స్వయంగా గరుత్మంతుడికి ఉపదేశించిన ధర్మ రహస్యాలన్నీ ఇందులో ఉంటాయి. ఇలా ఒక సేవకుడు, పక్షి జాతికి చెందిన వ్యక్తి పేరుతో ఉన్న ఒకే ఒక పురాణం ఇది.

పక్షులలో గరుత్మంతుడు నేనే అంటూ జగద్గురువు శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో స్వయంగా చెప్పాడు. ఇంతకుమించి గరుత్మంతుడి ఘనత చెప్పటానికి మరొక ఉదాహరణ అవసరం లేదు.



తమిళనాడులోని కుంభకోణం పట్టణానికి సమీపంలో ఉన్న నాచ్చియార్ కోవెల క్షేత్రంలో ఉత్సవమూర్తిగా ఉన్న గరుత్మంతుని విగ్రహానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ క్షేత్రంలో వెలసిన విష్ణుమూర్తికి ఏటా రెండుసార్లు ఊరేగింపు ఉత్సవాలు జరుగుతాయి. ఇందులో భాగంగా అమ్మవారు హంసవాహనం మీద ముందుగా వెళ్తుంటే స్వామివారు గరుడవాహనం మీద అమ్మవారి వెనుక ప్రయాణం ప్రారంభిస్తారు. ఇక్కడ అత్యంత ఆశ్చర్యకరమైన సంఘటన జరుగుతుంది.

లోపలి ప్రాకారంలో గరుడవాహనం మీద విష్ణుమూర్తి విగ్రహాన్ని పెట్టి, పల్లకీని ఎత్తినప్పుడు కేవలం నలుగురు వ్యక్తుల సహాయంతో పల్లకీ కదులుతుంది. అక్కడి నుంచి ఒక్కో ప్రాకారం దాటేటప్పుడు క్రమంగా గరుత్మంతుడి విగ్రహం బరువు పెరుగుతుంది. రెండో ప్రాకారంలో 8మంది మోయాల్సి వస్తుంది. మూడో ప్రాకారంలో 16మంది, నాలుగో ప్రాకారంలో 32మంది, ఐదవ ప్రాకారంలో 64మంది మోస్తేకానీ విగ్రహం కదలనంత బరువుకు చేరుతుంది. అన్ని ప్రాకారాలు దాటి వీథుల్లోకి వచ్చేసరికి 128మంది మొయ్యాల్సివస్తుంది. స్వామివారి వాహనం ఎలా 128మంది మోస్తే కానీ కదలని పరిస్థితి ఉంటే, దానికి ముందు అమ్మవారి హంసవాహనం కేవలం 16మంది బోయీలు మోస్తుండగా వీథుల్లో విహారం చేస్తుంది.

ఊరేగింపు జరుగుతున్న సమయంలో గరుత్మంతుని విగ్రహం మీద చెమటలు పట్టటం మరొక విచిత్రం. మొదట్లో తక్కువ బరువు ఉండి క్రమంగా బరువు పెరిగేసరికి ఇలా చెమటలు పడతాయని భక్తుల విశ్వాసం. ప్రపంచంలో అత్యంత వేగంగా వెళ్లే గరుత్మంతుడి మీద తాను ఊరేగితే, హంసవాహనం మీద వచ్చే అమ్మవారు వెనుకబడింది కాబట్టి నీ కన్నా నెమ్మదిగా వెళ్తానని అమ్మవారికి స్వామివారు మాట ఇచ్చారట. అందుకే ఇలా జరుగుతోందని భక్తుల నమ్మకం.

కర్ణాటక రాష్ట్రంలోని కోలార్‌జిల్లా, కోలదేవి గ్రామంలో ఉన్న గరుత్మంతుడి ఆలయం కూడా ఎంతో ప్రసిద్ధి చెందింది. మహాభారతకాలంలో అర్జునుడు ఇక్కడ గరుత్మంతుడి విగ్రహాన్ని ప్రతిష్ఠించాడని చరిత్ర. ఖాండవవనాన్ని దహనసమయంలో ఆ వనంలో ఉన్న సర్పాలన్నీ మరణిస్తాయి. సర్పాల్ని చంపిన పాపంనుంచి విముక్తుడు కావటానికి అర్జునుడు కోలదేవి గ్రామంలో గరుడవిగ్రహాన్ని ప్రతిష్ఠించి, పూజలు చేశాడని ప్రతీతి.

## ధర్మనిలయం... గరుడ పురాణం

గరుడపురాణం అష్టాదశ పురాణాలలో ఒకటి. ఈ పురాణం శ్రీమహావిష్ణువు చేత అతని వాహనమైన గరుత్మంతుడికి ఉపదేశించబడింది. అందుకే ఈ పురాణానికి “గరుడపురాణం” అని పేరు వచ్చింది. మానవుడు చేసే వివిధ పాపాలు, వాటికి నరకలోకంలో విధించే శిక్షలు, పాపాలకు ప్రాయశ్చిత్తం, పుణ్యం సంపాదించుకునేందుకు వివిధమార్గాలు, పితృకార్యాల వర్ణన ఈ పురాణంలో ఉంటుంది. ఇహలోకంలో ధర్మబద్ధమైన జీవితాన్ని గడపాల్సిన అవసరాన్ని, ధర్మబద్ధమైన జీవనఫలితాన్ని గరుడపురాణం ఎంతగానో ప్రకటిస్తుంది.

## శ్రీవేంకటేశ్వరలీలలు



# ఆయన అన్నీ గమనిస్తుంటాడు

- శ్రీ గౌరవ ధనుంజయ (USA)

2017వ సంవత్సరం ఫిబ్రవరి 2వ తారీకున నేను నా కుటుంబంతో కలసి అమెరికా నుండి భారతదేశానికి వచ్చాము. ఇందుకు రెండు ముఖ్య కారణాలున్నాయి. (1)మా బాబు కౌశిక్‌కు విజయవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో పుట్టెంట్రుకలు తీయించడంకోసం (2) నేను యు.ఎస్.లో ఉద్యోగంలో చేరితే ఇండియా వచ్చినప్పుడు శ్రీవేంకటేశ్వరస్వామి వారికి తలనీలాలు సమర్పించుకుని హుండీలో లక్షరూపాయల నగదు సమర్పించుకుంటానని మొక్కుకున్న మొక్కుబడి చెల్లించుకోవడం కోసం. బాబుకు పుట్టెంట్రుకలు తీయించేవరకు వేరొక దైవసన్నిధికి తీసుకెళ్లకూడదనే నియమం ఉన్నందున నేను ఒక్కడినే తిరుమలకు బయలుదేరాను. అప్పట్లో మా మామగారు ఆంధ్రప్రదేశ్ డి.జి.పి.ఆఫీసులో సి.ఎ.ఓ.గా పని చేస్తున్నారు. నేను తిరుమల వెళ్లితే ప్రత్యేకదర్శనం, కొండమీద ఓ మంచి గది ఏర్పాటు చేయమని అక్కడ ఓ అధికారికి చెప్పి ఉంచారు.

నేను తిరుపతి వెళ్లేముందు నాకు తోడుగా ఉంటాడని మా మేనమామ కుమారుడు దినేష్‌ను తిరుపతికి పిలిపించుకున్నాను. ఇద్దరం కాలినడకన తిరుమల వెళ్లటానికి అలిపిరి చేరుకున్నాం. అలిపిరిలో అడుగు పెట్టగానే నాకు మరో ఆలోచన తట్టింది. మొక్కుబడితోపాటు స్వామివారికి నిలువు దోపిడి ఇస్తే బాగుంటుందని, వెంటనే నా జేబులో ఉన్న నగదు ఎనిమిదివేల రూపాయలు తీసి దినేష్‌కు ఇచ్చి జేబులో కొంత చిల్లర డబ్బులు ఉంచుకున్నాను. ఇక ఇద్దరం మాట్లాడుతూ కాలి నడకన సాయంకాలం ఆరున్నరగంటలకు తిరుమల చేరుకున్నాం.

మా మామగారు ఇచ్చిన ఫోన్ నెంబరుకు ఫోన్ చేస్తే, ఓ కానిస్టేబుల్ వచ్చి మమ్మల్ని ఓ గదికి తీసుకెళ్లాడు. ఆ గది చాలా పాతగది, చూస్తుంటే బస చేయటానికి అనుకూలంగా ఉన్నట్టు అనిపించలేదు. నేను మంచిగది తీసివ్వమని ఆ కానిస్టేబుల్ని కోరాను.

ఆ రోజు కొండపైన రద్దీ ఎక్కువగా ఉంది. గదులు దొరకటం చాలా కష్టంగా ఉంది. "ప్రస్తుతం ఇక్కడ ఉండండి వీలైతే మంచి గది చూచుకొని వస్తాను" అంటూ అతను వెళ్లిపోయాడు.

"దేవుడా! ఏమిటిది అంత దూరంనుండి మొక్కుబడి చెల్లించుకోవటానికని వస్తే కనీసం ఓ మంచి గది దొరకలేదు. నా భక్తిలో ఏదైనా లోపం ఉందా" అని మనసులో అనుకుంటూ గదిలో కూర్చున్నాం. ఆ కానిస్టేబులు ఎంతసేపటికీ రాలేదు. కాలినడకన వచ్చినందువల్ల దినేష్, నేను బాగా అలసిపోయి ఉన్నాం. గది తలుపులు మూసి గొళ్లెం పెట్టాం. బయటి నుండి తోస్తే చాలు తలుపులు తెరుచుకునేలా ఉంది పరిస్థితి. తల దగ్గర బ్యాగు ఉంచుకున్నాను. అందులో హుండీలో వేయడానికి లక్షరూపాయలు నగదు, ఐఫోన్, గుడ్డలు, డెబిట్, క్రెడిట్ ఐడెంటిటీ లాంటి కార్డులన్నీ కలిగి ఉన్న పర్సు ఉన్నాయి. వెంటనే నిద్రలోకి జారుకున్నాము.

తెల్లవారుజామున టైం చూద్దామని మొబైల్‌కోసం చేత్తో అటు ఇటు తాకితే చేతికి ఏమి తగలకపోయేసరికి లేచి కూర్చొన్నాను. చూస్తే గది తలుపులు తెరిచి ఉన్నాయి. గదిలో దొంగలు పడినట్లున్నారు. రెండు మొబైల్ ఫోన్స్, బ్యాగు కనిపించలేదు. నేనూ, దినేష్ ఇద్దరం బయటకు వచ్చి, దగ్గర్లో ఉన్న టెలిఫోన్‌బూతుకు వెళ్లి మా మామగారికి ఫోన్ చేసి జరిగినదంతా చెప్పాను.



ఆయన చాలా బాధపడి, పోలీసులకు ఫోన్‌చేసి చెబుతానన్నారు. ఎందుకో అలా వెళ్లి వెదికితే బాగుంటుందని పించింది. ఇద్దరం గది వెనుకకు వెళ్లి చూశాం. చీకట్లోనే దగ్గర్లో ఓ చెట్టు మొదలుభాగంలో నా బ్యాగు కనిపించింది. గబగబా వెళ్లి తీసుకొని గదిలోకొచ్చి చూచాను. ఒకటే ఆశ్చర్యం! ఒకటే ఆనందం! బ్యాగులో ఉంచిన లక్షరూపాయల నగదు, ఐ ఫోన్, గుడ్డలు, నా పర్సు అన్నీ పెట్టినవి పెట్టినట్లే పదిలంగా ఉన్నాయి. రెండు మొబైల్ ఫోన్స్ మాత్రం కనిపించలేదు. బ్యాగు ఎత్తుకెళ్లిన దొంగలు కనీసం బ్యాగులో ఏముందో అని కూడా చూచినట్టులేదు. విషయం అర్థం కాలేదు. మా మామయ్యకు ఫోన్ చేసి బ్యాగు దొరికిన సంతోషవార్త చెప్పాను.

అవునా! అని అశ్చర్యపడుతూ "సరే ఇంతకు మీరు తిరుపతి నుండి ఎలా వెళ్లారు? ఏమేమి చేశారు?" అని అడిగారు ఆయన.

అలిపిరి నుండి మేము బయలుదేరింది మొదలు దినేష్ చేతికి ఎనిమిదివేలు డబ్బులు ఇచ్చింది, నా నిలువు దోపిడీ ఆలోచన గురించి వివరించాను.

మా మామయ్య ఫోన్లోనే గట్టిగా నవ్వి "ధనుంజయా! నేను చెబితే ఎందరికో ప్రత్యేకదర్శనం చేయించారు. గదులు ఇప్పించారు. మరి నీ విషయం లోనే ఇలా ఎందుకు జరిగిందో తెలుసా!" అన్నాడు.

ఏమిటో మామయ్య అర్థం కావటంలేదు అన్నాను. ఆయన మళ్లీ నవ్వి "నీవు నిలువుదోపిడి ఇవ్వాలనుకున్నావు. చిల్లరడబ్బులు జేబులో ఉంచుకుని దినేష్‌కు నీ దగ్గరున్న ఎనిమిదివేలు ఇచ్చావు. అదే నీవు చేసిన తప్పు. ఆ దేవదేవుని అద్భుతలీలలు నీకు ఇలా అవగతమయ్యేలా చేశాడు. దినేష్‌కు నీవు ఇచ్చిన ఎనిమిది వేల రూపాయల ఖరీదు చేసే రెండు పాత మొబైల్ ఫోన్స్ మాత్రమే ఎత్తుకుపోయారు. ఇదే ఆ వేంకటాచలపతి మాహాత్మ్యం" అన్నాడు. అది విన్నాక నాకు జ్ఞానోదయమైంది. ఎంత తప్పు చేశానో అర్థమైంది.

"స్వామీ! ఏడుకొండలవాడా! వేంకటరమణా! నన్ను క్షమించు, జీవితంలో ఇలాంటి తప్పు మళ్లీ చేయను" అని చెంపలేసుకున్నాను.

ఆ కానిస్టేబుల్ దగ్గరుండి తలనీలాలు, ప్రత్యేక దర్శనం చేయించాడు. స్వామివారికి లక్షరూపాయల నగదుతో పాటు దినేష్ దగ్గరున్న ఎనిమిదివేలరూపాయలు, నా జేబులో చిల్లర డబ్బులు మొత్తం హుండీలో వేసి మొక్కుబడి చెల్లించి తృప్తిగా వెనుదిరిగాను.



శ్లో॥ సిద్ధిబుద్ధిప్రదే! దేవి!
భుక్తిముక్తిప్రదాయిని!
మంత్రమూర్తే! సదాదేవి!
మహాలక్ష్మి! నమోఽస్తు తే॥

**తాత్పర్యం:** సిద్ధినీ, బుద్ధినీ ప్రసాదించేతల్లీ! భుక్తినీ, ముక్తినీ అనుగ్రహించే దేవీ! మంత్రమూర్తీ! దివ్యకాంతిమయీ! మహాలక్ష్మీ! నీకు నమస్కారం!!

# సృష్టిలో తీయనిది!

-డా॥తాడేపల్లి వీరలక్ష్మి, 94400 64719

శ్రీమద్రామాయణ మహాకావ్యంలో మిత్రధర్మం చాలా గొప్పగా ఉంటుంది. శ్రీరామునికి ఐదుగురితో మిత్రధర్మం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. నరుడు(గుహుడు-పల్లెవాడు, సామంతరాజు); వానరుడు (సుగ్రీవుడు-సూర్యాంశసంభూతుడు); దానవుడు(విభీషణుడు-సత్త్వ గుణసంపన్నుడు); తిర్యగ్జాతి(జటాయువు-దశరథుని మిత్రుడు, గరుత్మంతుడు-విష్ణువువాహనం)

**1)గుహుడు-రాముడు:** అయోధ్య నుండి సీతాలక్ష్మణసమేతుడై శ్రీరాముడు అరణ్యవాసానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో గంగా నది ఒడ్డున ఉన్న శృంగిబేరపురానికి శ్రీరాముడు వెళ్లాలనుకున్నాడు. శృంగిబేరపురాన్ని గుహుడనే నిషాదరాజు పరిపాలిస్తున్నాడు. అతడు చతురంగబలాలు కలవాడు.

రాముడు రాజకుమారుడు. గుహుడు సామంతరాజు. ఇద్దరూ జీవాత్మసంభూతులే. గుహుడు రామునికి ప్రాణంతో సమానమైన మిత్రుడు. గుహుడిని చూడాలని శ్రీరాముడు, శ్రీరాముని రాక కోసం గుహుడు తహతహలాడారు.

వీరిద్దరి మైత్రిబంధం ప్రగాఢమైనది. జాతిచేత, ధనం చేత, విద్యచేత గుహుడు శ్రీరామునితో సమానుడు కాడు. మిత్రత్వానికి సమత్వం ఉండాలి కనుక సమన్వయం చూద్దాం. గుహుడు, రాముడు మానవజాతికి చెందినవారు. ధనం విషయానికి వస్తే గుహుడు అభిమానమే ధనంగా కలవాడు. జ్ఞానం విషయానికి వస్తే గుహుడు అపరిమితమైన భక్తితత్త్వంతో ప్రకాశించే విద్యావంతుడు. గుహుడు తనకు ధీటైన స్నేహితుడు అని శ్రీరాముడే హనుమంతునితో స్వయంగా అన్నాడు.

**2)సుగ్రీవుడు-రాముడు:** సీతాపహరణం అనంతరం సీతాన్వేషణ క్రమంలో శ్రీరాముడికి సుగ్రీవుడితో మైత్రి కుదిరింది. మిత్రధర్మం కోసం రాముడు వాలిని సంహరించాడు. సుగ్రీవునికి భార్యని అప్పగించి కిష్కింధకు రాజును చేశాడు. సుగ్రీవుని శోకం రాముని వల్ల అంతమైంది. దుఃఖంలో ఉన్న, సుఖంలో ఉన్న మిత్రునకు మిత్రుడే రక్షకుడు. ధైర్యం చెప్పి అశాంతిని తొలగించి మానసికస్థితిని నెలకొల్పడం ఒక్క మిత్రునికే సాధ్యం. ఇదే మిత్రధర్మం.

సీతాన్వేషణలో రామునికి సుగ్రీవునితోపాటు వానరసైన్యం అంతా సహకరించింది. సుగ్రీవునితో ఏర్పడ్డ మైత్రిబంధం, వాయుపుత్రుని ప్రభావం, వీరి అమృతకృత్యాలు అవ్యక్తమైనవి. ధర్మమే సోదరుడు, దయయే మిత్రుడు.

**3)విభీషణుడు-రాముడు:** రామరావణయుద్ధంలో రావణసోదరుడైన విభీషణుడు శ్రీరాముడి పక్షం వహించాడు. భాస్కరరామాయణం, ఆనందరామాయణం, శ్రీకృష్ణరామాయణాలలో విభీషణుడు రావణుని మరణరహస్యం శ్రీరామునికి చెప్పినట్లు ఉంది. దుష్టశిక్షణ నిమిత్తం అలా చేశాడు.

**4)జటాయువు- శ్రీరాముడు :** జటాయువు దశరథునికి మిత్రుడు. జటాయువు గ్రద్ద ఆకారంలో ఉంటాడు. సీతమ్మ జాడ తెలిపి జటాయువు మరణించాడు.

జటాయువు మాటలు విన్నాక సీత దొరుకుతుందని రాముడు విశ్వసించాడు. రాముడు లక్ష్మణునితో "లక్ష్మణా! జటాయువు ఉత్తమజాతికి చెందిన సత్పురుషుడు. ధర్మాచరణ కలవాడు. పరోపకారంకోసం శరీరాన్ని త్యజించిన యోగ్యుడు. మనకు పితృతుల్యుడు. మిత్రధర్మాన్ని నిర్వర్తించాడు. మనం ఈ జటాయువుకి అంతిమ సంస్కారాన్ని చెయ్యాలి అన్నాడు. పితృదేవతలకు తర్పణాలు ఇస్తే వంశం వృద్ధి చెందుతుంది కనుక పితృతుల్యులైన జటాయువుకి శ్రీరాముడు అంత్యక్రియలు చేశాడు.

**5) గరుత్మంతుడు- శ్రీరాముడు:** యుద్ధంలో ఇంద్రజిత్తు ప్రయోగించిన నాగాస్త్రంతో రామలక్ష్మణులు బంధింపబడ్డారు. నాగులు తీవ్ర విషం గలవి. ఆ నాగులను చూచి జలచరాలన్నీ సముద్రంలోకి పారిపోయాయి. వానరులందరూ వైనతేయుడిని సందర్శించారు. అతణ్ణి చూడగానే బాణాలుగా మారి రామలక్ష్మణులను బంధించిన సర్పాలన్నీ పారిపోయాయి. గరుడుడు అమృత భాండాన్ని స్పృశించిన వాడు కనుక రామలక్ష్మణులను తాకగానే వారి శరీరాలు దివ్యకాంతితో ప్రకాశించాయి. గరుత్మంతుడు, రామలక్ష్మణులు పరస్పరం అభినందించుకున్నారు.

రాముడు ధర్మానికి ప్రతిరూపం. అలాంటి రాముడు మిత్రధర్మానికి కూడా సరైన న్యాయం చేకూర్చాడు. స్వయంగా అవతార పురుషుడైన రాముడిని మిత్రునిగా పొందిన గుహుడు, విభీషణుడు, సుగ్రీవుడు, జటాయువు, గరుత్మంతుడు భాగ్యవంతులు. రామ కార్యంలో తమవంతు సహాయాన్ని అందించారు.



బాలనీతి

# ఓర్పు అవసరం

– శ్రీమతి నల్లాని రాజేశ్వరి,
99086 02443

బృందావనంలో శ్రీకృష్ణబలరాములు ఎందరో రాక్షసుల్ని సంహరించారు. ఎప్పటికప్పుడు కంసుడు ఈ విషయాలు తెలుసుకుంటూనే ఉన్నాడు. కానీ, నారదుడు పనిగట్టుకొని వచ్చి శ్రీకృష్ణబలరాముల జన్మవృత్తాంతాన్ని కంసుడి చెవిన పడేశాడు. అంతే! దేవకీవసుదేవులు తననిలా మోస గించారని, తిరిగి వారిని ఖైదు చేసేశాడు. ఇక ఆలస్యం చేయ కుండా, ముందుగా కేశి, వ్యోమాసురుల నిద్దరిని బలరామ కృష్ణుల్ని సంహరించి రమ్మని పంపాడు.

తర్వాత సభ చేసి, తన వద్ద ఉన్న చాణూర, ముష్టికు లనే ఇద్దరు మల్లయుద్ధ మహాయోధులను, సాళ్వ, కోసల ప్రముఖులను పిలిపించి, బలరామకృష్ణుల్ని చంపటానికి, చతుర్దశినాడు “ధనుర్యాగం” చేయించి, మల్లయుద్ధంలో పోటీలు పెడుతున్నట్లు రాజ్యమంతటా ప్రకటించి, శ్రీకృష్ణబలరాములను ఆ పోటీలో పాల్గొనేందుకు పిలిపించేట్లుగా అద్భుత ఉపాయం పన్నాడు.

కంసునిలాంటి నియంతరాజ్యంలోనే, తమ సాధుత్వాన్ని తమలో ఇముడ్చుకుని జీవిస్తున్న ఎందరో శ్రీకృష్ణభక్తు లలో అక్రూరుడు ఒకడు. ఆయన శ్రీకృష్ణుడిని దైవంగా




భావించే విష్ణుభక్తుడు. కంసుడు యదుశ్రేష్ఠుడైన అక్రూరుడిని పిలిపించాడు.

“అక్రూర! క్రూరస్వభావం లేనివాడవు నీవు. నీ పేరు సార్థకమైంది. నీతో ఎవరైనా స్నేహం చేయగలరు. బృందావనంలో యాదవబాలకులుగా ఉన్న బలరామ కృష్ణులు నన్ను చంపడానికి ఉవ్విళ్లూరుతున్నారని తెలిసింది. నీవు వాళ్లను పిలుచుకుని వచ్చి నాకప్పగించు. నీవు వాళ్లను పిలుచుకుని వస్తే నా నగరిలో ఉన్న మదపుటేనుగు వాళ్లను మర్దిస్తుంది. అది బ్రహ్మాండాన్నైనా పెకలించి వేస్తుంది. అలాంటి ఏనుగుకు బలరామకృష్ణుల్ని కూల్చడం ఒక లెక్కా? అక్రూరా! చాణూర ముష్టికులనే వస్తాదులు నా దగ్గర ఉన్నారు. బలసంపదలో వాళ్లు వాయుదేవుణ్ణి మించిన వాళ్లు. మల్లయుద్ధంలో ఆ యోధులు ఆ బాలకులిద్దరినీ తేలికగా చంపేస్తారు. వాళ్లు మరణించిన తర్వాత మా తండ్రి ఉగ్రసేనుణ్ణి, మా పినతండ్రి దేవకుణ్ణి నేను పరిమార్చి శత్రుశేషం లేకుండా చూచుకుంటాను. ఆ తర్వాత జరాసంధాది మిత్రులతో కలిసి సమస్తభూమండలాన్ని హాయిగా, ఎదురు లేకుండా పరిపాలిస్తాను. కనుక నువ్వు బృందావనానికి వెళ్లి, వాళ్లను పిలుచుకుని రా! అంతవరకూ ఈ రహస్యం మనిద్దరి మధ్యే ఉండనివ్వు” అని చెప్పాడు.

అక్రూరుడు కూడా కాదనలేదు. “నీవు పొమ్మంటే పోక తప్పుతుందా? మానవులు తమకు రాబోయే పరిణామాలు ఊహించకుండా ఏవో ఆలోచనలు చేస్తారు. కానీ, ఈశ్వరేచ్ఛ మాత్రమే జరిగితీరుతుంది. తప్పక వెళ్లి వారిని పిలుచుకుని వస్తాను!” అని పైకి చెప్పి, లోలోపల ఈ అవకాశంతోనైనా శ్రీకృష్ణుణ్ణి కళ్లారా చూచి, నోరారా స్తోత్రం చేసే అవకాశం లభించింది అని ఉప్పొంగిపోయాడు. నిస్సహాయభక్తుడైన

అక్రూరుడు. కంసుని కపట ఆలోచన తెలిసి తనను మరణానికి అభిముఖంగా పిలవటానికి వచ్చాడీ అక్రూరుడని శ్రీకృష్ణుడు తనను నిరాదరిస్తాడో, లేక ఎందరో రాక్షసుల్ని సంహరించిన ఆ మహానుభావుడు కంసవధకు రంగం సిద్ధమైందని ఆనందించి, తన వెంట వస్తాడోనని డోలాందోళితమనస్సుతోనే అతను బయలుదేరాడు.

నానావిధ పుష్ప, వృక్షభరితమైన, హాయిగా మేసి బలిష్ఠంగా ఉన్న గోవులతో కూడిన బృందావనాన్ని అక్రూరుడు చూచాడు. పద్మపత్రాలవంటి కన్నులు, ప్రకాశిస్తున్న దేహం, సుందరమైన గాత్రం కలిగిన బలరామకృష్ణుల్ని చూచాడు. ఆనందభాష్పాలు రాల్చుతూ వాళ్లకు నమస్కరించాడు. అతణ్ణి బలరామకృష్ణులిద్దరూ కౌగలించుకున్నారు. నందగృహంలో అతిథి మర్యాదలయ్యాక అక్రూరుడు తాను వచ్చిన పని చెప్పాడు. శ్రీకృష్ణుడు నవ్వి నందగోపాలురందరితో, ధనుర్యాగం చూడడానికి అందరినీ తమ తమ వాహనాలలో సిద్ధం కమ్మని ఆజ్ఞ ఇచ్చి, తాను, బలరాముడు అక్రూరుని వెంట మధురా నగరానికి ప్రయాణమయ్యారు. అమాయకులైన గోపికాస్త్రీలు భోరున విలపించారు. శ్రీకృష్ణుడు వాళ్లనందరినీ ఊరడించి, తన జన్మకర్తవ్యానికి తొలివేదికగా భాసించిన బృందావన సౌందర్యసీమలనూ, నిష్కలంకభక్తహృదయాలను తరింపజేసి, మధురానగరం వైపు, కంసవధకు, ఒక నియంతను అంతం చేయడానికి, ఒక రాజకీయ సుస్థిర రాజ్యస్థాపనకు నాంది పలకడానికి, తన అజేయపరాక్రమాన్ని ఋజువు చేసే రంగ స్థలంగా ధనుర్యాగమండపానికి దగ్గరవుతూ వ్రేపల్లె గోపాలకుడి స్థాయి నుండి రాజకీయవేత్తగా బయల్దేరాడు.



అక్రూరుడు బలరామకృష్ణులను కూర్చోబెట్టుకుని యమునానది దాటించాడు. దారి మధ్యలో సంధ్య వార్చి వస్తానని చెప్పి, యమునలో దిగి ముఖం, కాళ్లు చేతులు కడుక్కుంటూ ఆ యమునా నదీజలాల్లో ముందుగా సర్వ భూభారాన్ని మోస్తూ, అనంతకోటిమణిమయపడగలతో అలరారుతున్న ఆదిశేషుణ్ణి దర్శించాడు. ఆ ఆదిశేషుని తల్పం మీద శంఖ చక్రగదాధరుడై, లక్ష్మీసమేతుడై, తన దరహాసంతో లోకాల నన్నింటినీ రక్షిస్తున్న శ్రీమన్నారాయణమూర్తిని చూచాడు. ఆ మూర్తి ఎవరో కాదు సాక్షాత్తు శ్రీకృష్ణుడే! తత్తర పాటుతో దూరంగా నిలిచివున్న రథం వైపు చూచాడు అక్రూరుడు. రథంలో శ్రీకృష్ణబలరాములు కూర్చుని ఉండడం స్పష్టంగా కన్పిస్తోంది. అక్రూరుడు పరవశించి పోయారు. ఆ తర్వాత యమునాజలంలోని శ్రీకృష్ణుని మూర్తికి నమస్కరించి మళ్లీ రథం అధిరోహించాడు.

ఈనాడు మనం చూస్తున్న ఎందరో అధికార మదాంధుల కొలువుల్లో, హృదయం నిండాభక్తి, పైకి కనబరచలేని నిస్సహాయత, కాలం కలిసివచ్చే వరకూ సహనం వహించే క్షమ, భగవంతునిపై అచంచల భక్తివిశ్వాసాలు కలిగి ఉన్న "అక్రూరు" లెందరో ఉన్నారు. వాళ్లు పైకి కన్పించరు, అట్టహాసంగా ప్రవర్తించరు. మునిపుంగవుల్లా మౌనంగా ఉంటారు. కాలప్రవాహానికి ఎదురీదకుండా తలవంచి ఉంటారు. కంసుని లాంటి అధికార నియంతలు అంతరిస్తారు. అక్రూరులు చిరంజీవులుగా, యుగాల పర్యంతం భగవంతుని హృదయాల్లో నిలిచిపోతారు. అందుచేత ఎవరికైనా ఓర్పు, సహనం చాలా అవసరం.

ఆయుర్వేదం

# అమృతంతో సమానం

- డా॥ చిట్టిభొట్ల మధుసూదనశర్మ, 90007 61390

**ఆగష్టు 1వ తేదీ నుండి 07తేదీ వరకు ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా...**

నవమాసాలు మోసి శిశువుకు జన్మనిచ్చిన తల్లి నుంచి ఆ శిశువుకు అందే ప్రప్రథమ అమృతాహారం తల్లిపాలు. మాతృ క్షీరమే శిశువు బంగారు భవిష్యత్తుకు, ఆరోగ్యపరిరక్షణకు పునాది. ఈ క్షీరంలో శిశువు ఎదుగుదలకు అవసరమైన సమస్త పోషకాలు, ఔషధతత్వాలు నిక్షిప్తమై ఉంటాయి. వీటి వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరుగుతుంది. వాంతులు, విరేచనాల వంటి జీర్ణాశయసంబంధవ్యాధులు, చర్మవ్యాధులు, స్థూలకాయంనుంచి రక్షణ కలుగుతుంది.


శిశువులకి స్తన్యమివ్వటం వల్ల తల్లుల్లో కూడా గర్భావస్థలో దేహంలో పెరిగిన క్రొవ్వుశాతం తగ్గుతుంది. వెంట వెంటనే గర్భధారణ కూడా జరుగదు. బిడ్డలకు పాలిచ్చే తల్లులకు బ్రెస్ట్‌కేన్సర్ సోకే అవకాశాలు కూడా తక్కువ.

గర్భస్రావాలు ఎక్కువగా కావటం, పోషకాహారలోపం, మానసిక అలజడి, ఆందోళన, ఆతృత, హార్మోన్ల అస్తవ్యస్తత, రొమ్ముల్లో ఇన్ఫెక్షన్లు, బాగా వయస్సు వచ్చాక గర్భం ధరించడం వంటి కారణాలవల్ల కూడా కొందరిలో ప్రారంభం నుంచే పాల కొరత ఏర్పడుతుంది. కొందరిలో పాల ఉత్పత్తి అతికొద్దిగా మాత్రమే ఉండి శిశువుకు సరిపడవు. ఇంకొందరిలో ప్రారంభంలో పాలు బాగా ఉండి కొద్దిరోజుల తరువాత క్రమంగా తగ్గిపోతాయి.

తల్లులకు పాలు సమృద్ధిగా ఉత్పత్తి అయ్యేందుకు ఈ క్రింది గృహ వైద్య విధానాలు చక్కటి ఫలితాలనిస్తాయి. ఏదో ఒక విధానాన్ని మాత్రమే అనుసరించాలి.

200గ్రాముల బెల్లంలో 50గ్రాముల శొంఠిపొడి వేసి మొత్తం బాగా కలిపి పూటకు 2-5గ్రాములు చప్పరించి 100మి.లీ. పాలు సేవించాలి.

రోజూ రెండుసార్లు పూటకు 100మి.లీ. పాలలో 3, 4 వెల్లుల్లి పాయల్ని నిలువుగా కత్తిరించి మెత్తగా అయ్యేలా ఉడికించి చల్లార్చి 5మి.లీ. తేనె కలిపి వెల్లుల్లితోసహా సేవించాలి. జీలకర్ర వేయించి చేసిన చూర్ణం, పటికబెల్లం పొడి ఒక్కొక్కటి 75గ్రాముల చొప్పున కలిపి ఉంచుకుని రోజూ ఉదయం, సాయంత్రం పూటకు అర టీస్పూన్ పొడిని 100మి.లీ. పాలలో కలిపి సేవించాలి.



వాముని వేయించి పొడి చేసి రోజూ రెండు పూటలా ఆహారానికి అరగంట ముందు పూటకు 2 గ్రాముల పొడిని తగినంత తేనెతో కలిపి సేవించాలి. 60గ్రాముల చొప్పున మెంతులను వేయించి చేసిన పొడి, పటికబెల్లం పొడి కలిపి ఉంచుకుని రోజూ మూడు పూటలా ఆహారానికి 15నిమిషాల ముందు పూటకి 2గ్రాముల పొడిని 50మి.లీ. నీటిలో కలిపి సేవించాలి. రోజూ ఒకట్రెండుసార్లు పూటకు 150మి.లీ. పాలలో రెండు టీ స్పూన్ల బార్లీ గింజలు, ఒక టీ స్పూన్ పంచదార వేసి మరిగించి దించి చల్లార్చి సేవించాలి. రోజూ పరగడుపున 100మి.లీ. నీటిలో 10తులసి ఆకులు, 2గ్రాముల అతి మధురం పొడి, అర టీస్పూన్ తాటి కలకండ కలిపి సన్నని మంటపై మరిగించి దించి చల్లార్చి వడగట్టి 50మి.లీ. కాచిన పాలు కలిపి సేవించాలి. రోజూ ఒకసారి 200మి.లీ. పాలలో 30-40గ్రాముల మినప్పప్పు వేసి మెత్తగా అయ్యేలా ఉడికించి చల్లార్చి తగినంత పంచదార కలిపి సేవించాలి.

బెల్లం, సోంపు గింజల చూర్ణాన్ని, దినుసుకి 150 గ్రాముల చొప్పున కలిపి ఉంచుకుని ఉదయం, సాయంత్రం పూట ఒక టీస్పూన్ సేవిస్తుండాలి.

ఆయుర్వేదౌషధవిక్రయశాలలో లభ్యమయ్యే శతావర్యాది చూర్ణాన్ని రెండు పూటలా పూటకు అర టీ స్పూను వంతున 100 మి.లీ. పాలలో కలిపి సేవిస్తుండాలి.

శ్రావణశుక్లపౌర్ణమిరోజున సంస్కృత దినోత్సవం

# ఈ భాష అజరామరం..!

– సారస్వతకళానిధి, డా॥ వెలువోలు నాగరాజ్యలక్ష్మి,
93941 13848

భారతదేశంలోని జీవద్భాషలలో అతిసనాతమైంది సంస్కృతం. భారతజాతీయతకు జీవగఱ్ఱ, సరస సాహిత్య జ్ఞాన విజ్ఞాన రత్నమంజూష సంస్కృతం. ఏ భాషలోనైనా కూలంకషమైన పాండిత్యసాధనకు సంస్కృతభాషాజ్ఞానం అత్యంతావశ్యకం.

వాఙ్మయం అవతరించక పూర్వమే సంస్కృతంలో సాహిత్యలత అంకురించి విస్తరించింది. ప్రపంచసారస్వతంలో ఋగ్వేదం ఆదిగ్రంథం.

ఆధునిక విజ్ఞానంలో గణితశాస్త్రం ఎంతటి ప్రాధాన్యం వహిస్తుందో ప్రపంచభాషలకు సంస్కృతం అంతటి ప్రాధాన్యం వహిస్తుంది.

ప్రపంచంలో మొదటికావ్యం రామాయణం సంస్కృతం లోనిది. మొదటి జ్యోతిషగ్రంథమూ, ఇతర శాస్త్రగ్రంథాలు, మొట్ట మొదటి వ్యాకరణగ్రంథమూ సంస్కృతంలోనే ఉద్భవించాయి. పాణిని విరచిత 'అష్టాధ్యాయి' వ్యాకరణగ్రంథం ఒక అద్భుతసృష్టి. భాషను నియంత్రించే వ్యాకరణశాస్త్రం ఒక సైన్సుగా పరిగణింపబడే స్థితి సంస్కృత వ్యాకరణగ్రంథానికే ఏర్పడింది.


సంస్కృతంలోని శబ్దశక్తి అపారమైంది. ఒక్కొక్క అక్షరాన్ని ఉచ్చరించటంలో మానవుని ముఖయంత్రంలోని ఒక్కొక్క భాగం చైతన్య వంతం అవుతుంది. సంస్కృతపద ఉచ్చారణ వల్ల శారీరకయోగసాధన సత్ఫలితం సిద్ధిస్తుంది. శారీరక ఆరోగ్యం వృద్ధి చెందుతుంది. నాద తంత్రులు శక్తిని పుంజుకుంటాయి.

ప్రపంచంలో ఏ భాష సాధించలేని ఒక విశిష్టతను సంస్కృతం సాధించిందని స్వామి వివేకానంద పేర్కొన్నారు. ఏ భాషలోనైనా కావ్యం రసవంతమై రమ్యతరంగా ఉంటే దానిలో ధర్మబోధ తక్కువగా ఉంటుంది. ధర్మబోధ అధికమైన కావ్యంలో రమ్యత స్వల్పంగా ఉండవచ్చును. రమ్యతను, ధర్మ్యతను అత్యున్నతంగా, సమానస్థాయిలో సాధించిన గ్రంథం వాల్మీకి రామాయణం.

కనుక సంస్కృతభాషా ఉచ్చారణ దైహికమైన శక్తిని, సాహిత్యం మనోల్లాసశక్తిని అందించగల మహోన్నతమైన భాష. నైతికంగాను, ధార్మికంగాను సంస్కృతభాష మానవులకు కలిగించే అభ్యున్నతి నిరుపమానం. సంస్కృతవాఙ్మయం ఆధారంగానే పాశ్చాత్యులు తమ సంస్కృతీమూలాలను గ్రహించారు.

ప్రస్తుతం మన ప్రాంతీయభాషలకు సంస్కృతం వల్ల సంభవించే పరిపుష్టి వర్ణనాతీతం. ఏ భావాన్నైనా, ఏ భావచ్ఛాయనైనా ప్రాంతీయభాషలలో వెలువరించగల శబ్దసంపద సంస్కృతభాషకుంది. ఒక ధాతువు నుండి శతాధిక పదబంధాలను సృజించే విస్తృత అవకాశం సంస్కృతభాష వైశిష్ట్యం.

ఇంతటి సర్వతోముఖ సౌభాగ్యసంపన్నమైన సంస్కృతభాష భారతభాగ్యరాశిలో అమూల్యరత్నం. భారతీయుల భారతీయతను నిలబెట్టగలిగిన సర్వప్రముఖసాధనం సంస్కృతం. హిందూధర్మంతో పాటు సంస్కృతభాష కూడ అజరామరం. "ప్రతి హిందువు అవసరం వచ్చినప్పుడు సంస్కృతంలో మాట్లాడగలిగి ఉండవలయును"– మహాత్మాగాంధీ.



పాఠం-33

# సంస్కృతం నేర్చుకుందాం..!!

రచన- కీ.శే. మహామహోపాధ్యాయ కాశీ కృష్ణాచార్య
నిర్వహణ- ఆచార్య కొంపెల్ల రామసూర్యనారాయణ

| | ए | ब |
|---|---|---|
| प्र | रामः | रामाः |
| द्वि | रामम् | रामान् |
| त्रु | रामेण | रामैः |
| च | रामाय | रामेभ्यः |
| पं | रामात् | रामेभ्यः |
| ष | रामस्य | रामाणाम् |
| स | रामे | रामेषु |
| सं प्र | हे राम! | हे रामाः |

| ए | ब |
|---|---|
| फलम् | फलानि |
| फलम् | फलानि |
| फलेन | फलैः |
| फलाय | फलेभ्यः |
| फलात् | फलेभ्यः |
| फलस्य | फलानाम् |
| फले | फलेषु |
| हे फल! | हे फलानि! |

अम्बा शब्दः - स्त्रीलिङ्गः (స్త్రీలింగః) (అమ్మ)


| | ए | ब |
|---|---|---|
| प्र | अम्बा | अम्बाः |
| द्वि | अम्बाम् | अम्बाः |
| त्रु | अम्बया | अम्बाभिः |
| च | अम्बायै | अम्बाभ्यः |
| प | अम्बायाः | अम्बाभ्यः |
| ष | अम्बायाः | अम्बानाम् |
| सं | अम्बायाम् | अम्बासु |
| सं प्र. | हे अम्ब! | अम्बाः! |


అకారాంత పుంలింగ శబ్దాలన్నీ '**राम**' శబ్దం వలే, అకారాంత నపుంసక లింగ శబ్దాలన్నీ '**फल**' శబ్దం వలే ఆకారాంత స్త్రీ లింగ శబ్దాలన్నీ సంబోధనైకవచనమునందు తప్ప '**अम्बा**' శబ్దంవలే సాధారణంగా చెప్పవచ్చు.

చిత్ర కథ

# దేనికైనా ముందుచూపు ఉండాలి...

కథ– డా॥కంపల్లె రవిచంద్రన్
చిత్రాలు– శ్రీ తుంబలి శివాజీ





దశరథా! ఎవరితో మాట్లాడుతున్నావు? నా సంగతి తెలుసుకదా! నా గమనానికి ఆటంకం కలిగిస్తే ఇక ప్రళయమే..
దేవా! శాంతించండి. తమరు రోహిణీ నక్షత్రమండలంలో ప్రవేశిస్తే మేము అల్లాడిపోతాం. దయచేసి వెనక్కు మరలండి.
హ్హా హ్హా హ్హా! వెనక్కు మరలడమా! మాకు ముందుకుపోవడమే తెలుసు. అడ్డు తొలగు...
స్వామీ మీకు విన్నవించుకున్నాను మా బాధలు.. మీరు మనసు మార్చుకోకపోతే విరోధం తప్పదు.
హ్హా హ్హా హ్హా! సామాన్యమానవుడు ఈ గ్రహదేవునితో విరోధించడమా?
దశరథుడు వింటినారి సారించాడు.
భూలోకవాసుల ప్రాణాలు రక్షించడం కోసం ఈ పని తప్పడం లేదు.
ఆగు దశరథా! ఆగు! అస్త్రాన్ని ఉపసంహరించు. నీ విన్నపాన్ని మన్నిస్తున్నాను. నీ చిత్తశుద్ధిని పరీక్షించాలనే నీ ప్రార్థనను మొదట తిరస్కరిస్తూ నటించాను. నీకు ఏం వరం కావాలో కోరుకో!
శనిమహాత్మా! ధన్యోస్మి! ఈ నాటి నుండి తమరు ఎప్పటికీ రోహిణీ నక్షత్రమండలంలో ప్రవేశించకూడదు.
అలాగే దశరథా! ఇకమీదట నేను రోహిణీనక్షత్రమండలంలో ప్రవేశించను.
దశరథుడు చేతులు జోడించి శనిభగవానుని స్తుతించాడు.
దశరథా! నీవు గానంచేసిన ఈ స్తోత్రానికి 'దశరథ కృత శనిస్తోత్రం' అనే పేరు ప్రసాదిస్తున్నాను. భక్తిశ్రద్ధలతో ఈ అపూర్వస్తోత్రం పఠించేవారికి గ్రహపీడ ఉండదు.
ధన్యోస్మి మహాత్మా! ధన్యోస్మి!
2

## పద విన్యాసం

ఈ క్రింది ఆధారాలతో 'అప' తో ఆరంభమయ్యే పదాలను రాయండి

| | | | |
|---|---|---|---|
| 01) | బంగారం | అప | |
| 02) | తప్పు | అప | |
| 03) | కీడు | అప | |
| 04) | చెడ్డపేరు | అప | |
| 05) | దోషి | అప | |
| 06) | అనాచారం | అప | |
| 07) | సత్యం కానిది | అప | |
| 08) | ఓటమి | అప | |
| 09) | శృతిలోపం | అప | |
| 10) | స్వరదోషం | అప | |

జవాబులు:

01) అపరంజి, 02) అపరాధం, 03) అపకారం, 04) అపకీర్తి, 05) అపరాధి, 06) అపచారం, 07) అపద్ధం, 08) అపజయం, 09) అపశ్రుతి, 10) అపస్వరం

## రంగులు వేద్దాం..!!





పై చిత్రాన్ని చూసి రంగులు వేయండి

## పిల్లలూ.. మీకు తెలుసా....?

| | |
|---|---|
| 60 సెకండ్లు | = 1 నిముషం; |
| 60 నిముషములు | = 1 గంట; |
| 24 గంటలు | = 1 దినం (లేక) 1 రోజు; |
| 7 దినాలు | = 1 వారం; |
| 30 దినాలు (లేక) 4 వారాలు | = 1 నెల; |
| 12 నెలలు | = 1 సం॥ |
| 10 సంవత్సరాలు | = 1 దశ వత్సరం (డికేడ్) |
| 25 సంవత్సరాలు | = 1 రజిత వత్సరం (సిల్వర్ జూబ్లీ) |
| 50 సంవత్సరాలు | = 1 స్వర్ణ వత్సరం (గోల్డన్ జూబ్లీ) |
| 60 సంవత్సరాలు | = 1 వజ్ర వత్సరం (డైమెండ్ జూబ్లీ) |
| 75 సంవత్సరాలు | = 1 అమృత వత్సరం (ప్లాటినం జూబ్లీ) |
| 100 సంవత్సరాలు | = 1 శత వత్సరం (సెంచరీ) |
| 1000 సంవత్సరాలు | = 1 సహస్రాబ్ది వత్సరం (మిలీనియం) |
| 365 దినాలు, 8 గంటల, 2 నిముషాల, 30 సెకండ్లు | = 1 సంవత్సరం. |

ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒక దినం అదనంగా చేర్చుతారు. దాన్నే లీపు సంవత్సరమని పిలుస్తారు. అందుకు ఫిబ్రవరి నెలలో ఒక దినం అదనంగా చేర్చి లెక్కిస్తారు. అందుకే ఫిబ్రవరి నెలలో 29 దినాలూ లీపు సంవత్సరంలో 366 దినాలు ఉంటాయి.



**ఆగష్టు-2024**

# రాశిఫలాలు

బ్రహ్మశ్రీ తంగిరాల వేంకటకృష్ణపూర్ణప్రసాద సిద్ధాంతి,
తి.తి.దే. ఆస్థానసిద్ధాంతి, రేలంగి



**మేషం-** సంపాదన పెరుగుతుంది. స్త్రీమూలక ధనం లభిస్తుంది. శుభకార్యనిర్వహణ జరుగుతుంది. ఆ సమయంలో గత అనుభవాలను పునః పరిశీలించుకుని ముందడుగు వేస్తారు.



**వృషభం-** సమాజంలో పేరుప్రఖ్యాతులు, ఆరోగ్యం, ధనాగమం, ధైర్యంతో కార్యభారాన్ని నిర్వర్తించడం, ఉద్యోగంలో పదోన్నతి అవకాశం. విద్యార్థులకు ఉన్నతవిద్యలు కలసివస్తాయి. నూతనగృహం, వాహనం కొనుగోలు చేస్తారు.



**మిథునం-**నాలుక అదుపులో ఉంచుకోవాలి. జీతం పెరుగుతుంది. ఇది పురోగతి, ఆనందం, మంచి ఆరోగ్యం మరియు సంపద పెరుగుదల కాలం.



**కర్కాటకం-** శత్రువుల విషయంలో అప్రమత్తత అవసరం. చెడు సహవాసాలు వదిలివేస్తే, శుభ ఫలితాలు, మంచిఆరోగ్యం, మరిన్ని ఆదాయ అవకాశాలు కల్గుతాయి. వ్యాపారం కూడా లాభదాయకంగా ఉంటుంది.



**సింహం-** సంపద, ఆనందం, విద్యలో విజయం, వివాహ అవకాశాలు, వినోదం మరియు వ్యాపారంలో వృద్ధి. చెడుసావాసాల వల్ల తిరోగమనావకాశాలుంటాయి. ప్రయాణాలు వాయిదావేయడం మంచిది.



**కన్య-** మీ ఇల్లు దొంగతనానికి గురికాకుండా అప్రమత్తత అవసరం. అధిక ఆదాయాన్ని పొందుతారు. ఆరోగ్యం సంతృప్తికరంగా ఉంటుంది. విదేశీపర్యటనలో అనవసరమైన ఖర్చు, డబ్బు వృధా అవుతుంది.



**తుల-** ఏకాదశస్థానంలో రవి, బుధ, శుక్రులు అత్యంత యోగప్రదులు. ఈ సమయంలో కొత్త ఆలోచనలు, ప్రణాళికలతో ముందంజవేస్తారు. అనేకరకాలుగా ఆర్థికవృద్ధి, ఋణవిమోచన కలుగుతుంది.



**వృశ్చికం-** వృత్తి, వ్యాపారం అనుకూలం. చదువులో పురోగతి. జ్ఞానం వృద్ధి చెందుతుంది. అనేకవిధాలుగా ప్రయోజనాలు పొందుతారు. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ అవసరం. ఇతరులతో పిడివాదనలు వద్దు.



**ధనుస్సు-**భౌతికపరమైన సుఖాల ననుభవిస్తారు. అన్నిరకాల రుగ్మతలనుండి బయటపడతారు. భూమిని కొనుగోలు చేస్తారు. గృహనిర్మాణంగాని లేక కొనుగోలు చేయటానికి చాలా అవకాశం ఉంది. ఆరోగ్యం బాగుంటుంది.



**మకరం-** విజయం వరిస్తుంది. న్యాయవాదులు అమోఘమైన వాగ్ధాటి వల్ల ఇతరులను కష్టం నుంచి బయట పడేస్తారు. సాంఘికంగా గౌరవ ప్రదమైన స్థానంలో పురోగమనం సాధిస్తారు.




**కుంభం-** ఆదాయవృద్ధికి కొత్త అవకాశాలు లభిస్తాయి. అందరూ ఆరోగ్యంగా ఉండి జీవిత భాగస్వామి మరియు కుటుంబసభ్యుల ఆనందాన్ని చూస్తారు.



**మీనం-** జ్ఞానం వృద్ధి చేసుకుంటారు. ఈ విషయంలో అనేకరకాలుగా ప్రయోజనం పొందుతారు. అన్ని వృత్తులవారికి ప్రోత్సాహకరమైన వాతావరణం మరియు పురోగతి ఉంటుంది.

విశ్వదాభిరామం      వేమన పద్యసూక్తి



## తగనిపనులు

అప్పు దీయ రోత హరిహరాదుల కైన;
మొప్పెతోడ మైత్రి మొదలె రోత;
తప్పు బలుక రోత; తాకట్టిడిన రోత;
విశ్వదాభిరామ! వినుర వేమ!

**అర్థాలు:** రోత= ఏవగింపు; హరిహరాదులు= విష్ణువు, శివుడు మొదలైనవారు; మొప్పె= మూర్ఖుడు; మైత్రి= స్నేహం; తాకట్టు+ఇడిన= కుదువ బెట్టిన.

**భావం:** హరిహరాదులైన అప్పుచేయడం రోత. మూర్ఖునితో స్నేహం అసలే రోత. తప్పు మాట్లాడడమూ రోత. తాకట్టు పెట్టడమూ రోత. ఇవన్నీ కూడనిపనులు.

**వివరణ:** అప్పుచేయడం నీచమైన పని. వడ్డీ తీసుకుంటూ అప్పు ఇవ్వడం ధర్మం కాదు. మూర్ఖులతో కలిసి తిరగడంవల్ల ప్రమాదమే కాని మంచి జరగదు. తప్పుడుమాట మాట్లాడ కూడదు. బంగారం, పొలం, ఇల్లు మొదలైనవి కుదువబెట్టడం కూడనిపని. కొన్నాళ్లకు అసలు వడ్డీ కలిసి కుదువబెట్టిన వస్తువును మించి పోయి, అన్నీ కోల్పోవాల్సి వస్తుంది. సుఖంగా, గౌరవంగా జీవించాలంటే ఏపనులు చేయ గూడదో ఇక్కడ కొన్ని చెప్పాడు వేమన.

– కీ.శే. విద్వాన్ కట్టా నరసింహులు

భాస్కరశతకం

## అహంకారం ఆత్మనాశనం

ఉ. పట్టుగనిక్కుచున్ మదముఁబట్టి మహాత్ములఁదూలనాడినం
బట్టిన కార్యముల్ చెడును బ్రాణముబోవు నిరర్థదోషముల్
పుట్టు, మహేశుఁగాదని కుబుద్ధి నొనర్చిన యజ్ఞ తంత్రముల్
ముట్టక పోయి దక్షునికి మోసము వచ్చెఁగదయ్య భాస్కరా!

**తాత్పర్యం:** భాస్కరా! లోకంలో కొందరు పొగరుబోతులు అహంకారంతో సత్పురుషులను చులకన చేయడానికి నింది స్తుంటారు. అలాంటివారు చేపట్టే పనులేవీ నెరవేరవు. పైగా వారి పాపం ప్రాణాంతకంగా మారి వారిని బాధిస్తుంది. అప్రయోజనకరమైన దోషాలు చుట్టుముట్టుతాయి. పరమేశ్వరుణ్ణి చులకన చేయాలనే కుబుద్ధితో దక్షుడు యజ్ఞం ప్రారంభించాడు. కానీ అది నెరవేరకపోవడంతో యజ్ఞఫలాన్ని పొందలేకపోయాడు. ప్రాణాల మీదకు తెచ్చుకున్నాడు.

మదమాత్సర్యాలవల్ల కలిగే అహంకారం ఎంతటి ప్రమాదకరమో శతక కవి ఈ పద్యంలో రమ్యంగా వివరించాడు. దక్షుడికథను దృష్టాంతంగా చెప్పడం వల్ల పఠితకు భావం సుస్పష్టమౌతుంది. నోటిదురుసుతో శివనిందకు పాల్పడ్డ దక్షుడు చచ్చి బతికాడు. అహంకారంవల్ల ఉత్తమాంగాన్ని కోల్పోయి మేషశిరస్కుడయ్యాడు. దీనివల్ల అహం ఆత్మ నాశనానికేనని, నోటిదురుసుతనం వినాశనానికేనని స్పష్టమౌతోంది. – డా॥ వద్దేపల్లి శ్రీనివాసరావు

## జూన్ నెల క్విజ్-23 సమాధానాలు

| | |
|---|---|
| 01) మహర్నులు | 11) ధర్మము |
| 02) మానవీయదృష్టి | 12) యోగసాధన |
| 03) వాసన | 13) మేల్నాడు |
| 04) కన్ను | 14) సాలిగ్రామం |
| 05) వేదం | 15) ఉత్తరాషాఢ |
| 06) హయగ్రీవుడు | 16) పునర్వన్న |
| 07) సువర్ణద్వీప | 17) సింహవాహనం |
| 08) బ్రహ్మ, విష్ణు, పరమేశ్వరులు | 18) గరుడసేవ |
| 09) సూర్యుడు | 19) చంద్రప్రభ |
| 10) హనుమ | 20) రథోత్సవం |

సరైన సమాధానాలు వ్రాసినవారు–

01)సాయిప్రజ్వల్, ఖమ్మం 02)వై.శ్రీనివాససత్కృత్, బెంగళూరు 03)ఎన్.సుహాంత్ అమర్త్య, తిరుపతి 04)పి.చైత్ర, హనుమకొండ 05)జె.లక్ష్మణ్‌వీర్, ఎస్.సిద్ధార్థసాయి, కుప్పం 06) కె.సాకేత్, హైదరాబాద్ 07)టి.జైవీరవరుణ, హైదరాబాద్ 08)ఎస్.సాత్త్వికి, మెదక్ 09)బి.సాధ్విక, రెడ్డిపేట (శ్రీకాకుళం)

# క్విజ్ 25

01) కంసుడిసభలోని మల్లయోధులు? జ)................................................

02) మళ్లైత్తూరు అంటే అర్థం? జ)................................................

03) రామలక్ష్మణులపై నాగాస్త్రాలు ప్రయోగించిందెవరు?? జ)................................................

04) దేవశిల్పి? జ)................................................

05) కుంతం? జ)................................................

06) సృష్టిలో తీయనిది? జ)................................................

07) బ్రహ్మ నిర్వహించిన యజ్ఞంలో జన్మించినవారు? జ)................................................

08) మేషశిరస్కుడు? జ)................................................

09) వీరశైవంలో ప్రసిద్ధ రగడ? జ)................................................

10) గగనవిహారం కథారచయిత? జ)................................................

11) పృథ్వీతత్త్వానికి సంకేతం? జ)................................................

12) కుండలినీశక్తి రూపం? జ)................................................

13) వీరి స్నేహం మంచిది కాదు? జ)................................................

14) హరిహరాదులకైనా ఏది రోత? జ)................................................

15) కోటి సూర్యుల ప్రతాపాన్ని కలిగింది జ)................................................

## నియమ నిబంధనలు

01) పదిహేనేళ్లలోపు బాలబాలికలు మాత్రమే ఈ 'క్విజ్'లో పాల్గొనాలి.

02) ఇందులో పాల్గొనే పిల్లలు తప్పనిసరిగా హిందువులై ఉండాలి.

03) నిర్దేశించినస్థలంలోనే జవాబులు వ్రాసి పంపాలి. క్విజ్ సమాధానపత్రం జిరాక్సుప్రతులు పంపేటట్లు అయితే, చందా నమోదుసంఖ్య తప్పనిసరి.

04) సమాధానాల్లో కొట్టివేతలు, దిద్దుబాట్లు ఉండకూడదు.

05) జవాబులు చేరాల్సిన చివరితేది 25-08-2024.

06) ఈ క్విజ్‌లో అన్ని సమాధానాలు సరిగ్గా వ్రాసిన బాలబాలికల పేర్లను వచ్చేతదుపరినెల సప్తగిరిమాసపత్రికలో ప్రచురిస్తాం.

07) తి.తి.దే. ప్రధానసంపాదకులవారి కార్యాలయంలో పనిచేసే ఉద్యోగులపిల్లలు ఈ క్విజ్‌పోటీలో పాల్గొనకూడదు.

08) క్విజ్‌కి సంబంధించి ఏ సమాచారమూ ఫోన్‌ద్వారా ఇవ్వ బడదు.

09) ఈ క్విజ్‌లో పాల్గొనే పిల్లల తల్లిదండ్రులు తప్పనిసరిగా సప్తగిరి మాసపత్రిక చందాదారులై ఉండాలి. క్విజ్ సమాధాన పత్రంలో ఈ క్రిందివివరాలు స్పష్టంగా వ్రాసి పంపాలి.

10) జవాబులను బాల్‌పెన్నుతో మాత్రమే వ్రాసిపంపాలి. పెన్సిల్, స్కెచ్, జెల్‌పెన్నులతో వ్రాయకూడదు.

11) ఈ ప్రశ్నలకు జవాబులు ఈ సంచికలోని వ్యాసాల్లోనే ఉన్నాయి. వెతికి వ్రాయండి.

చందాసంఖ్య: ................................ వయస్సు: ..................

పాఠశాల: ................................ తరగతి: ..................

పేరు: ................................................

చిరునామా: ................................................

................................................

................................................

................................ పిన్‌కోడ్: ..................

ఫోన్ సంఖ్య: ................................................

**జవాబులు చేరాల్సిన చిరునామా**

ప్రధాన సంపాదకులు, 'సప్తగిరి' మాసపత్రిక, తి.తి.దే.ప్రెస్ కాంపౌండ్, కె.టి.రోడ్డు, తిరుపతి-517 507. తిరుపతి జిల్లా, ఆంధ్రప్రదేశ్

## తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి



# సప్తగిరి

(ఆధ్యాత్మిక సచిత్రమాసపత్రిక)

## చందా నమోదు పత్రం

**1.** పేరు మరియు చిరునామా :

(విడి విడి అక్షరాలలో అర్థమయ్యేలా వ్రాయండి & పిన్‌కోడ్ తప్పక వ్రాయండి)

______________________________

______________________________

______________________________

(పిన్‌కోడ్ తప్పనిసరి) ☐☐☐☐☐☐

సెల్ నెం. ☐☐☐☐☐☐☐☐☐☐

**2.** కావలసినభాష :

తెలుగు ☐ తమిళం ☐ కన్నడం ☐

హిందీ ☐ ఆంగ్లం ☐ సంస్కృతం ☐

**3.** సంవత్సరచందా : ☐ రూ.240/-

జీవితచందా ☐ రూ.2400/- (12 సం॥రాలు)

**4.** విదేశాలకు సంవత్సరచందా : ☐ రూ.1030/-

**5.** చందా పునరుద్ధరణ :

(అ) చందానెంబరు :

(ఆ) భాష :

**6.** చెల్లించిన మొత్తం :

డి.డి.నెం. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్ మాత్రమే :

........................................ తేది : ....................

ప్రదేశం :

తేది :

చందాదారుని సంతకం

1) సప్తగిరి సంవత్సర చందా రూ.240/-, జీవితచందా(12 సం॥రాలు) రూ.2400/-లు, విదేశాలకు సంవత్సర చందా రూ.1030/-; డి.డి. / ఈ.ఎం.ఓ. / ఐ.పి.ఓ / అట్ పర్ చెక్‌లను 'చీఫ్ ఎడిటర్, 'సప్తగిరి' మ్యాగజైన్, తి.తి.దే., తిరుపతి' వారిపేరున తీయాలి.


2) సప్తగిరిచందాదారులుగా చేరదలచుకొన్నవారు/ తమచందాను పునరుద్ధరించుకోదలచినవారు ఈ కూపనులోగానీ లేక తెల్లకాగితంలోగానీ పైన పేర్కొన్నవిధంగా వివరాలు వ్రాసి పంపవచ్చు. క్రింద ప్రచురించిన చిరునామాను మాత్రమే సంప్రదించండి. ప్రధానసంపాదకకార్యాలయం, తి.తి.దే., తిరుపతికి తప్ప- మీరు ఎవరిదగ్గర డబ్బులు కట్టి, మోసపోకండి.

3) మనిఆర్డరు పంపేవారు - అందులోనే మీచందావివరాలు వ్రాసి, ఈ క్రింది చిరునామాకు పంపాలి.

4) మా చిరునామా "ప్రధాన సంపాదకులు, సప్తగిరి కార్యాలయం, 2వ అంతస్తు, టి.టి.డి. ప్రెస్ బిల్డింగ్, కె.టి.రోడ్డు, తిరుపతి - 517 507".

5) ఇతర వివరాలకు ఫోన్ నెం.0877-2233333, 2277777.

# వైకుంఠపాళి 103



**నిర్వహణ** శ్రీ కోగంటి వేంకట అప్పలాచార్యులు, 90003 24024

### అడ్డం

1)పదితలలు కల్గిన రాక్షసుడు(5); 4)కిరణం(2); 5)నాశనం(3); 6)వేప(2); 10)సీత నపహరించిన రావణునితో పోరాడిన పక్షి(4); 11)శ్రీరామునికి ఆదిత్యహృదయం బోధించిన మహర్షి(4); 13)ఇంటిముందు వేసేది(2); 14)ప్రేమ(3); 15)చీకట్లు(2); 18)మెల్లమెల్లగావీచె గాలి (5)

### నిలువు

1)'దండ'లో గుండెదడ(2); 2)పద్మం(4); 3)రాల్చు, పడవేయు అనే అర్థాల్లో ఉపయోగించేపదం(2); 4)ఉపయోగం(5); 7)ఇన్నిసార్లు పరశురాముడు దండయాత్ర చేశాడు(5) 8)దేవ శిల్పి(3); 9)పక్షి(3); 12)జాబు రాయాలంటే కావాల్సింది!(4); 16)రావణుడు దీనివల్ల పతనమయ్యాడు(2); 17)ఆయుధ విశేషం(2)

జవాబులు ఈ సంచికలోనే ఉన్నాయి. అన్వేషించి... సరిచూసుకోండి.

- ప్రధాన సంపాదకుడు



Printed by Sri P.Ramaraju, M.A., and Published by Dr. K.Radharamana, M.A., M.Phil., Ph.D., on behalf of Tirumala Tirupati Devasthanams and Printed and Published at Tirumala Tirupati Devasthanams Press, K.T.Road, Tirupati - 517 507. Editor: Dr.V.G.Chokkalingam, M.A., Ph.D.

# భక్తుల సేవలో తి.తి.దే. కార్యనిర్వహణాధికారి...



ప్రయాణాలలో ఎన్నో అవస్థలు పడి తిరుమల చేరుకునే శ్రీవారి భక్తులకు సురక్షితమైన వసతి కల్పించాలనే సదాశయంతో తిరుమల, నారాయణగిరి షెడ్లను, నారాయణగిరి ఉద్యానవనాల్లోని క్యూలైన్లను క్షుణ్ణంగా పరిశీలిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామల రావు, ఐ.ఏ.ఎస్., తి.తి.దే. సంయుక్త కార్యనిర్వహణాధికారులు శ్రీమతి. ఎం.గౌతమి, ఐ.ఏ.ఎస్., (విద్య & వైద్యం), శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్.,



తిరుమల ప్రసాదం అంటేనే లడ్డు. భక్తులందరూ ఎంతో పవిత్రంగా స్వీకరించే లడ్డూ ప్రసాదాన్ని తయారు చేసే శ్రీవారి పోటు(తిరుమల)ను పరిశీలిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు, ఐ.ఏ.ఎస్., సంయుక్త కార్యనిర్వహణాధికారిణి (విద్య & వైద్యం) శ్రీమతి. ఎం.గౌతమి, ఐ.ఏ.ఎస్.,



శుచిశుభ్రతలతో, రుచులతో శ్రీవారి అన్నప్రసాదం మెరుగుపరచాలనే సదుద్దేశ్యంతో మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నప్రసాద సముదాయాన్ని నిశితంగా పరిశీలిస్తున్న తి.తి.దే. కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామల రావు, ఐ.ఏ.ఎస్., సంయుక్త కార్యనిర్వహణాధికారి శ్రీ వి.వీరబ్రహ్మం, ఐ.ఏ.ఎస్.,

SAPTHAGIRI (TELUGU) SPIRITUAL ILLUSTRATED MONTHLY Published by Tirumala Tirupati Devasthnams Printing on 25-07-2024 and Posting at Tirupati RMS. Regd. with the Registrar of Newspapers for India under RNI No.21139/1970. Postal Regd. No.TRP/155/2024-2026 "LICENCED TO POST WITHOUT PREPAYMENT No.PMGK/RNP/WPP-04(1)/2024-2026" Posting on 5th of Every Month.




వసుదేవసుతం దేవం కంసచాణూర మర్దనమ్ ।
దేవకీ పరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ ॥

(ఈ నెల 27న గోకులాష్టమి)